మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

సోమవారం MONDAY 29.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 115 ‖ వెల (Price) రూ.6.50 | సప్తమి

సోమవారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-06. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం శరదృతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: సప్తమి సాయంత్రం 4-32 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: మూల పూర్తి. వర్జ్యం: తెల్లవారుజామున 4-30 నుంచి మర్నాడు ఉదయం 6-18 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-06 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-30 నుంచి పగలు 1-18 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-53 నుంచి పగలు 3-41 వరకు. అమృతకాలం: రాత్రి 11-15 నుంచి రాత్రి 1-00 వరకు. సరస్వతీ పూజ, సద్దుల బతుకమ్మ.

ఆపరేషన్ తిలక్



అజేయ అర్ధసెంచరీతో విజృంభణ

ఫైనల్లో పాక్‌పై భారత్ విజయం

9వ సారి ఆసియా కప్ కైవసం

› 12

• కేటీఆర్‌పై అభిమానంతో..



బీజేపీ, కాంగ్రెస్ జాయింట్ వెంచర్ సర్కార్

2 పార్టీలు కలిసే తెలంగాణకు నష్టం చేస్తున్నయ్.. 12 ఏండ్లుగా ప్రజల్ని సతాయిస్తున్నయ్: కేటీఆర్

ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి పాలమూరును ఎడారిగా మార్చే కర్ణాటక కాంగ్రెస్ కుట్రలను అడ్డుకోకుండా నల్లమల్ల పులిబిడ్డనని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి, పిల్లిలా ఇంట్లో కూర్చున్నడు. రేవంత్‌రెడ్డీ.. నీకు దమ్మూధైర్యముంటే.. నల్లమల పులిబిడ్డవే అయితే.. ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకొని తెలంగాణ ప్రయోజనాలను కాపాడు.

-కేటీఆర్



- కేసీఆర్‌ను ఎదుర్కోలేక అప్రతిష్ఠ పాల్జేస్తున్నయి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటిని బొందపెట్టాలి
- సీఎం రేవంత్‌రెడ్డి నల్లమల్ల పులిబిడ్డ కాదు..పిల్లి
- ఆల్మట్టి ఎత్తు పెంచుతుంటే ఇంట్లో దాక్కున్నడు
- పదవి కాపాడుకొనేందుకే కర్ణాటక కుట్రలపై మౌనం
- కాంగ్రెస్ నాయకులకు బాకీకార్డులతో బుద్ధి చెప్పాలి
- అచ్చంపేట 'జన గర్జన' సభలో కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కాంగ్రెస్-బీజేపీ కలిపి నడుపుతున్న జాయింట్ వెంచర్ సర్కార్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. 11-12 ఏడ్లుగా ఈ రెండు పార్టీలు రాష్ట్రాన్ని సతాయిస్తూ, తీవ్ర నష్టం చేస్తున్నాయని మండిపడ్డారు. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేక అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్రపూరితంగా చేతులు › 2వ పేజీలో

నల్లమలలో గులాబీ గర్జన

అచ్చంపేటకు పోటెత్తిన ప్రజలు

వానలోనూ వెల్లువెత్తిన అభిమానం

ర్యాలీలో అడుగడుగునా కేటీఆర్‌కు జనం జేజేలు

› 2

బస్తీ బతుకులపై బురద

ఇండ్లలో నీళ్లు.. పేదల కన్నీళ్లు.. మూసీ ముురుగులో నివాసాలు



మూసీ వరదతో ముంచెత్తిన బురదలో మూసానగర్ వాసులు

- తడిసిన సామాన్లు, వస్తువులు
- ఉపాధి పోయె.. సాయం లేదాయె
- అటు దిక్కు చూసే నాథులే లేకపాయె
- గుండెలు బాదుకుంటున్న నిరుపేదలు
- సర్వస్వం కోల్పోయి తీవ్ర అవస్థలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపునింపుకోలేని బతుకుల్ని మూసీ నిలువునా ముంచింది. ఇరుకిల్లే ప్రపంచం అనుకునే బీదల బతుకుల్లో బురద కొట్టింది. అధికారులు హెచ్చరికలు లేకుండానే జలాశయాల గేట్లు ఎత్తడంతో బస్తీవాసులను మూసీ ముట్టడించింది. శుక్రవారం సాయంత్రం నదీ ప్రవాహం ఇంటిల్లిపాదినీ తరిమికొట్టింది. తలోదిక్కుపోయిన జనం మళ్లీ ఇంటికొచ్చి చూసుకుంటే ఏమీ మిగల్లేదు. అంతా వరదపాలై పోయిందని ఏడ్వడం తప్ప బస్తీల్లో మరో మాట లేదు. రెండు రోజుల వరద › 5వ పేజీలో



గరీబోళ్లంటే సర్కార్‌కు పగ

ఈడ పాతికేండ్ల నుంచి ఉంటున్నం. నా భర్త చనిపోయిండు. నేనే కూలి పనులు చేసుకుంట పిల్లల్ని సదివించుకుంటున్న. మొన్ననే నా బిడ్డ పెండ్లి చేద్దామని బట్టలు కొన్నం. వరదలో ఇల్లంతా మునిగిపోయింది. పెండ్లి బట్టలన్నీ వరద పాలైనయి. సామాన్లన్నిటింటికి బురదంటుకున్నది. ఇన్ని సామాన్లు మళ్లా కొనాలంటే కూలి జేసుకుంట ఎట్ల కొనాలె?. మా గరీబోళ్లంటే ఈ గవర్నమెంట్‌కు ఎందుకింత పగ?

-గాదెపాక లక్ష్మమ్మ, మూసానగర్ బస్తీ



ఈ నెల 700 కోట్లు డౌటే!

- ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 10 వేల కోట్లపైనే.. నెలకు 700 కోట్ల చొప్పున చెల్లిస్తామన్న సర్కారు
- ఈ నెల వాటా ఇంకా విడుదల చేయని వైనం.. ఉద్యోగులు, పెన్షనర్లకు తప్పని ఎదురుచూపులు
- పేరడీపాటలతో నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు.. 3.6 లక్షల మంది ఉద్యోగులంతా బాధితులే

› 6

సివిల్ సప్లయ్ గాడిన పడేనా?

అప్పుల కుప్పగా శాఖ

టెండర్ ధాన్యం నగదు వసూళ్లలో విఫలం

కమిషనర్‌గా మరో ఐపీఎస్ స్టీఫెన్

› 6

గ్రూప్-2 ఫలితాలు విడుదల

782 ఉద్యోగాలతో తుది ఎంపిక జాబితా

18 రకాల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

దసరాలోపే నియామక పత్రాల అందజేత

› 10

ఫిరాయింపులపై నేటి నుంచి విచారణ

- తొలిరోజు నలుగురు ఎమ్మెల్యేలకు పిలుపు
- వచ్చే నెల 6వరకు అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు
- ఫిరాయింపుదారులు, ఫిర్యాదుదారులు, లాయర్లు ఫోన్లు, గడియారాలు తీసుకురావొద్దని ఆదేశాలు
- అసెంబ్లీ లోపలికి మీడియా రావడంపైనా నిషేధం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎన్నికల గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు సోమవారం నుంచి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముందు ప్రత్యక్ష విచారణ ఎదుర్కోనున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద అనర్హత పిటిషన్లను విచారించనున్నట్టు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం షెడ్యూల్ విడుదల చేశారు. తొలిరోజు నలుగురు ఎమ్మెల్యేలు విచారణ ఎదుర్కోనున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యక్ష విచారణకు హాజరు కావాలని స్పీకర్ కార్యాలయం నోటీసులు పంపించింది. వీరు న్యాయవాదులతో కలిసి విచారణకు › 6వ పేజీలో



పార్టీలో దూరినోళ్లను తరిమికొట్టండి

- ప్రతిపక్షంలో పదేండ్లు కష్టపడి పనిచేసినం
- తినే టైంలోమరొకడు వస్తే ఊకుంటమా?
- కాంగ్రెస్ ఎక్కడికి పోతున్నదో అర్థమైతలేదు
- నాడు కేసీఆర్‌ను అడిగితే 5 నిమిషాల్లో బోర్నపెల్లి వంతెనకు 70 కోట్లు ఇచ్చిండు
- కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలోకి ప్రవేశించి.. పదేండ్లపాటు కష్టపడిన అసలు సిసలు కాంగ్రెస్ కార్యకర్తలను గోసపెడుతున్న వారిని తరిమికొట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పదేండ్లపాటు అధికారంతో విర్రవీగి, అభివృద్ధి పేరిట కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తీరుతోపాటు, కాంగ్రెస్ పార్టీ › 8వ పేజీలో

భూముల కోసమే మెట్రో డీల్!



- ఎల్ అండ్ టీ తప్పుకోవడం వెనుక అనుమానాలు
- మెట్రోకు 300 ఎకరాలకుపైగా ల్యాండ్ బ్యాంక్
- విలువ రూ.16 వేల కోట్లు ఉంటుందని అంచనా
- వాటిని హస్తగతం చేసుకునేందుకే ప్లాన్ చేశారా?

› 6



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కేటీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, విజయుడు, మర్రి జనార్దన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రజినీసాయిచంద్ తదితరులు

జాయింట్ వెంచర్ సర్కార్

మొదటిపేజీ తరువాయి...


కలిపాయని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచే ఆ రెండు పార్టీలను బొందపెట్టాలని పిలుపునిచ్చారు. 'రేవంత్‌రెడ్డీ.. నీకు దమ్మూ ధైర్యముంటే, నల్లమల పులిబిడ్డవే అయితే ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకొని తెలంగాణ ప్రయోజనాలను కాపాడు' అని సవాల్ విసిరారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని మరిచిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా డబ్బులు పంచుతారని, వారిచ్చే డబ్బులు తీసుకొని కారు గుర్తుకు ఓటేయాలని, కాంగ్రెస్ చేసిన మోసాన్ని మోసంతోనే జయించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఆదివారం నిర్వహించిన 'బీఆర్‌ఎస్ జనగర్జన' భారీ బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, మోసపూరిత విధానాలను ఎండగట్టారు.

ఆల్మట్టిని ఆపే దమ్ములేదా?

ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెరిగితే కొడంగల్ లిఫ్ట్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, శ్రీశైలం డ్యాం నిరుపయోగంగా మారతాయని కేటీఆర్ హెచ్చరించారు. రూ. 70 వేల కోట్లతో ఆల్మట్టి డ్యాం ఎత్తును మరో ఐదు మీటర్లు పెంచే కర్ణాటక కాంగ్రెస్ కుట్ర ఫలిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చుక్క నీరు కూడా రాదని ఆందోళన వ్యక్తంచేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 519 మీటర్లు ఉన్న ఆల్మట్టి ఎత్తును 524 మీటర్లకు పెంచి కృష్ణా నుంచి తెలంగాణకు చుక్కనీరు రాకుండా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. అక్కడి ప్రభుత్వ నిర్ణయంతో పాలమూరు ఎడారిగా మారే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ముప్పు ముంచుకొస్తుంటే పులినని చెప్పుకొనే సీఎం రేవంత్ పిల్లి మాదిరిగా ఇంట్లో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. అక్కడి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.70 వేల కోట్లు కేటాయించినా మన సీఎం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తదో రాదోనని ఇటీవల ఆదిలాబాద్‌లో కొల్లాపూర్ ఎమ్మెల్యే, ఈ జిల్లా మంత్రి జూపల్లి చెప్పిన మాటలు విని నవ్వుకునే పరిస్థితి ఉన్నదని అన్నారు. జూపల్లికి కాంగ్రెస్ సర్కారు వస్తదో, రాదోననే అనుమానం ఉండవచ్చని, కానీ అచ్చంపేట బిడ్డలకు మాత్రం కాంగ్రెస్ రాదని, మళ్లా వచ్చేది కేసీఆర్ అనే విషయం స్పష్టంగా తెలుసని చెప్పారు. మంత్రులకు సోయి, తెలివిలేకపోవచ్చుగానీ అచ్చంపేట గడ్డ బిడ్డలకు తెగువ, తెలివి, పౌరుషం ఉన్నది కాబట్టే దుర్మార్గపు కాంగ్రెస్‌ను మళ్లీ రానీయబోమని ఘంటాపథంగా చెప్తున్నారని అన్నారు.

అచ్చంపేట పరువు తీస్తున్న రేవంత్

అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో పుట్టిన రేవంత్ రెడ్డి సీఎం అయి రాష్ట్రం పరువుతీస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆయనలో అపరిచితుడు ఉన్నారని, ఎప్పుడు ఏం మాట్లాడతడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. 'పొద్దున రాములా, రాత్రయితే రెమోలా వ్యవహరిస్తరు.. ఓ రోజేమో పేద రైతు కుటుంబం నుంచి వచ్చి సీఎం అయితే కేసీఆర్, కేటీఆర్ ఓర్వలేరంటరు. ఇంకోరోజేమో నాకు వ్యవసాయమే తెలియదు, మా తాత, తండ్రి పోలీస్ పటేల్ అంటడు. అసెంబ్లీలో అపరిచితుడులా మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిష్ఠను గంగలో కలుపుతున్నరు' అని విమర్శించారు. 'గుడ్లు పీకి గోటీలాడుతా', 'పేగులు తీసి మెడలో వేసుకుంటా' అనే భాషచూస్తే అసహ్యం వేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రం దివాలా తీసిందని చెప్తూ తెలంగాణ పరువును బజారుకీడుస్తున్నారని మండిపడ్డారు. హామీలపై నిలదీస్తే 'నన్ను కోసుకు తింటరా?' అని మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని తెలిపారు. హామీలను వదిలి, అడ్డగోలు మాటలతో తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ సర్కార్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన పుట్టిన గడ్డ నుంచే బీఆర్‌ఎస్ జైత్రయాత్ర మొదలుపెట్టాలనే సంకల్పంతోనే ఇక్కడ జన గర్జన సభ పెట్టామని స్పష్టం చేశారు. మీ ఉత్సాహం, ఊపు చూస్తుంటే స్థానిక ఎన్నికల్లో ఓట్లడిగేందుకు వచ్చే కాంగ్రెస్సోళ్లకు తగిన బుద్ధి చెప్తారనే విశ్వాసం కలుగుతున్నదని అన్నారు. అచ్చంపేటలో ఎవరో పార్టీ వీడారని బాధపడాల్సిన అవసరం లేదని, ప్రజల అభిమానం ఉన్న నాయకుడిని కేసీఆర్ త్వరలోనే పంపిస్తారని భరోసా ఇచ్చారు. తిరిగి కేసీఆర్ సీఎం కావాలంటే అచ్చంపేటలో గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు.



గులాబీదండు అడ్డుకోవాలా?

ఆల్మట్టి నిర్మాణాన్నే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. రాజోలిబండ కోసం 2001లో కేసీఆర్ పాదయాత్ర చేసినప్పుడు సుంకేశుల తూములను బాంబులతో పేలుస్తామన్న రాయలసీమ ఎమ్మెల్యేకు, వెయ్యి బాంబులతో మొత్తం బరాజ్‌ను తునాతునకలు చేస్తామని కేసీఆర్ ధీటుగా బదులిచ్చారని గుర్తుచేశారు. 'కేసీఆర్ నడిగడ్డకు నీరందించేందుకు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఆయన ఒత్తిడికి దిగొచ్చి తూములను దించితే బాంబులతో బద్దలుకొడతామని ఓ రాయలసీమ ఎమ్మెల్యే బెదిరించారు. కానీ అచ్చమైన పులి, తెగువ కలిగిన కేసీఆర్.. నువ్వు ఆర్డీఎస్ తూములను ముట్టుకుంటే సుంకేశులను వెయ్యి బాంబులతో పేల్చివేస్తామని, తునాతునకలు చేస్తామని హెచ్చరించారు. మరి నల్లమల పులిబిడ్డ అని చెప్పుకొనే రేవంత్‌రెడ్డికి ఆ దమ్ము ధైర్యం లేదా? ఆల్మట్టితో పాలమూరు, నల్లగొండకు కృష్ణా నీరు బంద్ అయితే కర్ణాటకను ఆపే శక్తిలేదా?' అని నిలదీశారు. పక్కనున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానీళ్లను ఆపివేస్తుంటే పైనున్న రాహుల్ గాంధీ, ఇక్కడున్న రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు. వారు మాట్లాడరని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది, ఇక్కడి ప్రజల గురించి మాట్లాడేది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. 'ఇప్పుడు అచ్చంపేట గడ్డపై రేవంత్‌రెడ్డిని అడుగుతున్న. ఆల్మట్టిని ఆపే దమ్ముందా? లేకుంటే కేసీఆర్ అండగా గులాబీ దండు కదిలి అడ్డుకోవాలా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక కాంగ్రెస్ పెద్దలను రాహుల్‌గాంధీ వద్దకు పిలిపించి ఆల్మట్టి ఎత్తును ఒప్పుకోం అని తేల్చిచెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన నల్లమల పులికాదని అచ్చంపేట నుంచి కొడంగల్‌కు పారిపోయి వచ్చిన నక్క అని, ఈ విషయాన్ని తాను చెప్పడంలేదని, ఆయన నియోజకవర్గ ప్రజలే చెప్తున్నారని అన్నారు. ఈసారి రేవంత్‌ను తరిమికొట్టడం పక్కా అని అంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ లేకుంటే పాలమూరు ప్రాజెక్ట్, కేఎల్‌ఐ లిఫ్ట్ ఎక్కడిదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందెవరో, నట్టేట ముంచుతున్నదెవరో ప్రజలు గుర్తుచేసుకోవాలని కోరారు.



అచ్చంపేటకు వచ్చిన కేటీఆర్‌కు చేతులెత్తి స్వాగతిస్తున్న పట్టణ ప్రజలు

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడుతున్నరు..


మోసపోతే గోసపడుతమని కేసీఆర్ హెచ్చరించినట్టే కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయిన తెలంగాణ ప్రజలు నేడు గోస పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. అన్నివర్గాలూ కాంగ్రెస్ చేతిలో మోసపోయారని అన్నారు. యూరియా కోసం యుద్ధాలు చేసే పరిస్థితి ఇప్పుడు తలెత్తిందని అన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్కనాడైనా ఇలాంటి పరిస్థితి వచ్చిందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో కనుమరుగైన యూరియా కోసం క్యూలైన్లు మళ్లీ వచ్చాయని, లైన్లలో నిలబడి రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మిర్యాలగూడలో గిరిజన రైతు యూరియా కోసం వెళ్లి చనిపోయారని గుర్తుచేశారు. యూరియా ఇవ్వకుండా, రైతుబంధు వేయకుండా, వడ్లకు బోనస్ ప్రకటించకుండా రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నారని విమర్శించారు. గత సెప్టెంబర్ 27న మంతి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడులు చేసిందని, కట్టలకొద్దీ డబ్బులు దొరికినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని గుర్తుచేశారు. ఈడీ దాడులు జరిగి ఏడాదైనా ఆ వివరాలను ఈడీ చెప్పడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని, వారి మధ్య అవగాహనకు ఇదే నిదర్శనమని విమర్శించారు.

రియల్ ఎస్టేట్ దందాలతో వందల కోట్లు సంపాదిస్తున్న కాంగ్రెస్ నేతలు ఓటుకు రూ.5,000 ఇచ్చినా తీసుకోవాలి. కాంగ్రెస్ నేతలు డబ్బులిచ్చి ప్రమాణాలు చేయిస్తారు. తుపేల్.. తుపేల్.. అని మనసులో అనుకొని ప్రమాణాలు చేసి కారు గుర్తుకే ఓటు వేసి మోసాన్ని మోసంతోనే జయించండి.
-కేటీఆర్

కేసీఆర్‌కు పేరు వస్తుందన్న అక్కసుతో బీఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రేవంత్‌రెడ్డి పక్కన పెట్టారు. మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేయడం లేదు గానీ, ఆ ప్రాజెక్టుతో ఏ సంబంధం లేని తన మామ జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం విడ్డూరం.
-కేటీఆర్

ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం.. బాకీకార్డు

ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి తెలంగాణలోని ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేశారని కేటీఆర్ విమర్శించారు. అత్తకు 4,000, కోడలికి 2,500 ఇస్తానని చెప్పి కుటుంబాల్లో చిచ్చుపెట్టారని, వృద్ధులకు 4,000 పెన్షన్ ఇవ్వకుండా రెండు నెలలు ఎగ్గొట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ దోఖాను ప్రజలకు గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించినట్టు, ఇది ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని చెప్పారు. ఈ బాకీ కార్డులను ఇంటింటికీ పంచి, కాంగ్రెస్ మోసాలను వివరించి స్థానిక ఎన్నికల్లో హస్తం పార్టీని బొందపెట్టాలని పిలుపునిచ్చారు. కల్యాణలక్ష్మి కింద 8 లక్షల మంది ఆడబిడ్డలకు రేవంత్‌రెడ్డి 8 లక్షల తులాల బంగారం బాకీ పడ్డారని విమర్శించారు. దివ్యాంగులకు ఒక్కొక్కరికీ రూ.44 వేలు బాకీ ఉన్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ దందాలతో వందల కోట్లు సంపాదిస్తున్న కాంగ్రెస్ నేతలు ఓటుకు 5,000 ఇచ్చినా తీసుకోవాలని, మిగితా బాకీ ఎప్పుడు ఇస్తారని నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు డబ్బులిచ్చి ప్రమాణా లు చేయిస్తారని, తుపేల్.. తుపేల్.. అని మనసులో అనుకొని ప్రమాణాలు చేసి కారు గుర్తుకే ఓటేసి మోసాన్ని మోసంతోనే జయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



అచ్చంపేట పట్టణంలో కేటీఆర్‌కు ఘనస్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, పట్టణ ప్రజలు



జనగర్జన సభ నుంచే కాంగ్రెస్ పతనం షురూ!

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో జరిగిన బీఆర్‌ఎస్ జనగర్జన సభ గ్రాండ్ సక్సెస్ అయిందని, ఈ సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం మొదలైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అచ్చంపేట ఇన్‌చార్జి మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. జన గర్జన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో మోసం చేసిన గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బాకీ చెల్లించాలని కాంగ్రెసోళ్లను ప్రజలు నిలదీయాలని కోరారు. నల్లమల బిడ్డనని చెప్పుకునే రేవంత్‌రెడ్డి సొంత ప్రాంతంలోనే ఎంత వ్యతిరేకత ఉందో సభకు వచ్చిన జనాన్ని చూస్తే అర్థమవుతుందన్నారు. ఒక్క పిలుపుతో భారీ సంఖ్యలో తరలివచ్చిన అచ్చంపేట ప్రజానీకానికి చేతులెత్తి నమస్కారం చేస్తున్నానని అన్నారు. సభను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



కాంగ్రెస్, బీజేపీ భవిష్యత్తు వినాశకాలు : ఆర్‌ఎస్పీ

కాంగ్రెస్, బీజేపీ భవిష్యత్తు వినాశకాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ భవిష్యత్తును నాశనం చేసేందుకు రెండు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే గులాబీ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రౌడీ షీట్ నమోదు చేసి స్టేషన్లలో ఫొటోలు పెడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్ నేతల ఫొటోలే పోలీస్ స్టేషన్లలో ఉండాలని అన్నారు. బీజేపీ దేశంలో చేయని ఘోరం లేదని, దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దారుణంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటి పార్టీలోకి నువ్వు వెళ్లావా అంటూ బాలరాజును ఉద్దేశించి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు పనులు చివరి దశలో ఉంటే 10శాతం నిధులు ఇవ్వలేని సీఎం పాలమూరు బిడ్డ ఎలా అవుతారని ప్రశ్నించారు.



అచ్చంపేటకు వచ్చిన కేటీఆర్‌కు చేతులెత్తి స్వాగతిస్తున్న మహిళలు

నల్లమలలో గులాబీ గర్జన

అచ్చంపేట సభకు పోటెత్తిన ప్రజలు

- కదం తొక్కిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు
- ర్యాలీలో కేటీఆర్‌కు అడుగడుగునా జేజేలు
- వర్షంలో సైతం సడలని అభిమానం
- సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు
- కేటీఆర్ ప్రసంగానికి జనం ఫిదా

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ ఊహించని రీతిలో సక్సెస్ అయ్యింది. అంచనాలకు మించి వచ్చిన జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కేటీఆర్‌కు జనం అడుగడుగునా జేజేలు పలికారు. అచ్చంపేట సాక్షిగా 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను కేటీఆర్ ప్రజల ముందు పెట్టారు. కేటీఆర్ కోసం దాదాపు 4 గంటల పాటు వేచి చూసిన జనం.. వర్షం పడుతున్నా ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. కేటీఆర్‌తో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. కేటీఆర్ 'సీఎం.. సీఎం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో కేటీఆర్ రెండుసార్లు పర్యటించారు. ముఖ్యంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పర్యటించి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపారు. 22 నెలల క్రితం కాంగెస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేరిందా? అన్న ప్రశ్నకు 'లేదు.. లేదు' అని ప్రజలు సమాధానమిచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రా రంభం కావాల్సిన జన గర్జన సభ కోసం ఉదయం 11 గంటల నుంచే జనం రావడం మొదలు పెట్టారు. అచ్చంపేట నియెజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి భారీగా తరలివచ్చారు. ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు, కార్లు, బస్సుల్లో అచ్చంపేటకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకే సభాప్రాంగణం మొత్తం నిండిపోయింది. సాయంత్రం 4:10 గంటలకు కేటీఆర్ వేదిక మీదకు అభివాదం చేస్తూ వచ్చారు. అచ్చంపేట జనగర్జనలో దాదాపు 15 వేల నుంచి 20 వేల మంది వరకు సభకు హాజరై ఉంటారని పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నారు.

జనగర్జనలో 'మర్రి' మార్క్

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో పార్టీ అధినేత కేసీఆర్ అచ్చంపేట సమన్వయకర్త బాధ్యతలను నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మె ల్యే మర్రి జనార్దన్ రెడ్డికి అప్పగించారు. దీంతో ఆయన అచ్చంపేట నియోజకవర్గం మొత్తం తిరుగుతూ కార్యకర్తలకు భరోసా కల్పించారు. కేటీఆర్ పర్యటన ఖరారు కాగానే సభను విజయవంతం చేసేందుకు ఇక్కడే మకాం వేశారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, సహచర మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ మర్రికి అండగా నిలిచారు.

పోటీగా మంత్రుల ప్రయాస

అచ్చంపేటలో జనగర్జన పేరుతో కేటీఆర్ బహిరంగ సభను ఏర్పాటు చేస్తే, దానిని విఫలం చేసేందుకు సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో మంత్రులు హడావుడిగా పర్యటించారు. అయినా జనం పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చారు. కాగా కొండారెడ్డిపల్లి నుంచి ఎవరూ సభకు వెళ్లకుండా బీఆర్‌ఎస్ నేతల ఇండ్లపై నిఘా ఉంచారు. అధికార పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా కేటీఆర్ సభ విజయవంతం కావడం తో కాంగ్రెస్ నేతలు డీలా పడ్డారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వ విప్, జిల్లా అధ్యక్ష పదవిని అనుభవించి పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే బాలరాజ్‌కు అచ్చంపేట ప్రజలు షాక్ ఇచ్చారు. సభకు వెళ్లకుండా ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఊహించిన దానికంటే ఎక్కువ జనం తరలివచ్చారు.



కడ్తాల్‌లో నిర్వాసితుల దీక్షా శిబిరం వద్ద కేటీఆర్‌కు ఫలాలను అందిస్తున్న చిన్నారులు

సీఎం ఆస్తుల పెంపునకే గ్రీన్‌ఫీల్డ్, ట్రిపుల్ ఆర్

కడ్తాల్, సెప్టెంబర్ 28: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం, బంధువుల ఆస్తులను పెంచుకునేందుకే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతోపాటు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో ఏర్పాటు చేస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్తులైన్ అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా బాధిత రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 21వ రోజుకు చేరాయి. ఆదివారం అచ్చంపేటలో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన సభకు హాజరయ్యేందుకు వెళ్తున్న కేటీఆర్.. కడ్తాల్ మండల కేంద్రంలో దీక్ష చేస్తున్న బాధిత రైతులను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, రజిని, వెంకటేశ్‌గుప్తా, పరమేశ్, దశరథ్‌నాయక్, ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ వీరయ్య, శ్రీనుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలకు బాకీ కార్డుతో చెక్

ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువన్న భ్రమల్లో రేవంత్

ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

జూబ్లీహిల్స్‌లో టూరిస్టు మంత్రుల ప్రచారం

ఎన్నికలు అయిపోగానే వారంతా గాయబ్

షేక్ పేట సమత కాలనీలో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులను పంచిన కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో/వెంగళ్‌రావు నగర్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ గ్యారెంటీల మోసాన్ని బాకీ కార్డులతో ఎండగడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువని, తాము చెప్పిన మాయమాటలను మరిచిపోతారన్న భ్రమల్లో రేవంత్ సర్కార్ ఉన్నదని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, ప్రజలకు పడ్డ బకాయిలను బాకీ కార్డు ఉద్యమంతో గుర్తుచేస్తామని చెప్పారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట సమత కాలనీలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ మైనారిటీ నేతలతో కలిసి కేటీఆర్ విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ 'కాంగ్రెస్ బకాయి కార్డు'లను ప్రజలకు అందించి, కాంగ్రెస్ మోసపూరిత పాలనను వివరించారు. దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో చెంప పెట్టు లాంటి తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. కేటీఆర్‌ను కలవడానికి యువత భారీగా తరలివచ్చింది. ఇంటింటికీ బాకీ కార్డులు పంచిన కేటీఆర్ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 'కేసీఆర్ ప్రభుత్వంలో పారిశుద్ధ్య పనులు రోజూ జరిగేవి. ఇప్పుడు చెత్త తీసేవారే కరువయ్యారు. మురుగునీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ కోతలు మళ్లీ మొదలయ్యాయి, ఇన్వర్టర్లు కొనుక్కుంటున్నాం' అని పలువురు మహిళలు, పెద్దలు కేటీఆర్‌తో తమ ఆవేదన పంచుకున్నారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న కేటీఆర్, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 'మాకు కేసీఆర్ మీద, బీఆర్‌ఎస్ పనితీరు మీద పూర్తి నమ్మకం ఉంది. జూబ్లీహిల్స్‌లోనే కాదు, రాబోయే ఎన్నికల్లోనూ మీరే విజయం సాధిస్తారు' అని పెద్దలు కేటీఆర్‌ను ఆశీర్వదించారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

అరచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి 700 రోజులైనా ఒక్కటీ నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారని, ఇప్పటికి ఒక్కో మహిళకు రూ.55 వేలు బాకీ పడ్డారని చెప్పారు. వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఇవ్వకుండా ఒక్కొక్కరికి రూ.44 వేలు బాకీ ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు స్కూటీ ఇవ్వలేదు కానీ, రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మోసాలన్నింటినీ గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజలను దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పే అద్భుత అవకాశం జూబ్లీహిల్స్ ప్రజలకు వచ్చిందన్నారు. ఇప్పుడు బుద్ధి చెప్పకపోతే మరో మూడేండ్లపాటు వారి అరాచకాలకు అడ్డే ఉండదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాగంటి గోపీనాథ్ భార్య సునీతను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కులమతాలకు అతీతంగా తెలంగాణలోని సబ్బండ వర్ణాలు, కేసీఆర్‌నే తిరిగి ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని, ఆ రోజు ఎంతో దూరంలో లేదని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు.

ఎన్నికలు కాగానే టూరిస్టు మంత్రులు గాయబ్

తెలంగాణలో అసలు అభివృద్ధే జరగడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి వ్యాసం రాస్తే, తన నియోజకవర్గానికి ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు వంద కోట్లు ఇచ్చి ఆదుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ఏకంగా ప్రపంచ బ్యాంకుకే లేఖ రాశారని కేటీఆర్ చెప్పారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉందో చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ మంత్రులంతా టూరిస్టులేనని, ఎన్నికలు అయిపోగానే వాళ్లంతా గాయబ్ అవుతారని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునేది బీఆర్‌ఎస్ నేతలేనని స్పష్టం చేశారు. 'ప్రజెంట్ సిటీ' వరదలతో మునుగుతుంటే, దోమలతో జనం ఇబ్బందులు పడుతుంటే, 'ఫ్యూచర్ సిటీ' కడతానని రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవిష్యత్తు తరాలే ఫ్యూచర్ సిటీని అద్భుతంగా నిర్మించుకుంటాయని చెప్పారు. ఉన్న మెట్రోను రద్దుచేసి జనం లేని ఫ్యూచర్ సిటీకి కొత్త మెట్రో కడతాననడం రేవంత్ రెడ్డి చావు తెలివితేటలకు నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట సమత కాలనీలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసి ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరిస్తున్న కేటీఆర్



మహబూబాబాద్‌లో జరిగిన లంబాడీల ఆత్మగౌరవ సభలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

రిజర్వేషన్లపై కుట్రలను తిప్పికొట్టాలి

- లంబాడీల ఆత్మగౌరవ సభలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్‌రూరల్, సెప్టెంబర్ 28 : ఎస్టీ రిజర్వేషన్ నుంచి లంబాడీలను తొలగించేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ ఆఫీసు ఎదుట లంబాడీల పరిరక్షణ కమిటీ జేఏసీ అధ్యక్షుడు జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పాల్గొన్నారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ లంబాడీలు మొదట నుంచి ఎస్టీ జాబితాలో లేరని, మధ్యలో వచ్చారని ఆరోపించడం సరికాదన్నారు. 1956లోనే లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు అందాల్సి ఉండేదని చెప్పారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన లంబాడీలు పోరాటం చేయడంతోనే 1976లో ఎస్టీ రిజర్వేషన్ అమల్లోకి వచ్చిందని వివరించారు. ఇటీవల రిజ్వరేషన్‌ను ఎత్తివేసేందుకు కొందరు కుట్రలకు పాల్పడుతున్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. లంబాడీ జాతి ఏకమై సుప్రీంకోర్టులో మన వాణి వినిపించాలని కోరారు. మాజీ ఎంపీ కవిత మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే ఆదివాసీలు, లంబాడీల మధ్య కొందరు గొడవలు పెడుతున్నారని విమర్శించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న గిరిజనుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని అన్నారు. జాతి హక్కుల కోసం ఢిల్లీలో సైతం పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ నుంచి తొగించే కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే వెనక్కి తీసుకునేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో గ్యారెంటీల జాడేది?

- ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమైనట్టు?
- 22 నెలల్లో హామీల ఊసేది?
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్
- సర్కార్ తీరుకు నిరసనగా సూర్యాపేట,నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఉండ్రుగొండలో కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల,(సూర్యాపేట)/తిప్పర్తి, సెప్టెంబర్ 28: కాంగ్రెస్ 22 నెలల పాలనలో గ్యారెంటీల జాడే లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, దాదాపు రెండేండ్లు కావస్తున్నా హామీల అమలు ఊసెత్తడం లేదని విమర్శించారు. ఆదివారం ఆయన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఉండ్రుగొండలో పార్టీ నాయకులు, నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి 'కాంగ్రెస్ బాకీ' కార్డులను ఇంటింటికి వెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని, గ్యారెంటీ కార్డులు దగ్గర పెట్టుకోవాలని, అమలుకాకపోతే తమను నిలదీయాలని రేవంత్‌రెడ్డి ఆ నాడు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ కార్డుల ప్రకారమే ఎవరెవరికీ ఎంత బాకీ ఉన్నారో తెలిసేలా 'కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు' రూపంలో ప్రజలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ హామీలన్నీ కూడా రేవంత్‌రెడ్డితో పాటు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, ఖర్గేలు కూడా ఇచ్చారని, వీరంతా బాధ్యులేనని స్పష్టంచేశారు. వీటన్నింటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో త్వరలో 'చలో ఆల్మట్టి'

కర్ణాటక ప్రభుత్వం మరోమారు ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుతుందని దీనివల్ల దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, పాలమూరు ఉమ్మడి జిల్లాలకు మరణ శాసనం అవుతుందని జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన తిప్పర్తిలో మీడియాతో మాట్లాడారు. ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకునే సోయి ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కూడా బాధ్యతలేదని మండిపడ్డారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నీళ్ల గురించి ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. రెండు, మూడు రోజుల్లోనే కేసీఆర్ నాయకత్వంలో చలో ఆల్మట్టి కార్యక్రమం చేపట్టి డ్యాం ఎత్తు పెంపును అడ్డుకునేందుకు ఓ కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. ఇందులో నల్లగొండ జిల్లా రైతాంగాన్ని పెద్ద ఎత్తున సమీకరిస్తామని చెప్పారు. పైన ఉన్న కర్ణాటక, కింద ఉన్న చంద్రబాబు ప్రభుత్వాన్ని, ఇక్కడున్న రేవంత్ సర్కార్‌ను ఎండగడతామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. చంద్రబాబుకు గురు దక్షిణగా తెలంగాణ నీటి హక్కులను కట్టబెడుతుంటే ఎట్టి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ | Telangana Today

తొమ్మిదవ డ్రా విజేతలు

S.No.	GIFT	WINNER NAME	COUPON NO.
1.	32' TV	SRAVANI	037543
2.	MOBILE	SHANKER	015225
3.	GIFT VOUCHER	K.SRIKANTH REDDY	037792
4.	GIFT HAMPER	K.SHIVA SHANKAR	041639

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



బాగుకోరే...

బతుకమ్మ నీ ఆట ఉయ్యాలో
భాగ్యమే మా ఇంట ఉయ్యాలో
పసిడి తంగేడు పూలు ఉయ్యాలో
పడతిరా బతుకమ్మ ఉయ్యాలో
గుమ్మడి పువ్వుల్ల ఉయ్యాలో
గౌరమ్మ మాయమ్మ ఉయ్యాలో
కట్ల పువ్వుల్లే వున్న ఉయ్యాలో
కరీంనగర్ జిల్లా ఉయ్యాలో

పల్లె పల్లె లోన ఉయ్యాలో
బతుకమ్మ ఆటలు ఉయ్యాలో
పెద్దోళ్ళు ఆడిరే ఉయ్యాలో
సద్దుల బతుకమ్మ ఉయ్యాలో
మంచి మనసులున్న ఉయ్యాలో
మా ఊరు చూడు ఉయ్యాలో
కళ్లాపి జల్లిన ఉయ్యాలో
ముగ్గులు పెట్టిన ఉయ్యాలో

ముగ్గుల రంగుల్లు ఉయ్యాలో
తీరొక్క పువ్వులు ఉయ్యాలో
రచ్చబండ కాడ ఉయ్యాలో
అందరూ కలువంగా ఉయ్యాలో
ఊరి మేలు కోరే ఉయ్యాలో
సర్పంచ్ చల్లంగా ఉయ్యాలో
నీతి ధర్మమున్న ఉయ్యాలో
చిన్న పెద్దలంతా ఉయ్యాలో

చీకు చింత లేని ఉయ్యాలో
చక్కని హృదయాలు ఉయ్యాలో
ప్రజల బాగు కోరి ఉయ్యాలో
పనులే చెయ్యాలే ఉయ్యాలో
పదిమందితో మనము ఉయ్యాలో
ప్రేమగా ఉండాలే ఉయ్యాలో
మంచి మంచి పనులు ఉయ్యాలో
మానవులు చేయంగా ఉయ్యాలో

మహిలోన ఇంకేమీ ఉయ్యాలో
మాధవుని సేవయే ఉయ్యాలో
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో



బొమ్మదేని రాజేశ్వరి
9052744215



'గుమ్మడి పూలు పూయగ బ్రతుకు
తంగెడు పసిడి చిందగ బ్రతుకు
గునుగు తురాయి కులుకగ బ్రతుకు
బతికి బ్రతికి బతుకుల బతికిస్తూ
బతుకమ్మా! బ్రతుకు'
- ప్రజాకవి కాళోజీ

తెలంగాణ ఆత్మగౌరవ పతాక అయిన బతుకమ్మ పండుగ వస్తుందంటేనే ఊరూ వాడల్లో కొత్త ఉత్సాహం మొదలవుతుంది. తెలంగాణ జన జీవనంలో అంతర్భాగమై ఆనందాలను, ఆత్మీయతలను మూటగట్టుకొని వచ్చే ఈ పూల పండుగ ప్రపంచంలో మరెక్కడా లేదు. అయితే, ఈ పండుగను పోలిన పండుగలున్నాయి. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ వ్యవసాయానికి పర్యావరణానికి సంబంధించినది కూడా.

మట్టి పరిమళం జాతి జీవనం



ఏటా మహాలయ అమావాస్య (పితృ అమావాస్య/ పెత్రమాస) నుంచి తొమ్మిది రోజుల ఆటపాటలు, చప్పట్ల ముచ్చట్ల కోలాహలంతో సాగే ఈ సామూహిక ఉత్సవం మహిళా సమైక్యతకు నిదర్శనం. మన సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు ముందు తొమ్మిది రోజులు బొడ్డెమ్మ పండుగను జరుపుకొంటారు. బతుకమ్మ పండుగకు సంబంధించి రకరకాల కథలున్నాయి. ఆడపిల్లను గౌరీదేవిగా భావించి గౌరవించి, పూజించడమే కుటుంబసభ్యులంతా బంధుమిత్రులతో కూడి ఉల్లాసంగా జరుపుకొనే పండుగ సంబురం ఇది.

ఇక ఆ తొమ్మిది రోజులు బాలికలు, మహిళలు ఉన్నంతలో తయారై సాయంత్రం పూట ముందుగా ఇంటిముందు (ఇంటిలో) శుభ్రం చేసి ముగ్గువేసిన ప్రదేశంలో బతుకమ్మను పెట్టి ఆటపాటలతో వాటిచుట్టూ మూడుసార్లైనా తిరిగి వాటిని పట్టుకొని (నెత్తిన పెట్టుకొని) చెరువు గట్టు, గుడి ఆవరణ లాంటి నిర్ణీత ప్రదేశానికి వెళ్లి ఎత్తిన బతుకమ్మలను అక్కడ దించుతారు. ఇక్కడ ఆటతో పాటు పాట కూడా ప్రధానం.

ఈ పాటల్లో బతుకమ్మకు సంబంధించి పౌరాణిక, చారిత్రక, జానపద, సామాజిక గాథలెన్నో చెప్పబడుతాయి. మౌఖిక సాహిత్యం నుంచి పుట్టిన ఈ పాటల్లో వావి వరుసలు, పుట్టింటి, అత్తింటి సంబంధాలు, జీవన విధానాలు, భక్తి భావనలు, స్త్రీల కష్టాలు, కన్నీళ్లు, కుటుంబ బంధాలు, అప్పగింతలు, సంవాదాలు, కర్తవ్యాలు మొదలైన అంశాలెన్నింటితోనో అల్లబడిన విషయాలు అర్థమవుతాయి, ఆలోచింపజేస్తాయి. గొంతులు కలిపి ఆయా పాటలను పాడుకోవడం సంతోషానికే కాదు, జ్ఞాపకశక్తికి కూడా నిదర్శనం. పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడుకుంటే ఆ ఆనందమే వేరు. ఆ పాటలన్నింటినీ సేకరించి నిక్షిప్తం చేసుకోవలసిన బాధ్యత మనపై ఉన్నది. అట్లాంటి పాటల్లో కొన్ని... 'శ్రీలక్ష్మీదేవి ఉయ్యాలో/ సృష్టి బతుకమ్మయ్యె ఉయ్యాలో/ ధర చోళ దేశమున ఉయ్యాలో/ ధర్మాంగుడను రాజు ఉయ్యాలో' అని చెప్తూ చివరలో 'జగతిపై బతుకమ్మ ఉయ్యాలో/ శాశ్వతంబుగ నిలిచె ఉయ్యాలో' అంటూ ఆ కథను చెప్తారు. 'రామ రామ రామ ఉయ్యాలో/ రామనే శ్రీరామ ఉయ్యాలో/ రామ రామనంది ఉయ్యాలో రాగమెత్తరాదు ఉయ్యాలో' అంటూ కుటుంబ బంధాలను తెలుపుతూ అన్ని పూలను తేవడంతో పాటు 'పోయిరా బతుకమ్మ ఉయ్యాలో/ మళ్లొచ్చే ఏడాదికి ఉయ్యాలో' అని పూర్తవుతుంది. 'కలవారి కోడలు ఉయ్యాలో/ కనకమహాలక్ష్మి ఉయ్యాలో' అని మొదలై అత్తింట సమిష్టి కుటుంబంలో ఉన్న అమ్మాయి తనను తీసుకెళ్లడానికి వచ్చిన అన్నతో పుట్టింటికి వెళ్లడానికి కుటుంబంలో అందరి అనుమతి తీసుకోవడం, చివరగా భర్త అనుమతించి 'కట్టుకో చీరెలూ ఉయ్యాలో/ పెట్టుకో సొమ్ములు ఉయ్యాలో' అని చెప్పడంతో పూర్తవుతుంది. అయితే బతుకమ్మ ఆటను ముందుగా పూల పాట ఆడే 'ఒక్కేసి పువ్వేసి చందమామ/ ఒక్క జామాయె చందమామ' అని, 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ/ ఏమేమి కాయొప్పునే' అని తర్వాత 'ఒక్కేసి వెలగపండే గౌరమ్మ/ దూరాన దోరపండే' అంటూ పండ్లకు సంబంధించి, 'ఒక్కొక్క అక్షింతలూ గౌరమ్మ/ ఒక్క మల్లెసాలలూ గౌరమ్మ' అంటూ అక్షింతలకు సంబంధించిన పాటలతో ప్రారంభిస్తారని మా పెద్దలు చెప్పేవాళ్లు.

తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, సరదా సందడితో సాగే సందర్భంలో 6వ రోజు 'అర్రెం' అని (బహుశా విశ్రాంతి కోసం అయ్యుంటుంది) ఆడరు. 9వ రోజు తీరొక్క పూలతో, చీరె సారెలతో తీర్చిదిద్దిన సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకొంటారు. ఈ తొమ్మిది రోజులూ పండ్లతో పాటు రకరకాల పదార్థాలతో చేసిన వంటకాలను, పల్లీలు నువ్వులు, పెసలు మొదలైన కొత్త పంటల ధాన్యాలను పొడులుగా కొట్టి బెల్లంతో కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు. వీటినే సత్తుపిండి అని కూడా అంటారు. ఇక చివరి ఘట్టంగా బతుకమ్మపై భాగాన ఉన్న గౌరమ్మను తీసి బతుకమ్మ కుదురును జాగ్రత్తగా నీటిలో జార విడుస్తారు. అక్కడ పళ్లెంలో తెచ్చిన కొన్ని నీళ్లలో గౌరమ్మ నుంచి మరొక పళ్ళెంతో దానిని మూసి 'హిమవంతునింట్లో పుట్టి / హిమవంతునింట్లో పెరిగి' అంటూ ఊయలలూపుతూ చివరలో 'మాయమ్మ గౌరీదేవి పోయిరావమ్మా/ మాయమ్మా లక్ష్మీదేవి మళ్ళీ రావమ్మా' అని, 'ఉసికలో పుట్టిన గౌరమ్మ/ ఉసికల పెరిగిన గౌరమ్మ/ ఉసికిల వసంత మాడంగ' అంటూ పసుపు, కుంకుమ, అక్షింతలను కూడా ఆ పాటలో పదాలుగా చేర్చి చివరలో 'పోయిరా గౌరమ్మా పోయి రావమ్మా' అంటూ ఓలలాడిస్తారు. తర్వాత ఆ పసుపును, ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. నైవేద్యాలను అందరికీ పంచుతారు. అయితే, ఈ బతుకమ్మ సంబురాల్లో పూల సేకరణ, బతుకమ్మ అమరిక, ప్రసాదాల తయారీ, బతుకమ్మలను నిర్ణీత ప్రదేశాలకు చేర్చడం, ఆటపాటలప్పుడు పిల్లలను చూసుకోవడం, నిమజ్జనం లాంటి విషయాల్లో మగవాళ్ళ భాగస్వామ్యం కూడా ఉంటుంది. అందుకే, ఇది కుటుంబ బంధాలను పెనవేసే పండుగ.

మన తాత్విక ఆచరణలను గుర్తుచేసే ఈ సామాజిక సందర్భంలో పెళ్ళై అత్తగారింటికి పోయిన బిడ్డలను పుట్టింటికి పిలిచి వాళ్ళను చీరెలు సారెలతో సత్కరించి పంపించడం ఒక సంప్రదాయం. ఇట్లా తెలంగాణకు శిఖరాయమైన మట్టి పండుగ, చెట్టు పండుగ, నీటి పండుగ, రుచుల పండుగ, ఎన్నింటినో తెలుసుకొని, తలచుకొని మురిసిపోయే పండుగ అయిన ఈ బతుకమ్మ పండుగలో ఔషధ గుణాలు, చికిత్స లక్షణాలు ఇమిడి ఉన్నాయి. అందుకే ఈ పండుగ పూల జాతరై సాంస్కృతిక వారసత్వంగా కొనసాగుతున్నది.

నాడు పల్లెలకు మాత్రమే పరిమితమైన బతుకమ్మ పండుగ తర్వాతి కాలంలో పట్టణాలకు, నగరాలకు, విదేశాలకు కూడా విస్తరించింది. భిన్న, ఆచార సంప్రదాయాలన్నీ గేటెడ్ కమ్యూనిటీల్లోనూ తెలంగాణ అస్తిత్వ గుర్తింపులో బతుకమ్మ భాగమవుతున్నది. ఎక్కడున్నా ఆధునిక పోకడలతో కృత్రిమత్వానికి తావివ్వకుండా సహజసిద్ధమైన వాతావరణంలో అర్థవంతంగా, ఆత్మీయ బంధాలు పెనవేసుకునే విధంగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం మనందరి బాధ్యతగా భావించాలి. అప్పుడే బతుకమ్మ ఒక వేడుకనే కాదు, మట్టి పరిమళం, జాతి జీవనం అనే సందేశం భావి తరాలకు అందుతుంది. ఈ సంస్కృతీ సంప్రదాయం కొనసాగుతుంది.



డాక్టర్ కొమర్రాజు రామలక్ష్మి
98492 34725



పూల జంబుఖాన..

బతుకమ్మ పండుక్కి పూలన్నీ
అవ్వగారింటికచ్చినట్లుంటే..
ఇన్నొద్దులు సిన్నబోయిన ఇల్లు
ఆడిబిడ్డలు గల్మలకు రాంగనే
నాకేం తక్కువన్నట్లు ఎగురుతుంటే...
పైనున్న పెంకులన్ని పూలకు
కావలి కాస్తన్నయ్..

తెంపుకచ్చిన తంగేడు పువ్వు
తాంబాలం కోసం అట్క
మీదకి నిక్కి నిక్కి సుత్తాంటే...
గంపలున్న గునుగు పువ్వు నాకు
రంగులద్దమని తాతకు సైగ సేత్తంది
పట్టు సీతమ్మ గుత్తులు నేనే బతుకమ్మకు
పట్టు చీర కట్టినట్లుంటనని ముర్తాంటే
గుడిసె మీదున్న గుమ్మడి పూలు
నేను లేంది గల్మెట్ల
దాటుతరని గర్ర మీదున్నయ్
ఇక నన్నెట్ల మర్సిపోతరని కట్లపూలు
దడి పొంట నిలవడి జవుడానికి దిగితే..

ఆయింత మందచ్చి పూలన్నీ బర్కపోతరని
అమ్మమ్మ ఏగిరవడుకుంట
చిన్నంచందుకొని
పెరట్ల పువ్వులను కోస్కత్తే..
భవంతిల పూల జంబుఖాన
పర్శినట్లున్నది..
ఆకిట్లకు అచ్చిపోయేటోళ్లతో
ఊరంత గలగలలు...

బతుకమ్మలు పెద్దర్వాజ దాటితే
శెరువు కట్ట మీద ఉద్యమ
దెబ్బలన్నీ సప్పట్లయ్ ఇనవడుతాంటే..
రాగమందుకున్నది నడిపొల్ల బుచ్చక్క..
సత్తుపిండ్ల వాయనంతో..
వదిన మరదళ్ల ముచ్చట్లతో..
బతుకమ్మను మల్లేడాది దాకా
నిద్రపొమ్మని శెరువులంపితే...
తంగేడు పూలల్ల నా తెలంగాణ
బంగారమై మెరిసే....



తుమ్మల కల్పన రెడ్డి
96404 62142

బతుకు నేర్పిన బతుకమ్మ పాటలు

జానపద గేయ సాహిత్యంలో ఉయ్యాల (బతుకమ్మ) పాటలది ఒక ప్రక్రియ. ఉయ్యాల పాటలకు బతుకమ్మ పాటలు, బొడ్డెమ్మ పాటలు, దసరా పాటలు అనే పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఇవి ప్రత్యేకించి స్త్రీల పాటలే. అయితే, ఇవి జోల పాటలు కావు. ఊయల ఊపులాగా ముందుకెళ్లి మళ్లీ వెనక్కి తిరిగివచ్చి, తిరిగి ముందుకు వెళ్తూ ఉంటుంది. అందుకే ఈ గేటు ప్రక్రియకు ఉయ్యాల పాట అని పేరు వచ్చింది. రెండు చేతులా చప్పట్లు చరుస్తూ, ముందుకు వంగుతూ లేస్తూ, గుండ్రంగా తిరుగుతూ ఈ పాటలు పాడుతారు. ప్రతి పాదం చివర 'ఉయ్యాలో' లేక 'వలలో' అనే పూత్, లేక వంత ఉంటూ లయానుగుణంగాపాట సాగుతుంది.



గ్రామీణ జానపదుల విశ్వాసాల నుంచి నిష్కల్మష నిర్మల హృదయ క్షేత్రాల నుంచి మొగ్గ తొడిగినవే ఈ జానపద పాటలు. వీటికి మన తెలంగాణ నేలే పుట్టిల్లు. ప్రజా జీవనంలో చైతన్యంలో భాగమైన ఈ ఉయ్యాల పాటలు నేటి అధునిక జీవనశైలి, డిష్ యాంటినా, నెట్, విష సంస్కృతి వలయంలో చిక్కుకొని తమ ఉనికిని కోల్పోతున్నాయి. అయితే, మన ఆచార సాంప్రదాయాలు, మనం చేసుకునే పండుగలు ఈ పాటలకు చిగురు తొడగడం ఆనందదాయకం.

తెలంగాణలో బతుకమ్మ పాటలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. 'శ్రీలక్ష్మీదేవియు చందమామా–సృష్టి బ్రతుకమ్మయ్యే చంద మామ/ పుట్టినా రీతిచెప్పే చందమామ' –భట్టు నరసింహా కవి చందమామ అనే పాట. బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలను తెలియ జేస్తుంది. ఈ పండుగ ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకూ తెలంగాణ ప్రజలు వైభవంగా జరుపుకొంటారు.

వెడల్పయిన పళ్లెం మీద గుమ్మడాకులు పరిచి వాటి మీద గునుగు, తంగేడు, బంతి వంటి రంగు రంగుల పూలు గోపురాకారంగా పేర్చి స్త్రీలు పూజిస్తారు. చప్పట్లు చరుస్తూ చుట్టూ తిరుగుతూ ఈ పాటలు ఆలపిస్తారు. 'శ్రీ లక్ష్మీ నీ మహిమలూ గౌరమ్మ.. చిత్రమై తోచునమ్మా...' అంటూ 'తలుపుకు తాళాలు వలలో... యెండి చీలాల వలలో', 'బతుకమ్మ బతుకు ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ ఈ పాటలలోని పాదాలు త్రిశ్ర చతురస్ర గతిలో నడుస్తుంటాయి. ఇలాంటివే కాక గౌరిపూజ సందర్భంలో 'రుద్రాక్ష చెట్లల్ల ఆట చిలుకల్లారా, పాట చిలుకల్లారా, కలికి చిలుకల్లార, కొలికి చిలుకల్లారా.. కుందమ్మ గువ్వలు/ నీ నోము నీకిత్తునే గౌరమ్మ– నా నోము ఫలమివ్వవే గౌరమ్మ' అంటూ స్త్రీలు తమ పాటలలో భక్తిని వ్యక్తం చేసేవారు. ఉయ్యాల పాటల్లో అనేక విషయాలతో పాటు సామాజిక జీవన చిత్రణ సైతం ఆయా సందర్భాలలో కనబడుతుంది. వీర కృత్యాల వల్ల, దొమ్మిల వల్ల, నిరంకుశత్వాన్ని ఎదిరించటం వల్ల, సహగమనాధికారాలను నెరవేర్చడం వల్ల ప్రసిద్ధమై, హృదయాలను ఆకర్షించిన సంఘటనలను కథా వస్తువుగా గైకొని గానం చేసిన సందర్భాలు కనిపిస్తాయి.

పితృ, మాతృస్వామ్యాల మధ్య చెలరేగిన ద్వేషాన్ని కొన్ని గేయాలు ప్రచ్ఛన్నంగా తెలుపగా, అతి ప్రాచీన మాతృసామ్య వ్యవస్థ ఉత్పత్తి పరిణామ పతనం శివ శంఖు కథలోని ఉయ్యాల పాటలో వ్యక్తమవుతుంది. 'తెల్లని గుడ్లాకు ఉయ్యాలో– తెచ్చే రగుతాలు/ ఎర్రనీ గుడ్లకు– ఎత్తేసే కోపాలు/ నిలువునా పానంబు..' అంటూ సాగుతుంది. వారికి జీతభత్యాలు రాజులిచ్చేవారు. 'ఇద్దరక్కచెల్లెండ్లు ఉయ్యాలో/ ఒక్క ఊరికిస్తే ఉయ్యాలో/ ఒక్కడే మా అన్న ఉయ్యాలో/ వచ్చన్న బోడు ఉయ్యాలో' అంటూ సాగే పాట ఆడపిల్లలకు అన్నపై ఉండే ప్రేమతో పాటు నాటి చేతివృత్తులను, నేత పనితనాన్ని తెలియజేస్తుంది. 'బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్/ బిడ్డాలెందరాయె కోల్/ నీ బిడ్డ నీలగౌరు కోల్/ నిచ్చె మల్లే చెట్టేసే కోల్' అంటూ సాగే ఈ పాటలో పెరుగుతున్న చెట్టుకు, ఆడపిల్ల పోలిక చెప్తూ దేవుళ్లందరిని గుర్తుకు చేసుకోవడం గమనిస్తాం. ఉయ్యాల పాటలు నాటి పరిస్థితులకు అద్దం పట్టాయి. బతుకమ్మ పాటలు సాంస్కృతిక చిహ్నంగానే కాకుండా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి అయ్యాయి. బ్రతుకు పాటలుగా జనం గుండెల్లో చిరస్థాయిగా నిలపాలి. రాజకీయ ఎత్తుగడలు ఎలా మారినా, విపత్కరమైన ఏ కాలంలోనూ.. ఈ సాహిత్యాన్ని ప్రాణపదంగా కాపాడుకోవల్సిన అవసరం తెలంగాణ వారసులుగా మనందరిపై ఉన్నది.



డాక్టర్ కటుకోఝ్వల రమేష్
99490 83327



మన బతుకమ్మ

పూలకుప్పగా మట్టి సుగంధాలలో
పుట్టింది బతుకమ్మ..
పూలతల్లిగా ఆదిపరాశక్తికి పూజలు..
ఊరువాడు పూలవనం

ఎంగిలిపూల బతుకమ్మతో
మొదలాయే సంబూరం
ఆడబిడ్డల ఆటలు పాటలు
ఆనందం ఆరోగ్యం
విజ్ఞానం సుజ్ఞానం
పుట్టింటి మమకారం
అన్నదమ్ముల అనురాగం

తాంబాల మంచుల్లో తంగేడుపై..
మెత్తని రంగుపూల వరుసలు
ఎన్ని తీరులో బతుకమ్మలు..
పసుపు ముద్ద గౌరమ్మ
రోజుకో తీరు పలారాలు

ఆడబిడ్డలెత్తుకోంగా
సాకపెట్టి
వాకిట్లో దింపితే..
సింగిడినే గోపురంగా చుట్టినట్టు..
చుట్టూ ఓ నాలుగు సుట్లు తిరిగినంక..
అలికి ముగ్గు పెట్టిన
అనువు తావులకి
అన్ని బతుకమ్మలు

పసుపు పారాణి
కడియాలు పట్టీలు
పాదాలు పూసి అడుగుల సవ్వళ్లు
వన్నెల కోకలు
వెన్నెల కొంగులు
తళుకు తరంగాల చీరకుచ్చిళ్లు
నెలవంకలై నెలతలు
భుజము భుజము కలిపి
చప్పట్ల దరువులతో
గుండ్రంగా తిరిగేటి
సంగీత సాహిత్య నాట్యకళలు
ఎంత సహజ సుందరమో!

పౌరాణికాలు చారిత్రకాలు
సామాజికాలు
వీర శౌర్యగాథలు
త్యాగాల పాటలు
మన బంగారు బతుకమ్మ
సింగారమై
లోకమంతా
మనసు పూల పాటలు

'పోయిరా మా తల్లి గౌరమ్మ
వచ్చే ఏడాదికి మళ్ళీ రావమ్మా'
సద్దుల బతుకమ్మ నాడు
సాగనంపేటి పాటలు
చెరువు కట్టమీద ఆటలు
గుర్తుకొచ్చే జ్ఞాపకాలు
ఇచ్చి పుచ్చుకునే
వాయనాలు
బాల్యమంతా యాదికొస్తది

నాడు భుజాలకెక్కిన బతుకమ్మ
నేడు దోసిట్లోకొచ్చింది
చెరువు అలల్లో
ఊయలూగిన తల్లి
జలసిరుల లేమిలో
నలుగుతున్నది
తడవలేక కదలలేక
దాండియా గర్బ డీజేల హోరు
దేహమంతా
దుమ్ము దూళిమయం
పాట కోయిలలు పారిపోతున్నవి
వంత చిలకలు మూగబోతున్నవి

సంప్రదాయక వైభవం
ప్రాకృతిక సౌందర్యం
పవిత్రంగా కొలిచే దైవత్వం..
మారిపోతుందనే
పెద్ద తరం తీరును పోరును..
పట్టించుకోవడమే
తెలియకున్నదేమో ఈ తరానికి

మార్పులు చేర్పులకు
స్వాగతమే.. కానీ,
మన చరిత్ర తెలియాలిగా
తెలంగాణ బతుకమ్మది
పోరాటాల గాథ
బతుకమ్మ ఆత్మకథ
మనందరి కథ
బతుకమ్మ ప్రకృతి కావ్యం



గడ్డం సులోచన
7702891559

బాధల కేదారంలో మొలకెత్తిన కవిత

'అత్యనాథు గాంచి, యశ్రూదకము జిమ్ము
కరుణ నాగుండె పురుటి గేము
మంజులాలంకార మకరందముప్పొంగు
కవితకు నా జిహ్వ కల్పతరువు'

అంటూ ఆధునిక కవిత్వంలో అందమైన కవిత్వానికి తాను కల్పతురువు లాంటి వాడినని జాషువా ప్రకటించుకున్నది అక్షర సత్యం. ఎవరి కవిత్వం వింటే హృదయముప్పొంగిపోతుందో, ఎవరి కవిత్వం వింటే మనస్సు వెన్నలా కరిగిపోతుందో, ఎవరి కవిత్వం వింటే పారవశ్యంతో కనుల నుంచి నీరు జలజరాలి మానవత్వాన్ని తట్టి లేపుతాయో ఆ కవియే అపర వాల్మీకి అమృత హృదయుడు గుఱ్ఱం జాషువా.

'కులమతాల గీచుకున్న గీతల చొచ్చి
పంజారన కట్టుబడను నేను
నిఖిల లోకలమెట్లు నిర్ణయించిన, నాకు
తరుగులేదు, విశ్వనరుడ నేను.'

అంటూ కులమతాలకతీతంగా విశ్వ మానవునిగా మానవతా ప్రబోధంతో కన్నీరు పెట్టించగలిగిన కవి శేఖరుడయినాడు జాషువా. 1895 సెప్టెంబరు 28న జన్మించిన గుఱ్ఱం జాషువా కరుణరసార్ద్ర కవితకు పట్టం గట్టిన కవివరేణ్యుడు. జాషువా రాసిన ఖండకావ్యాలు ఏడు సంపుటాలు, గబ్బిలము, ఫిరదౌసి, నా కథ ముంతాజ్‌మహల్ మొదలైనవి తెలుగు సాహిత్య పరులందరినీ ఆకర్షించడానికి కారణం వాటిలో ఆవిష్కృతమైన మృదుమధుర మనోహర కవితా సౌందర్యమే. కులమతాల నెడి కర్కశ క్రకచ కరాళదంష్ట్రలు కరకరలాడచున్న కాలంలో జన్మించిన జాషువా నిజ జీవితంలో ఎదురైన అవమానాలు అతనిలో కవితా హృదయాన్ని మేలుకొలిపినవి. జాషువా పడిన ఈ ఆవేదనయే ఆయన కవిత్వానికి బీజం వేసింది. నిజానికి ఆవేదనే కవితకు కన్న తల్లి. జాషువా చిన్ననాడు పడిన కష్టాలు, పరాభవాలు ఆయనను ఆవేదనాగ్నిలో పూటి పాకంవేసి కరుణరసమూర్తిగా తీర్చిదిద్ది కవితలోను కరుణరసాన్ని ప్రవహింపజేసినది. జాషువా ప్రతి ఖండికకు, కావ్యానికి ముక్తాయింపు కరుణరసం. ఏ సామాన్య వస్తువు గ్రహించినా కరుణరసంతో రం గరించి శ్రోతృపాఠకుల హృదయాలను కరిగించే అసామాన్యశిల్పం జాషువా కవిత్వం.

జాషువా తన కావ్యానికి 'గబ్బిలం' అన్న పేరును ఎంపిక చేసుకోవడంలోనే తనకు సమాజం పట్ల గల తిరస్కార భావాన్ని ప్రతీకాత్మకంగా వెల్లడించినాడు. లోకస్వభావాన్ని ఎండగట్టడంలో జాషువా కవితకున్న శక్తి చాలా గొప్పది. ఉదాహరణకు..

'నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు
ధర్మశీలురన్న ధరణి మీద
కాలు మోపగలేక గబ్బిల మొక్కటి
చరణయుగళి దివికి సాచి నడచు'

అంటూ సాగిన వీరి వ్యంగ్య రచనాధోరణిలో సుతిమెత్తని పదజాలంతో సమాజానికి తీవ్రమైన మందలింపును, ఎత్తిపొడుపును మనం ఇక్కడ గమనించవచ్చు. ఇది జాషువా కవిత్వ నైజగుణం. ఒక సామాన్య మానవునికి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఒక బలమైన టానిక్ వలె నూరిపోయడం జాషువా కవిత్వంలో కనిపిస్తుంది.



(సెప్టెంబర్ 28న గుర్రం జాషువా జయంతి)

అతడు వేమన! భువనమాయా తమస్సు
జీల్చి చెండాడిన బలశాలి! సిద్ధమూర్తి!
సకల సామ్రాజ్య భోగపిశాచములను
గోచిపాతకు బలియిచ్చికొన్న ఘనుడు!

అని వర్ణించడంలో భువన మాయా తమస్సు జీల్చి చెండాడిన బలశాలి, సకల సామ్రాజ్య భోగపిశాచములను గోచిపాతకు బలియిచ్చిన ఘనుడు అన్న ప్రయోగాలు కూడా ఆ వ్యక్తి గొప్పతనాన్ని మనసుపై ముద్రవేసినట్లుగా చెప్పడం జాషువా కవిత్వంలోని గొప్పతనమే. సృష్టిలోని ప్రతి ప్రాణికి తల్లి కంటే మధురమైన అనుభూతి మరొకటి లేదు. ఆ వాత్సల్యామృత రుచులు మనసారా గ్రోలినాడు జాషువా. ఆయన వ్రాసిన 'మాతృప్రేమ' అనే ఖండిక ఆయన హృదయానికి అద్దం లాంటిది. పాల పొదుగు భారంతో మెల్లమెల్లగా నడచివచ్చె ధేనువు వలె కావ్యం విపుల రసభావభరితమై ఉండాలనడంలో తెలుగు కవిత్వం పట్ల జాషువా హృదయంలో ఉన్న పవిత్రమైన భావన కనిపిస్తుంది. స్వచ్ఛమైన ఆయన హృదయ వైశాల్యానికి సామాజిక దర్శనానికి ఆన కవిత్వం ఒక గొప్ప ఉదాహరణగా దర్శనమిస్తుంది మనకు.



ప్రొఫెసర్ కె.యాదగిరి
93901 13169
(వ్యాసకర్త: తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు)

● ముంచిన మూసీ.. మునిగిన దారి



మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ముంచెత్తిన వరద ఉధృతి, పక్కనే కొత్తగా నిర్మిస్తున్న వంతెన వద్ద కుప్పలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం

● గూడు చెదిరి.. గుండె పగిలి



చాదర్‌ఘాట్ వద్ద మూసీ వరదతో బురదమయంగా మారిన మూసానగర్ బస్తీ, వరద తగ్గిన తర్వాత సామగ్రిని బయట పెట్టి, ఇండ్లను శుభ్రం చేస్తున్న ప్రజలు

బస్తీ బతుకులపై బురద

'చెరువులో చేపలను నింపినట్టు.. ఈ నగరాన్ని ప్రజలతో నింపు దేవుడా' అని హైదరాబాద్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు కులీ కుతుబ్‌షా ప్రార్థించాడని చరిత్ర చెప్తున్నది. మూసీ నది ఒడ్డున వెలసిన నగరం సర్వతోముఖాభివృద్ధి చెందింది. కానీ వందేండ్ల కింద ఉప్పొంగి జనాలను ముంచింది. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో మూసీ ఉధృతిని తగ్గించేందుకు కృషి చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దార్శనికతతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారు. జనంపైకి వరద రాకుండా అడ్డుకోవడానికి కట్టిన జలాశయాల గేట్లను ఎత్తడం వెనుక ఆంతర్యమేంటో ఏలినవారికే తెలియాలి. కానీ జనం మీదకు వదిలిన నీరు ప్రళయం సృష్టించింది. ప్రజానీకాన్ని ముంచింది... బస్తీల బతుకులను బజారున పడేసింది. శుక్ర, శనివారాల్లో మూసీ ముంచెత్తడంతో పరీవాహక ప్రాంతంలోని జనాలు గూడుచెదిరిన పక్షుల్లా, ఒడ్డున పడ్డ చేపల్లా విలవిల్లాడుతున్నారు.

మొదటిపేజీ తరువాయి...

మోసుకొచ్చిన బురదను చూసుకుంటూ నీళ్లపాలైన కష్టార్జితాన్ని చూసి ఏడ్చుకుంటూ బస్తీ జనం విలపిస్తున్నారు. జీవితకాలం కష్టం గంగపాలైపోయింది. ఏ ఇంటికిపోయినా కట్టుబట్టలుతప్ప ఏమీ బాగాలేవన్న బాధే.

మా గోడు వినేవాళ్లే లేరు!

మూసీ ముంచెత్తిన మూసారాంబాగ్, శంకర్‌నగర్ (మలక్‌పేట్), న్యూ అంబేద్కర్ నగర్ (అంబర్‌పేట), వినాయకవీధి (మలక్‌పేట్), మూసానగర్, కృష్ణానగర్ (కాచీగూడ) బస్తీల్లో ఇండ్లు, ఇండ్లను ఆక్రమించిన బురద తప్ప ఏమీ కనిపించిన దుస్థితి. బురదను ఎత్తిపోసేందుకు పురపాలక సిబ్బంది లేక ఆదివారం నాడు రోడ్లన్నీ మడుగుల్లెక్కనే ఉన్నాయి. మూసీ ప్రవాహం పోటెత్తడంతో మలక్‌పేట, అంబర్‌పేట, మూసారాబాగ్ సమీపంలోని బస్తీలన్నీ శుక్రవారం, శనివారం జలమయం అయినయ్. లెక్కలేనన్ని వానలు, ఎన్నో వరదలు చూసిన బస్తీవాసులు ఎన్నడూ చూడని వరదను ఎత్తిపోసుకుంటున్నారు. 'ఇంతకన్నా పెద్ద వానలు చూశినం. ఎంత వరద వచ్చినా ఇంట్లకు రాలే. ఇప్పుడెందుకొచ్చిందో మాకెరుకే' అంటూ బస్తీ జనం అధికారులకు శాపనార్థాలు పెడుతున్నరు. 'అధికారులు ఎందుకు రావట్లే. మా బాధలు ఎందుకు వినట్లే. మాకు న్యాయం చేయాలె' అనే జనం ఎన్నో ఆరోపణలు చేస్తున్నరు. ముఖ్యంగా తమ ఇండ్లను కూల్చేందుకు హైడ్రా కుట్ర చేసిందని ఆరోపిస్తున్నారు. ఇది మూసీ ఉగ్రరూపం కాదని, హెచ్చరికలు లేకుండా వచ్చిన వరద కచ్చితంగా హైడ్రా కుట్రనే అని మండిపడుతున్నారు. 'ఇండ్లు ఖాళీ చేయించనీకి మా బతుకుల్ని వరదపాలు చేయడం న్యాయమేనా?' అని అడుగుతున్నరు.

బావురుమంటున్న బస్తీలు

మూసీ వరదల్లో చిక్కుకున్న బస్తీల్లో నుంచి శనివారం సాయంత్రం వరద వెనక్కుపోవడం మొదలైంది. ఆదివారం ఉదయం ప్రజానీకం మెల్లమెల్లగా ఇండ్లల్లోకి తిరిగి చేరుకుంటున్నరు. ఇప్పటికీ కొన్ని ఇండ్లు తాళాలు పడే ఉన్నాయి. తలుపు తెరిచి చూస్తే ఏమీ మిగల్లేదని బాధితులు వాపోతున్నారు. ఇండ్లల్లోని సామాన్లు, వస్తువులు బురదపాలైపోయాయని విలపిస్తున్నారు. బురదను ఎత్తిపోస్తూ పిల్లాజెల్లా కష్టపడుతున్నారు. ఇల్లు, వాకిలిని శుభ్రం చేసుకునేందుకు కూడా నీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద వదులుతున్నట్టు ముందే చెప్తే సామాన్లయినా కాపాడుకునేటోళ్లం కదా అని ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. 'మమ్మల్ని ఈడికెల్లి తరమాలనుకున్నరు గవర్నమెంటోళ్లు. అందుకే మా బతుకుల్లో బురద గొట్టిన్రు' అని అనని తల్లి లేదు. 'సీఎం రేవంత్‌రెడ్డి మా గురించి ఏం ఏమైనా ఆలోచిస్తున్నడా? మా బాధ గురించి ఏమైనా పట్టించుకుంటున్నడా?' అని నిలదీస్తున్నారు. వరద ఉధృతికి దెబ్బతిన్న ఇండ్ల ఆనవాళ్లు కోల్పోవడంతో.. అక్కడ ఉండలేక దూరంగా ఫుట్‌పాత్‌ల మీద, ఇండ్ల అరుగుల మీద బతుకులు వెళ్లదీస్తున్నారు.

ఇండ్లు ఖరాబ్.. సామాన్లు గాయబ్

బస్తీల్లో ఉండే కిరాణా షాపులు, టైలరింగ్ షాపులు, చేతి వృత్తుల వాళ్ల సామాగ్రి పూర్తిగా నీటిపాలైంది. వీధుల్లో పార్క్ చేసిన వేలాది వాహనాలు పనిచేసే పరిస్థితిలేదు. వాహనాలే జీవనాధారంగా ఉన్న బస్తీ ప్రజలకు ఉపాధి లేకుండాపోయింది. ఇండ్లలో నుంచి మెకానిక్ షెడ్లలో నుంచి చాలా వాహనాలు మూసీ వరదలో కొట్టుకుపోయాయి. తమ వాహనాలు తిరిగి అప్పగించాలని యజమానులు మెకానిక్‌లను డిమాండ్ చేస్తున్నరు. మూసీ పరీవాహకంలోని దోబీ ఘాట్‌లలో కూడా ఇదే సమస్య నెలకొంది. రజకులు మూటలు కట్టి దాచుకున్న దుస్తులన్నీ వరదకు కొట్టుకుపోయాయి. లాడ్జిల దుప్పట్లు, కవర్లు, ఫంక్షన్ హాల్ స్క్రీన్లు మూసీలో కొట్టుకుపోయా. వాటిని అప్పగించాలని దోభీలతో హోటల్ యజమానులు ఘర్షణకు దిగుతున్నారు. విపత్తులో నష్టపోయిన తమకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మూసీకి సమీపంలోని ఇండ్లలోని గొర్రెలు, కోళ్లు, బాతులు నదిలో కొట్టుకుపోయినయి.



మూసానగర్‌లోకి పోటెత్తిన మూసీ వరదలో కొట్టుకొచ్చిన వ్యర్థాలు, వస్తువులు, బట్టలను తొలగిస్తున్న స్థానికులు

పదిరోజులు ఆపి.. ఒక్కసారే వదిలి



మూసీకి వరద వచ్చేది అధికారులకు తెల్వదా? పది రోజుల నుంచి నీళ్లు వదలకుండా ఆపిన్రట. ఆ నీళ్లన్నీ ఒక్కసారే వదిలితే ఇంత వరద రాకపోతే ఏమైతది? ఎన్నడూ లేని బాధ ఇప్పుడొచ్చింది? ఇంతకుముందు వచ్చిన వరదల కంటే ఈ సారి వచ్చిన వరద ఎక్కువ. గండిపేట నీళ్లు ఒక్కసారిగా కిందకు వదిలిన్రు కాబట్టే ఇట్లయ్యింది. తప్పు చేశినోళ్లకు ఏం శిక్ష వేస్తరు. శిక్ష సీఎంకు వేయాల్నా.. ఎమ్మెల్యేకు వేయాల్నా? ఈ సర్కార్‌లో అన్నీ సమస్యలే. పరిపాలనే సక్కగ లేదు.

- ఎండీ ఆసిఫ్, మూసారాంబాగ్

కార్లు కొట్టుకుపోయినయ్



రిపేరు అయిపోయిన కార్లు పక్కకు పెట్టినం. ఓనర్స్ తీస్కపోవాలె. ఇంతల్నె వరదొచ్చింది. వరద పెరిగే సరికి నీళ్లల్లో తేలినయ్. మూసీ గుంజుకపోయింది. ఓ బీఎండబ్ల్యూ కారును మూసీలోంచి తెచ్చినం. ఇంకా రెండు హ్యుందాయ్ కార్లు జాడ లేకుండా పోయినయ్. మా పనిముట్లు, కార్ల పార్టులన్నీ వరదల కొట్టుకుపోయినయ్. పైన వానలు పడ్డయని ముందే తెలుసు. ఆలస్యం చేయకుండ అప్పుడే నీళ్లొదిలితే ఇట్ల కాకుండు. ఇంతకన్నా పెద్ద వానలు పడ్డప్పుడు ఇట్ల కాలేదు. ముందుగాలే కొన్ని గేట్లు ఎత్తి పెట్టినట్టయితే నీళ్లు రాకపోవు.

- ఎండీ సోహెల్, మూసారాంబాగ్

పాములొచ్చి పట్టుకున్నయ్



వరద ఒక్కసారే వచ్చింది. ఎక్కువ గేట్లు ఎత్తబట్టి ఒకేసారి వరదొచ్చింది. ఆరు గంటలకు మా వర్క్‌షాప్‌లోకి నీళ్లొచ్చినయ్. మోకాలి లోతు నీళ్లల్ల అట్లనే ఉందామనుకుని ధైర్యంగనె ఉన్నం. గంట గంటకు నీళ్లు పెరుగుతున్నయ్. బయటికి పోయేట్టు లేదు. ఏమీ చేయాల్నో అర్థం కాలేదు. ఎక్కడోళ్లం అక్కడనే ఉన్నం. ఆఫీసర్లు నీళ్లు వదిలిపెట్టిన్రు. కానీ నీళ్లల్లో చిక్కుకోకుండా ముందేం చేయాలో చేయలే కదా. నీళ్లల్లో చిక్కుకున్న వాళ్లను బయటికి తీసుకురానీకి వాళ్లేం చేశారో మాకు తెలియదు. నీళ్లల్లో పాములున్నయ్. అదే నీళ్లల్ల మేమున్నం. పాములు కాళ్లకు చుట్టుకుంటున్నయ్. ఒక నిచ్చెన గోడకు వేసుకోని పైకెక్కినం. గోడ దుంకి పోయినం.

- కుమ్మరి కిరణ్, వాషింగ్ సర్వీస్ వర్కర్

ఇంత కుట్ర చేయాల్నా?



నాది చిన్న మిషన్ల కార్ఖానా. నాకు ఇద్దరు పిల్లలు. వరద నా దుకాణాన్ని మొత్తం ముంచింది. మిషన్లన్నీ దెబ్బతిన్నయ్. రోజుకు ఐదువందల నుంచి వెయ్యిరూపాయలు వచ్చేది. ఇప్పుడు మొత్తం పోయింది. మేం ఎట్ల బతకాల్నో అర్థమైత లేదు. ఇదంత ప్లాన్‌తోనే చేసిన్రనిపిస్తున్నది. అసలు నీళ్లు ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడూ రాలే. హైడ్రాను చూపించి బెదిరించాలని అనుకుంటున్నారా? ఏం చేస్తున్నరు? సర్కార్ తీరేం బాగా లేదు. ముందు జనం బతుకులు బాగు చేయున్రి. జనాన్ని ఇబ్బంది పెట్టేందుకు ఇంత కుట్ర చేయాల్నా?

- యూసఫ్, కార్ఖానా



బస్టాండ్, మెట్రో కూలుస్తరా?

మూసీ నీళ్లొంచ్చిన కాడికల్లా మార్క్ చేస్తమంటున్నరు... కూలుస్తమంటున్నరు. మరి ఎంజీబీఎస్ నీళ్లల్ల మునిగింది. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ మూసీలనే కట్టిన్రు. వాటిని కూలుస్తరా? మా ఇండ్లను కూల్చేందుకే పక్కా ప్లాన్‌తోనే ముందు చెప్పుకుండ వరద వదిలిన్రు. ఈ వరదతోని మూసీ నది ఏడి దాంక ఉందో తెలిసిపోయిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అంటున్నడు. మా ఇండ్లు నీట మునిగినయనే సోయి లేకుండా అట్ల మాట్లాడొచ్చా? మాకు కనీసం తలదాచుకునేందుకు జాగ చూపియ్యాలె కదా. సీఎం రేవంత్ రెడ్డి కలలు కన్న మూసీ ప్రాజెక్టు కోసం మా బతుకుల్ని నీళ్లపాలు జేసిండు. ఇంటి పైకప్పు దాంక నీళ్లొంచ్చినయ్.

-నియాజుర్ రహీమ్, మూసానగర్ బస్తీ



చిట్టి తల్లి పెద్ద మనసు

ఈ చిన్నారి పేరు సంధ్య. మలక్‌పేటలోని శంకర్‌నగర్ బస్తీలో అద్దెకు ఉంటున్నారు. వీళ్ల అమ్మ పనికి పోయింది. మూసీ వరద మోసుకొచ్చిన బురదతో సంపు నిండిపోయింది. ఇల్లంతా బురద. బట్టలన్నీ బురద. బాసన్లకు బుదర పట్టింది. బట్టలన్నీ తడిసిపోయినయ్. అన్నీ సాఫ్ చేయాల్నంటే నీళ్లు కావాలె. అందుకే ముందుగా సంపు సాఫ్ చేయానీకి పూనుకున్నదీ చిట్టితల్లి. ఒంటి మీద ఉన్న బట్టలు తప్ప మిగిలిన బట్టలన్నీ పాడైపోయినయ్. ఒంటి మీద ఉన్న బట్టలకు బురదంటకుండ వాటిని విప్పి చిన్నగా నీళ్లు తోడింది. తల్లికి చేదోడయ్యిందని దారినపోయేటోళ్లు మెచ్చుకున్నరు. ఎందుకిట్ల చేస్తున్నవని అడిగితే.. ఇది మా సంపు కాదు. మాది పక్క ఇల్లని చెప్పింది. వాళ్ల దోస్తు వాళ్ల అమ్మ పనికి పోయింది. వాళ్లకు నాన్న లేడు. 'ఇల్లంత ఆగంగుంటే సాయం చేయనీకి వచ్చిన' అని చెప్పింది ఈ బంగారు తల్లి! గవర్నమెంట్‌కు కూడా ఈ చిట్టితల్లికి ఉన్నంత పెద్ద మనసు ఉంటే బాగుండు అని అందరూ అనుకున్నరు.

పుస్తకాలు తడిసిపోయినయ్

మూసానగర్‌లో ఒక్కసారిగా మూసీ ముంచెత్తడంతో ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఆదివారం వరద ఉధృతి తగ్గడం, ఇండ్లలో నీరు బయటకు పోవడంతో ప్రజలు సామాన్లను, వస్తువులు, వాహనాలను శుభ్రం చేసుకుంటున్నారు. ఇలాంటి వరద ఎప్పుడూ చూడని చిన్నారులకు ఏం జరిగిందో కూడా అర్థం కావడంలేదు. ఆడుతూ పాడుతూ తిరిగిన కాలనీలు నదిలో ఎందుకు మునిగిపోయాయో అంతు పట్టడంలేదు. వదర ఎందుకు వచ్చిందో తెలియని విద్యార్థులు... తల్లిదండ్రులతో కలిసి బిక్కుబిక్కుమంటూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత తమ పుస్తకాలను చూసి విలవిల్లాడిపోతున్నారు. తడిసిపోయిన పుస్తకాలను అరబెట్టుకుని, కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆదివారం మూసానగర్‌లో ఏ ఇంటి వద్ద చూసినా.. 'పుస్తకాలు తడిసిపోయినయ్' అంటూ అమాయకంగా చెప్పే చిన్నారుల మాటలు చూపరుల హృదయాలను కదిలించాయి.





దసరా సంబురం ఎత్తుకుపోయిన వరద

కల్వకుర్తి దగ్గర అంతారం ఊరి నుంచి వచ్చినం. మా నాన్న చనిపోయిండు. మా అమ్మ ఇండ్లల్ల పని చేస్తది. ఒక్క గదిలో అద్దెకు ఉంటున్నం. దసరా పండుగొచ్చిందని అమ్మ అప్పు చేసి నాకూ, అన్నకు కొత్త బట్టలు కొన్నది. పండుగ రోజు ఆ కొత్త బట్టలు కట్టుకోవాలనుకున్నం. ఇంతల్నే వరదొచ్చింది. ఇల్లొదిలిపోయినం. చిన్న షెల్ఫ్ ఉంది. అన్నీ తడిస్తే తడవనీ, పుస్తకాలు తడవొద్దని అమ్మ పైన పెట్టింది. నా పుస్తకాలు, అన్న పుస్తకాలు తప్ప అన్నీ మునిగినయ్. కొత్త బట్టలకు బుదరపట్టింది. ఉతుక్కుని అరేసినం.

- గౌతమ్, శంకర్ నగర్, మలక్‌పేట

భూముల కోసమే మెట్రో డీల్!



ఎల్ అండ్ టీ తప్పుకోవడం వెనుక అనుమానాలు

- మెట్రోకు 300 ఎకరాలకుపైగా ల్యాండ్ బ్యాంక్
- విలువ రూ.16 వేల కోట్లు ఉంటుందని అంచనా
- వాటిని హస్తగతం చేసుకునేందుకే ప్లాన్ చేశారా?

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో నుంచి ఎల్అండ్‌టీ సంస్థ తప్పుకోవడం వెనుక భారీ భూదందా దాగి ఉన్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెట్రోకు నగరంలోని పలు ప్రాంతాల్లో 300కు పైగా ఎకరాల భూములున్నాయి. వీటిని చేజిక్కించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో డీల్‌ను తెరమీదికి తెచ్చిందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మెట్రోకు నగరవ్యాప్తంగా ఉన్న ల్యాండ్ పార్శిళ్లు, మాల్స్‌పై పెద్దల కన్ను పడిందని చెప్తున్నారు. ఇన్నేండ్లుగా నష్టాలను దిగమింగిన ఎల్అండ్‌టీ సంస్థ ఉన్నట్టుండి ప్రాజెక్టు నుంచి తప్పుకోవడం వెనుక పెద్దల ఒత్తిళ్లు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఇలాంటి ఆరోపణలే చేయడంతో ఇటు వ్యాపార వర్గాల్లో, అటు రాజకీయ వర్గాల్లో మెట్రో డీల్ చర్చనీయాంశంగా మారింది. మెట్రో వ్యవస్థలో రెండు భారీ డిపోలతోపాటు, 57 స్టేషన్లు ఉన్నాయి. దీని నిర్మాణానికి అప్పట్లో రూ.18,880 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 70% రుణాలతో సర్దుబాటు చేయగా మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ సంస్థ భరించింది. రాష్ట్ర వాటాగా ఎల్అండ్‌టీ సంస్థకు ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కట్టబెట్టింది. ఈ భూమిని డెవలప్ చేయడం ద్వారా మెట్రో నిర్వహణ సంస్థ ఏటా 55% రెవెన్యూ సృష్టించాలని ఒప్పందంలో ఉన్నది. మాల్స్ నిర్మాణం, మెట్రోస్టేషన్ల వద్ద కమర్షియల్ స్పేస్‌ను లీజుకివ్వడం ద్వారా రెవెన్యూ సమకూర్చుకోవాలనేది ప్రణాళిక. స్టేషన్ల నిర్మాణాల్లో 70-80% మెట్రో అవసరాలకు వినియోగించి, మిగిలిన 20% స్థలాన్ని నిర్మాణ సంస్థ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. ఇందులో అత్యధిక శాతం భూములను వినియోగంలోకి తేవడంలో ఎల్అండ్‌టీ విఫలమైంది. ప్రస్తుతం మియాపూర్ డిపో కోసం 99 ఎకరాలు, ఫలక్‌నుమా (నిర్మాణం కాలేదు) వద్ద 17 ఎకరాలు, నాగోల్ డిపో వద్ద మరో 96 ఎకరాలు కలిపి మొత్తంగా 212 ఎకరాలు ఖాళీ స్థలాలున్నాయి. వీటితోపాటు 25 మెట్రో స్టేషన్ల సమీపంలో మరో 57 ఎకరాలు ఖాళీ జాగాలున్నాయి. మరో 30 ఎకరాల విస్తీర్ణంలో మెట్రో స్టేషన్లపై భాగంలో ల్యాండ్ బ్యాంక్ కలిపి 300 ఎకరాల మేర భూములున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. మార్కెట్ లెక్కల ప్రకారం ఈ ల్యాండ్ విలువ రూ.14 వేల కోట్ల నుంచి రూ.16వేల కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ భూములకు ఉన్న విలువతోనే ప్రభుత్వం ఈక్విటీ షేర్ కొనుగోలుకు ఆసక్తి చూపిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎల్ అండ్‌టీ తప్పుకోవడంతో లైన్‌క్లియర్

ప్రభుత్వం ఇచ్చిన భూములను వినియోగంలోకి తీసుకొచ్చి, వాణిజ్యపరమైన లావాదేవీలు పెరిగితే మెట్రోకు భారీ స్థాయిలో లాభాలు ఉండేవి. కానీ టికెట్, ప్రకటనల రూపంలో వచ్చే ఆదాయంపై మాత్రమే మెట్రో నిర్వహణ సంస్థ ఆధారపడింది. దీంతో ఏటా నష్టాల భారం పెరుగుతూ పోయింది. మెట్రో నిర్వహణ నుంచి ఇప్పుడు ఎల్ అండ్ టీ తప్పుకోవడంతో విలువైన భూములకు ఉన్న అడ్డంకులు తొలిగిపోయాయి. ఈ భూములను ప్రభుత్వ అవసరాలు, ఆదాయ వనరుల సమీకరణ పేరిట అప్పణంగా కట్టబెట్టే వీలు ఉంటుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. ప్రభుత్వ పెద్దలకు దాగున్న ప్రయోజనాల వల్లే ఎల్అండ్‌టీ సంస్థ వైదొలిగిందని ఆరోపణలున్నాయి. ఇదే నిజమైతే విలువైన మెట్రో భూములను ప్రభుత్వం తమ అస్మదీయులకు అగ్గువకు కట్టబెట్టే అవకాశం ఉన్నదని, చివరికి ప్రైవేటు వ్యక్తులు హస్తగతం చేసుకుంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. భూముల డెవలప్‌మెంట్ ద్వారా ఆశించినంత ఆదాయం వచ్చే అవకాశాలు లేకపోవడంతో గతంలో ఎల్అండ్‌టీ సంస్థ వెనక్కి తగ్గింది. కానీ రియల్ ఎస్టేట్‌పై సంపూర్ణ అవగాహన కలిగిన సీఎం రేవంత్ ఈ భూముల విలువను గుర్తించే తాజా ఒప్పందం చేసుకున్నారని అంటున్నారు. ముందుగా ప్రభుత్వం రూ.15వేల కోట్ల అప్పుల భారాన్ని మోస్తున్నదని, వీటిని అధిగమించడానికి భూములను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నామని ప్రచారం చేస్తారని పేర్కొంటున్నారు. తర్వాత అప్పుల భారం తగ్గించుకునే పేరుతో భూములను ఆత్మీయులు, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు.

హాట్ కేకుల్లా మెట్రో మాల్స్

మెట్రోకు 3 మాల్స్ ఉన్నాయి. వాణిజ్య కేంద్రాలుగా ఉన్న ఎర్రమంజిల్, పంజాగుట్ట, హైటెక్ సిటీలో ఎల్అండ్‌టీ వీటిని నిర్మించింది. వీటిలో 15 లక్షల చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్ అందుబాటులో ఉన్నది. అయితే ఈ మాల్స్ భవిత ప్రశ్నార్థకంగా మారింది. మెట్రో నిర్వహణ నుంచి ఎల్అండ్‌టీ తప్పుకోవడంతో హాట్ కేకుల్లాంటి మెట్రో మాల్స్ కూడా ప్రభుత్వ పెద్దలను ఆకర్షిస్తున్నాయి. వీటి ద్వారా వందల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉండటంతో రేవంత్ సర్కారు తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ పెద్దల సొంత వ్యాపారాలకు అనువుగా మారవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మెట్రోకు ఉన్న భూముల వివరాలు

• ప్రాంతం • ఎకరాలు

99 మియాపూర్ డిపో

17 ఫలక్‌నుమా (నిర్మాణం కాలేదు)

96 నాగోల్ డిపో

స్టేషన్ల వారీగా భూములు

పంజాగుట్ట శ్రీనగర్ కాలనీలో	3 ఎకరాలు
మియాపూర్ టెర్మినల్ స్టేషన్	5 ఎకరాలు
బాలానగర్ ట్రక్ టెర్మినల్	2 ఎకరాలు
ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద	3 ఎకరాలు
హబ్సిగూడలో	8 ఎకరాలు
నాగోల్ టెర్మినల్ వద్ద	4 ఎకరాలు
తార్నాక వద్ద	2.5 ఎకరాలు
మూసారాంబాగ్ గవర్నమెంట్ క్వార్టర్	4 ఎకరాలు
ప్యారడైజ్ పీజీ కాలేజ్	2 ఎకరాలు

వీటితోపాటు పలు ప్రాంతాలో ఎకరం నుంచి రూ. 1.8 ఎకరాలలోపు 15 ప్రాంతాల్లో భూములు ఉన్నాయి.



రేవంత్ ఈగోతో 15 వేల కోట్ల నష్టం

- సీఎం చేతగానితనంతో అభివృద్ధికి విఘాతం
- ఫోర్త్‌సిటీ కోసం ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో రద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావంతో తెలంగాణకు రూ. 15,000 కోట్ల నష్టం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మెట్రో ప్రాజెక్ట్ నుంచి ఎల్అండ్‌టీ తప్పుకోవడంతో ఆ సంస్థ కోసం తెచ్చిన రుణంతో పన్నుదారులపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చేతగానితనంతో రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆదివారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి తన రియల్ ఎస్టేట్ అవసరాల కోసం, ఉనికిలో లేని ఫోర్త్‌సిటీ వైపు మెట్రోను మళ్లించే నెపంతో ఏకపక్షంగా ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్‌ను రద్దుచేశారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపై అనవసర రాద్ధాంతం చేసి ఎల్అండ్‌టీపై అక్రమ కేసులు నమోదు చేస్తామని, సంస్థ ఎఫ్ఎల్‌వోను జైల్లో పెడతానని బెదిరించారని గుర్తుచేశారు. ఆయన అరాచకాలు భరించలేకే ఎల్అండ్‌టీ రాష్ట్రం నుంచి వెనక్కివెళ్లిపోయిందన్నారు. 'కాంగ్రెస్ సర్కారు చేతగానితనంతో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోయింది. ఆరోగ్యశ్రీ స్తంభించిపోయింది. ఆరు గ్యారెంటీల కార్డు అటెకెక్కింది'అంటూ విమర్శలు గుప్పించారు.

ఈడీ దాడులే ఆ పార్టీల అపవిత్ర బంధానికి నిదర్శనం

'మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు జరిగి నేటికి ఏడాదైనా ఏం దొరికిందో, ఎంత నల్లధనం పట్టుబడిందో ఎందుకు చెప్పడంలేదు? ఈడీ అధికారులు, రాష్ట్ర మంత్రి, కేంద్రంలోని బీజేపీ ఎందుకు నోరుమెదపడంలేదు? మంత్రి ఇంట్లోకి కరెన్సీ లెక్కింపు యంత్రాలు పంపినట్టు వార్తలు వచ్చాయే తప్ప తేల్చిందేమీలేదు' అంటూ కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఏడాదైనా ఈ వ్యవహారం బ్రహ్మరహస్యంగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. కనీసం కేసులు కూడా నమోదు చేయకపోవడం విడ్డూరమన్నారు. ఇంత గొప్ప ఘనత సాధించి విజయవంతంగా వాషింగ్ మెషిన్‌ను నడుపుతున్న కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలాసీతారామన్, ఈడీ బృందానికి నా అభినందలు అని ఎద్దేవా చేశారు. పొంగులేటి ఇంటిపై దాడుల తదనంతరం పరిణామాలే బీజేపీ, కాంగ్రెస్ మధ్య అపవిత్ర బంధానికి నిదర్శనమని కేటీఆర్ ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెంటనే సవరించాలి

రాష్ట్ర మాల సంఘాల జేఏసీ



సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 28: ఎస్సీ వర్గీకరణ చట్టంతో మాల సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని మాల సంఘాల జేఏసీ ఆందోళన వ్యక్తంచేసింది. ఆదివారం మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మాల సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా మందాల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవగాహన రాహిత్యంతో చేసిన ఎస్సీ వర్గీకరణ చట్టం మాల సామాజిక వర్గాన్ని తీవ్రంగా నష్టపరుస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పట్టించుకోకుండా తీసుకొచ్చిన ఈ చట్టాన్ని తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు.

ఫ్యూచర్‌సిటీని న్యూయార్క్‌లా మారుస్తా

- ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తా
- సింగపూర్, జపాన్, న్యూయార్క్, దుబాయ్‌ను మరిపించేలా నిర్మాణం
- కోర్టుల చుట్టూ తిప్పకండి.. కూర్చొని మాట్లాడుకుందాం
- ఫ్యూచర్‌సిటీ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీని న్యూయార్క్ సిటీలా మారుస్తానని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఫ్యూచర్‌సిటీ నుంచి బెంగళూరు, అమరావతి, చెన్నైకి బుల్లెట్ ట్రైన్‌ను కేంద్రం మంజూరు చేసిందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో గురువారం ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. తాను ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మించాలనుకుంటే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, తనకు ఇక్కడ భూములున్నాయని అందుకే నగరం నిర్మిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారని చెప్పారు. తనకు పదేండ్ల సమయమిస్తే దీనిని న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు కూడా భారత్ ఫ్యూచర్‌సిటీని చూసొచ్చాం అని చెప్పుకొనేలా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఫ్యూచర్ సిటీ మరో న్యూయార్క్, సింగపూర్, దుబాయ్, జపాన్ నగరాలనే మరిపిస్తుందని చెప్పారు. ఇక్కడికి ప్రపంచంలోని 500 కంపెనీలను రప్పిస్తానని స్పష్టంచేశారు. నెలకు మూడుసార్లు ఇక్కడికి తానొస్తానని, ఇక్కడే కూర్చొని కంపెనీలను రప్పిస్తానని చెప్పారు. ఈ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సహకరించాలని స్థానిక నేతలు, రైతులను ఆయన కోరారు. సమస్యలపై కోర్టుల చుట్టూ తిప్పొద్దని, ఏవైనా సమస్యలుంటే కూర్చొని మాట్లాడుకుందామని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మీ తాతలు, ముత్తాతల భూములను అప్పనంగా తీసుకోబోనని, తనకు కూడా వ్యవసాయం ఉన్నదని, భూమితో వ్యాపారం ఉన్నదని, భూమి విలువ తనకు తెలుసని చెప్పారు. ఫ్యూచర్ సిటీకి అందరూ సహకరిస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు.



ఫ్యూచర్ సిటీలో సింగరేణి గ్లోబల్ ఆఫీస్

వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రాష్ట్రాలు, ఖండాంతరాలకు విస్తరిస్తున్న సింగరేణి సంస్థ అంతర్జాతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు ఫ్యూచర్ సిటీలో సింగరేణి గ్లోబల్ ఆఫీస్ కోసం సుమారు 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రాబోయే డిసెంబర్‌లోపు అంతర్జాతీయ కార్యాలయ నిర్మాణాలను పూర్తిచేసి, ప్రారంభించాలని ఆదేశించారు.

ఈనెల ఉద్యోగులకు 700 కోట్లు డౌటే!

- ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 10వేల కోట్లకుపై మాటే..!
- నెలకు 700 కోట్ల చొప్పున చెల్లిస్తామన్న కాంగ్రెస్ సర్కారు
- ఈనెల వాటా విడుదల చేయని వైనం
- ఉద్యోగులు, పెన్షనర్ల ఎదురుచూపు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : 'మొత్తం పెండింగ్ బిల్లులను ఒకేసారి ఇవ్వలేం. ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులు విడుదల చేస్తాం' ఇది ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీ. కానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది. ఈ నెలలో విడుదల చేయాల్సిన రూ.700 కోట్లింకా విడుదల చేయలేదు. ఇప్పటికే నెల ముగింపునకు చేరుకున్నది. దసరా పండుగ సమీపిస్తున్నది. వరుస సెలవులున్నాయి. ఈ రెండు రోజుల్లో బిల్లులు జారీకావడం కష్టంగానే కనిపిస్తున్నది. ఉద్యోగ సంఘాల జేఏసీ హెచ్చరికలతో గత నెలలో కొన్ని బిల్లులను సర్కారు విడుదల చేసింది. అయితే ఈ నెల బిల్లులపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఆర్థికంగా కుదేలై అవస్థలు పడుతున్న తరుణంలో రాష్ట్ర ఖజానాపై జీఎస్టీ స్లాబుల మార్పిడీ దెబ్బ పడింది. స్లాబుల మార్పిడీతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. ఈ నేపథ్యంలో ఈనెల పెండింగ్ బిల్లుల విడుదల కష్టమేనని తెలుస్తున్నది.

ప్రతి ఉద్యోగీ బాధితుడే

రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు మొత్తం అక్షరాలా 10 వేల కోట్లకు పైనే ఉన్నాయి. జీపీఎఫ్, సరెండర్, లీవు, నగదు ఎన్‌క్యాష్‌మెంట్ లీవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీజీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, సంపాదిత సెలవుల బిల్లులు మొత్తం రూ.8 వేల కోట్లు ఉంటే సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించినవి మరో రూ.2 వేల కోట్ల బిల్లుల బకాయి ఉన్నట్టు ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయి. సీపీఎస్ ఉద్యోగులకు వాటాను సైతం సర్కారు చెల్లించడంలేదు. రాష్ట్రంలో 3.6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. వీరందరికీ ఏదో ఒక బిల్లు పెండింగ్‌లో ఉన్నది. దీంతో ప్రతి ఉద్యోగీ పెండింగ్ బిల్లుల బాధితులేని తెలుస్తున్నది. గతంలో పెండింగ్ బిల్లులను ట్రెజరీలో సమర్పించిన 24 గంటల్లో డబ్బు ఉద్యోగి అకౌంట్లో పడేది. కానీ ఇప్పుడు కండ్లు కాయలు కాసేలా వేచిచూడాల్సి వస్తున్నది.

పెండింగ్ డీఏలపై పేరడీ పాటలు

పెండింగ్ డీఏలను సర్కారు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు పేరడీ పాటలతో నిరసన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు డీఏలను బాకీపడింది. ఇప్పటివరకు రెండు డీఏలు మాత్రమే విడుదల చేసింది. ఈ రెండు డీఏ బకాయిలను వాయిదాల్లో చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 9 వాయిదాల డీఏ చెల్లించలేదు. డీఏ పెండింగ్‌లో ఉండటం, బకాయిలు విడుదల చేయకపోవడంతో ఉద్యోగుల బాధలు వర్ణనాతీయంగా మారాయి.



ఆసియా కప్ ఫైనల్లో పాక్‌పై భారత్ ఘనవిజయం సాధించడంతో అభిమానులు సంబురాల్లో మునిగితేలారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం ఎదుట ఆదివారం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు సందడి చేశారు. టీమిండియా విజయంపై హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలగొద్దు

రవాణాశాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాన రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు.

ఫిబ్రవరిలో ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): హైదరాబాద్-విజయవాడ(ఎన్‌హెచ్-65) జాతీయ రహదారి 8 వరుసల విస్తరణ పనులను వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్టు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి కానున్నట్టు స్పష్టంచేశారు. ఈ రహదారిపై ఇప్పటికే 17 బ్లాక్‌స్పాట్స్ గుర్తించి ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.

'టీ-ప్రైడ్'లో మళ్లీ వాహనాలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): టీ-ఐడియా (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్), టీ-ప్రైడ్ (తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్స్) పథకాల కింద మళ్లీ వాహనాలకు సబ్సిడీలు ఇచ్చేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

సౌర విద్యుత్తు గ్రామంగా కొండారెడ్డిపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సంపూర్ణ సౌర విద్యుత్తు గ్రామంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి రికార్డులకెక్కింది. టీజీరెడ్‌కో ద్వారా ఈ గ్రామాన్ని పూర్తి సోలార్ గ్రామంగా తీర్చిదిద్దారు. గ్రామంలో మొత్తం 514 ఇండ్లతోపాటు, 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించారు. కొండారెడ్డిపల్లిలో సంపూర్ణ సోలార్ ప్రాజెక్ట్ కోసం రూ. 10.53కోట్లను వెచ్చించారు.

ఫిరాయింపులపై నేటి నుంచి విచారణ

మొదటిపేజీ తరువాయి...

హాజరవుతారు. వీరి మీద ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింత ప్రభాకర్ సైతం ట్రిబ్యునల్ ముందు హాజరు కానున్నారు.

ప్రజాప్రతినిధులు, మీడియాపై ఆంక్షలు

శాసనసభ భవనాల ప్రాంగణంలో ప్రత్యక్ష విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని ఆంక్షలు అమల్లోకి వచ్చాయని అసెంబ్లీ కార్యదర్శి పేర్కొన్నారు. అక్టోబర్ 6వరకు అమలులో ఉంటాయన్నారు. ట్రిబ్యునల్ ముందు హాజరయ్యే పిటిషనర్లు, ప్రతివాదులు, వారికి సంబంధించిన న్యాయవాదులు కోర్టుహాల్‌లోకి మొబైల్ ఫోన్‌లను తీసుకురావద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. విచారణ కార్యకలాపాలను రికార్డ్ చేసినా, ఫొటోలు తీసినా ఫోన్లను జప్తుచేస్తామన్నారు.

- ముందస్తు అనుమతి లేకుండా శాసనసభ భవనాల ప్రాంగణంలోకి సందర్శకులను అనుమతించరు.
- శాసనసభ భవనాల ప్రాంగణంలోకి మీడియా సిబ్బందికి అనుమతి లేదు.
- మీడియా పాయింట్ల వద్దగానీ, శాసనసభ భవనాల ప్రాంగణంలోగానీ ఫిర్యాదుదారులు, పిటిషనర్లు ప్రెస్ బ్రీఫింగ్ ఇవ్వొద్దు.
- ఎమ్మెల్సీలను, ఎమ్మెల్యేలను వారి శాసనసభ పార్టీ కార్యాలయాల వరకు మాత్రమే అనుమతిస్తారు.
- మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలకు, మాజీ ఎంపీలను శాసనసభ భవనాల ప్రాంగణంలోకి అనుమతించరు.

షెడ్యూల్ ఇదీ..

సమయం	ఎమ్మెల్యే	నియోజకవర్గం
ఉదయం 11 - 12 గంటల వరకు	ప్రకాశ్‌గౌడ్	రాజేంద్రనగర్
మధ్యాహ్నం 12- ఒంటి గంట	కాలె యాదయ్య	చేవెళ్ల
1-2 గంటల వరకు	గూడెం మహిపాల్‌రెడ్డి	పఠాన్‌చెరు
3-4గంటల వరకు	బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి	గద్వాల

సివిల్ సప్లయ్ గాడిలో పడేనా?

- అప్పుల కుప్పగా పౌరసరఫరాల శాఖ
- అధికారుల అలసత్వంతో అస్తవ్యస్తం
- ఐపీఎస్ కమిషనర్ అయినా ఫలితమేది?
- టెండర్ ధాన్యం నగదు వసూళ్లలో విఫలం
- ఇంకా 4వేల కోట్ల ధాన్యం మిల్లర్ల వద్దే
- అప్పట్లో 52 వేల కోట్ల అప్పులన్న ఉత్తమ్
- నేడు 90వేల కోట్లకు చేరినట్టు సమాచారం
- తాజా కమిషనర్‌గా మరో ఐపీఎస్ స్టీఫెన్..
- సవాల్‌గా మారిన పౌరసరఫరాల శాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): తెలంగాణ పౌరసరఫరాల శాఖ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రకు ఆ శాఖలో సమస్యలు సవాల్‌గా మారాయి. ఆయన నేతృత్వంలోనైనా ఆ శాఖ గాడిలో పడుతుందా? పరిస్థితులు అలాగే కొనసాగితే ఏకంగా ఆ సంస్థ దివాలా తీసి, భవిష్యత్తులో మూతపడటం ఖాయమనే ఆందోళన ఆ శాఖ ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నది. తెలంగాణ పౌరసరఫరాల శాఖలో అధికారుల అలసత్వం, ప్రచార యావ, అవినీతి కంపు.. వెరసి సంస్థ మొత్తం అస్తవ్యస్థంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పౌరసరఫరాల సంస్థను గాడిలో పెడతామంటూ తొలుత గొప్పగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారిని తప్పించి, ఏరికోరి ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్‌ను కమిషనర్‌గా నియమించారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని ప్రభుత్వ వర్గాలే చెప్తున్నాయి. బాగుపడటం దేవుడెరుగు.. ఈ ఏడాదిన్నర కాలంలో ఆ సంస్థ తిరోగమనంలో పయనించిందనే విమర్శలున్నాయి. టెండర్ ధాన్యం నగదు వసూళ్లలో, మిల్లర్ల నుంచి సీఎమ్మార్ వసూలులో, మిగిలిన దొడ్డు బియ్యాన్ని విక్రయించడంలో ఆ శాఖ ఘోరంగా విఫలమైందనే విమర్శలున్నాయి. దీంతో సివిల్ సప్లయ్ మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆందోళన నెలకొన్నది. దీనికి తోడు భారీ స్థాయిలో అవినీతి చోటుచేసుకున్నదనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన ప్రభుత్వం డీఎస్ చౌహాన్‌ను బదిలీ చేసి.. ఆయన స్థానంలో మరో ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రను తాజాగా కమిషనర్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలో అయినా సంస్థ గాడిలో పడుతుందా? అనే చర్చ ఉద్యోగుల్లో జోరుగా జరుగుతున్నది.

గుదిబండగా ధాన్యం టెండర్లు

టెండర్ల ద్వారా విక్రయించిన ధాన్యం సివిల్ సప్లయ్‌కు గుదిబండగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, ప్రభుత్వ అనాలోచిత, పక్షపాత నిర్ణయాలు ఆ శాఖ తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. 2024 ఫిబ్రవరిలో రూ.7వేల కోట్ల విలువైన 38 లక్షల టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయ్ టెండర్ ద్వారా విక్రయించింది. ఏడాదిన్నర దాటినా బిడ్డర్ల ద్వారా ఆ ధాన్యాన్ని ఎత్తించడంలో, డబ్బులు వసూలు చేయడంలో సివిల్ సప్లయ్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని తేలింది. ఆ తర్వాత కూడా కేవలం 20 లక్షల టన్నులు మాత్రమే తీసుకెళ్లిన బిడ్డర్లు ఇంకా 18 లక్షల టన్నుల ధాన్యాన్ని అలాగే వదిలేశారు. టెండర్ ధాన్యం ఎత్తడం లేదనే సాకుతో ఇటీవలే టెండర్లను సివిల్ సప్లయ్ రద్దుచేసింది. తద్వారా ఇంకా 18 లక్షల టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే ఉండిపోవడంతో సివిల్ సప్లయ్‌కు రూ.3,600 కోట్ల నష్టం వాటిల్లిందనే అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ మిగిలిన ధాన్యాన్ని ఏం చేయాలని, ఆ నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేయాలనేది పెద్ద సవాల్‌గా మారింది. ఈ టెండర్ ప్రక్రియ వల్ల అసలు, వడ్డీ కలిపి సుమారు రూ.5వేల కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అధికార వర్గాలే చెప్తున్నాయి.

దొడ్డు బియ్యం విక్రయంలో అలసత్వం

సన్న బియ్యం పంపిణీ నిర్ణయంతో రేషన్ షాపులు, గోదాముల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని విక్రయించడంలోనూ అధికారుల అలసత్వం సంస్థకు నష్టం చేసిందనే విమర్శలు ఉన్నాయి. రూ.500 కోట్ల విలువైన బియ్యం ఐదు నెలలుగా గోదాముల్లో మూలుగుతూ పురుగుపట్టిపోతున్నా వాటిపై నిర్ణయం తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సగం బియ్యం పాడైన తర్వాత ఇప్పుడు తీరిగ్గా ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తామంటూ సర్కార్ ప్రకటించింది. కిలో రూ.36 విలువ గల బియ్యాన్ని రూ.24 కనీస ధరగా ప్రకటించింది.

90 వేల కోట్లకు అప్పు?

బీఆర్ఎస్ సర్కారు పదేండ్లలో పౌరసరఫరాల శాఖను అప్పుల కుప్పగా మార్చిందంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ శాఖ రూ.52 వేల కోట్ల అప్పుల్లో ఉన్నదని, తాము ఈ అప్పు తీర్చడంతోపాటు ధాన్యం కొనుగోలుకు, రేషన్ బియ్యానికి అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి చెల్లిస్తామని బీరాలు పలికారు. కానీ ఆ మాటలన్నీ నీటిమూటలయ్యాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వం సివిల్ సప్లయ్‌కు రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం సివిల్ సప్లయ్ అప్పులు రూ.90 వేల కోట్లకు చేరినట్టు ఆ శాఖ అధికార వర్గాలే తెలిపాయి. అంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటల ప్రకారం బీఆర్ఎస్ పదేండ్లలో రూ.52 వేల కోట్ల అప్పులు చేస్తే.. కాంగ్రెస్ సర్కారు ఏడాదిన్నర కాలంలోనే రూ.38 వేల కోట్ల అప్పులు చేసినట్టు తేలింది. ఈ స్థాయిలో అప్పులు పెరగడానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని తెలుస్తున్నది.



చైనాలో ప్రపంచంలోనే ఎత్తయిన వంతెన


బీజింగ్: తమ దేశంలోని గిజ్‌హౌ ప్రావిన్స్‌లో ఒక నది, లోయపైన 625 మీటర్ల (2,051 అడుగులు) ఎత్తులో హుయజియాంగ్ కెన్యాన్ వంతెనను ప్రారంభించినట్టు చైనా ప్రభుత్వ మీడియా ఆదివారం వెల్లడించింది. ఇది ప్రపంచంలోనే ఎత్తయిన వంతెన అని తెలిపింది. మూడేండ్ల కాలంలో దీన్ని నిర్మించినట్టు చెప్పింది. ఈ వంతెన పైలాన్లు మేఘాలను పాక్షికంగా తాకుతున్నాయా అనేలా అనిపించే వీడియోను ప్రభుత్వ టెలివిజన్ విడుదల చేసింది. ఈ వంతెన వల్ల గతంలో ఇరు వైపులా ప్రయాణానికి రెండు గంటలు పట్టేదని.. ఇప్పుడు కేవలం రెండు నిమిషాలు పడుతోందని ప్రావిన్షియల్ రవాణా విభాగాధిపతి జాంగ్ ఇన్ తెలిపారు.

◆ బీరు కొడితే దోమకాటు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: బీరు తాగేవాళ్లను, సరిగా స్నానం చేయని వాళ్లను దోమలు ఎక్కువగా కుడుతున్నాయని నెదర్లాండ్స్ పరిశోధకుల తాజా అధ్యయనంలో తేలింది. మద్యం సేవించని వాళ్లతో పోల్చితే బీరు తాగేవాళ్లను దోమలు 35 శాతం అధికంగా కుడుతున్నాయన్న కొత్త సంగతిని పరిశోధకులు కనుగొన్నారు. అంతేగాక, సరిగా స్నానం చేయని వ్యక్తులను, సన్‌స్క్రీన్ లోషన్ వాడని వాళ్లను, ఇతరులు నిద్రపోయిన చోట పడుకున్న వాళ్లను దోమలు ఎక్కువగా టార్గెట్ చేస్తున్నట్టు పరిశోధనలో తేలింది. ఒక మ్యూజికల్ ఫెస్టివల్‌లో పాల్గొన్న 500 మందిని పరిశోధకులు తమ వినూత్న ప్రయోగానికి ఎంచుకున్నారు. పెద్ద సంఖ్యలో దోమలతో ఉన్న బాక్స్‌లో అభ్యర్థులు చేతులు పెట్టగా, ఎవరి చేతులపై దోమలు వాలుతున్నాయన్నది కెమెరాలతో పరిశీలించారు. ఎలాంటి అలవాట్లు ఉంటే దోమకాటుకు ఎక్కువగా గురవుతామన్నది తెలుసుకునేందుకు పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టినట్టు తెలిసింది.

◆ ఏఐ చాట్‌బాట్ ప్రేమలో అమెరికన్ మహిళలు



వాషింగ్టన్, సెప్టెంబర్ 28: అమెరికాలో కొంతమంది మహిళలు కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్‌తో ప్రేమలో పడుతున్నారట. తాత్కాలిక కాలంపాటు రొమాంటిక్ రిలేషన్‌షిప్ కొనసాగిస్తున్నారట. అమెరికా మహిళల్లో 19 శాతం మంది (ప్రతి ఐదుగురిలో ఒకరు) తమ రొమాంటిక్ రిలేషన్‌షిప్ కోసం ఏఐ చాట్‌బాట్స్‌ను వాడుతున్నట్టు 'మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఎంఐటీ) తాజా అధ్యయనం పేర్కొన్నది. పలు సర్వేలు, ఆయా రాష్ర్టాల్లోని మహిళల ఆన్‌లైన్ డాటా వినియోగం ఆధారంగా పరిశోధకులు పై అంచనాకు వచ్చారు. ఈ విధమైన ధోరణి వల్ల సదరు వ్యక్తుల్లో మానసిక సమస్యలు తలెత్తుతాయని అధ్యయనం హెచ్చరించింది. తీవ్రమైన ఒంటరితనం, మతిభ్రంశంబారిన పడతారని తెలిపింది. తమకు ఆత్మహత్య ఆలోచనలు కలిగాయని 1.7 శాతం మంది యూజర్లు సర్వేలో చెప్పారు. మరి కొంత మంది జ్ఞాపకశక్తి లోపించిందన్న విషయాన్ని చెప్పారు. ఈ అధ్యయనానికి ముందు, ఏఐ చాట్‌బాట్‌తో లవ్‌లో పడ్డ కొంతమంది వివాహిత మహిళల్లోనూ పై సమస్యలు కనపడ్డాయని తెలిసింది.

◆ దూరమవుతున్న చందమామ!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: భూమి చుట్టూ ఓ నిర్దిష్ట కక్ష్యలో తిరుగుతున్న చంద్రుడు.. క్రమంగా భూమి నుంచి దూరం జరుగుతున్నాడట! చంద్రుడు ప్రతి ఏటా 3.8 సెంటీమీటర్లు భూమి నుంచి దూరంగా పోతున్నాడని పరిశోధకులు లెక్కగట్టారు. చంద్రుడిపై భూ గురుత్వాకర్షణ శక్తిలో సంభవిస్తున్న మార్పులే ఇందుకు కారణమని తేల్చారు. దీంతో చంద్రుడి కక్ష్యామార్గం 20,000 కిలోమీటర్ల వరకు తగ్గుతున్నదని, అందువల్లే భూమిపై కొన్ని ప్రాంతాల్లో సూపర్‌మూన్లు వంటివి కనిపిస్తున్నాయని సైంటిస్టులు చెబుతున్నారు. చంద్రుడి ఆకర్షణ శక్తి.. భూమిపై ఒకవైపు 4 శాతం ఎక్కువ ఉంటున్నదని, మరోవైపు తగ్గుతున్నదని, ఇది భూమిపై కొన్ని చోట్ల సముద్రాలపై అలల శక్తిని పెంచుతున్నదని తెలిపారు. అందువల్లే న్యూయార్క్, లాస్ ఏంజెలెస్ మొదలైన చోట్ల సముద్రాలు హఠాత్తుగా వెనక్కి వెళ్లటం, మరోచోట సముద్రమట్టాలు పెరగటం వంటివి సంభవిస్తున్నాయని పరిశోధకులు గుర్తించారు.

◆ ఆస్టరాయిడ్‌పై అణు బాంబుతో దాడి!

వాషింగ్టన్, సెప్టెంబర్ 28: చంద్రుడిపైకి వేగంగా దూసుకొస్తున్న ఓ ఆస్టరాయిడ్‌ను అణు బాంబు దాడితో తుత్తునియలు చేయాలని 'నాసా' భావిస్తున్నది. రోదసిలో 'వైఆర్4' అనే ఆస్టరాయిడ్ చంద్రుడిని 2032లో ఢీకొట్టబోతున్నదని సైంటిస్టులు అంచనావేస్తున్నారు. దీనిని అడ్డుకునేందుకు ఒక మెగాటన్ న్యూక్లియర్ బాంబ్‌ను ఆస్టరాయిడ్‌పై ప్రయోగించాలని నాసా సైంటిస్టులు చెబుతున్నారు. 60మీటర్ల వెడల్పున్న ఈ ఆస్టరాయిడ్ ఒకవేళ చంద్రుడిని ఢీకొడితే.. దీని శకలాలు రోదసిలోకి దూసుకొస్తాయి. ఇవి చంద్రుడు, భూమి చుట్టూ తిరుగుతున్న అనేక శాటిలైట్స్, అంతరిక్ష కేంద్రాలను తాకే ముప్పు పొంచివుంది. చిన్న చిన్న పరిమాణంలోనివి కొన్ని భూమిని కూడా తాకొచ్చు. న్యూక్లియర్ బాంబు కాకుండా మరో ఆప్షన్.. 'కైనెటిక్ ఇంపాక్టర్'తో ఆస్టరాయిడ్ దిశను మార్చొచ్చు. అయితే ఇందులో చాలా రిస్క్ ఉందని, మన అంచనా తప్పి.. ఆస్టరాయిడ్ భూమి మీదకు దూసుకొచ్చే ప్రమాదం కూడా ఉంటుందని నిపుణులు హెచ్చరించారు. ఆస్టరాయిడ్ కచ్చితంగా చంద్రుడిని ఢీకొనే అవకాశముంటే.. అణు బాంబు దాడి ఒక్కటే మార్గమని సూచిస్తున్నారు.

◆ 6 మీటర్ల పొడవైన గోర్లు!



హనోయ్, సెప్టెంబర్ 28: చేతి గోర్లు పెంచటంలో వియత్నాంకు చెందిన ఓ కళాకారుడు సరికొత్త రికార్డ్ సృష్టించాడు. గత 34 ఏండ్లుగా తన గోర్లు కత్తిరించుకోకుండా.. వాటిని పెంచుతూ వస్తున్న లూ కాంగ్ హుయేన్ గిన్నిస్ ప్రపంచ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం అతడి చేతి గోర్ల మొత్తం పొడవు 6 మీటర్లకు చేరుకుంది. ఇది ఒక సగటు జిరాఫీ ఎత్తుకన్నా ఎక్కువ. రాయల్‌గా, వినూత్నంగా కనిపించేందుకు తాను గోర్లు పెంచటం మొదలుపెట్టానని లూ కాంగ్ తెలిపాడు. గోరు కత్తిరించటమనే ఆలోచనే తనకు రాదని, అలాగే తనకు పెయింటింగ్ హాబీ కూడా ఉందని లూ కాంగ్ చెప్పుకొచ్చాడు.

◆ గ్యాస్ సిలిండర్‌కూ పోర్టబిలిటీ!

న్యూఢిల్లీ: గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు ఇది శుభవార్తే. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఎల్‌పీజీ డీలర్‌ను కూడా మార్చుకునే వెసులుబాటు త్వరలోనే రానుంది. ఇందుకు సంబంధించి పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) కీలకమైన ముసాయిదాను ప్రతిపాదించింది. సిలిండర్ సరఫరాలో ఆలస్యం, ఇతర సేవలపై ఫిర్యాదులు దేశవ్యాప్తంగా పెరుగుతుండటంతో ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు కొత్తగా ఇంటర్ ఆపరేటబిలిటీ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం వినియోగదారులు ఒకే చమురు కంపెనీ పరిధిలోని వేర్వేరు డీలర్లకు మాత్రమే మారవచ్చు. ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు తమ పరిధిలోని మరో ఇండేన్ డీలర్‌కు మాత్రమే మారే వెసులుబాటు ఉం ది. అంతేకానీ, భారత్ గ్యాస్‌కు మారలేరు. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ పరిమితి తొలగిపోతుంది. సేవల పరంగా వినియోగదారుడికి స్వేచ్ఛ లభిస్తుంది. త్వరలోనే దీని అమలు తేదీని ప్రకటిస్తామని ప్రభుత్వం తెలిపింది.

అస్సాంలో బీజేపీకి షాక్

బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఘోర పరాభవం

- 40 స్థానాల్లో ఐదింటిలోనే గెలుపు
- 28 సీట్లలో గెలుపొందిన బీపీఎఫ్
- వచ్చే ఏడాది జరిగే శాసనసభ ఎన్నికలకు ఈ ఎన్నికలు సెమీఫైనల్

న్యూఢిల్లీ: అస్సాంలో అధికార బీజేపీకి గట్టి షాక్ తగిలింది. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ (బీటీసీ) ఎన్నికల్లో కమలం పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. 40 స్థానాలకు గానూ ఆ పార్టీ కేవలం ఐదు స్థానాల్లోనే గెలుపొందింది. ది బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) 28 స్థానాల్లో గెలుపొంది అధికారం చేజిక్కించుకుంది. ఇప్పటివరకు బీజేపీ, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) కలిసి కౌన్సిల్ పాలనా పగ్గాలు చేపట్టాయి. తాజా ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన బీజేపీ.. అతిపెద్ద పార్టీగా లేదా కింగ్‌మేకర్‌గా నిలవాలని భావించింది. అయితే ఆ పార్టీ ఆశలపై ప్రజలు చావుదెబ్బ కొట్టారు. 2020లో జరిగిన బీటీసీ ఎన్నికల్లో బీపీఎఫ్‌కు 17 స్థానాలు రాగా, యూపీపీఎల్ 12, బీజేపీ 9 స్థానాల్లో గెలుపొందాయి. ఎన్నికల తర్వాత పొత్తు పెట్టుకున్న యూపీపీఎల్, బీజేపీ అధికారం చేపట్టాయి. తర్వాత యూపీపీఎల్‌తో తెగదెంపులు చేసుకున్న బీజేపీ ఈసారి ఒంటరిగా పోటీచేసింది. సీఎం హిమంత బిశ్వశర్మ విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ పార్టీకి ఘోర పరాజయం ఎదురుకావడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడుపడటం లేదు.

బీటీసీ అనేది రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ఏర్పాటైన ఒక అటానమస్ కౌన్సిల్. ఇది 2003లో ఏర్పాటైంది. కోక్రాఝర్, చిరంగ్, బక్సా, ఉదల్‌గురీ, తాముల్‌పుర్ జిల్లాలు ఈ కౌన్సిల్ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 16 నియోజకవర్గాలు బోడోలాండ్ టెరిటోరియల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ బోడో ప్రజల ప్రాబల్యం అధికం.

కాంగ్రెస్‌కు జీరో

ఒకప్పుడు అస్సాంలో ఆధిపత్యం చెలాయించిన కాంగ్రెస్‌కు కూడా ఈ ఎన్నికలు గట్టి ఎదురుదెబ్బే. 40 స్థానాల్లోనూ పోటీచేసిన హస్తం పార్టీ కనీసం ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేకపోయింది. అస్సాం పార్టీ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ నియమితులైన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు ఇవి. వాస్తవానికి అస్సాంలో అధికారంలో ఉన్న సమయంలోనూ కాంగ్రెస్‌కు ఈ కౌన్సిల్‌లో పట్టులేదు. ఉదాహరణకు 2015, 2010లో జరిగిన బీటీసీ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. 2020లో మాత్రం ఒక్క సీటు గెలుపొందింది.



బీపీఎఫ్ అధినేత హగ్రామ మొహిలరి

యూఎస్ గోల్డ్ కార్డ్‌పై భారతీయుల ఆసక్తి

30-40% మేర పెరిగిన విచారణలు • వీరిలో అత్యధికులు సంపన్నులే • హెచ్-1బీ ఆంక్షల నేపథ్యంలోనే

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా ప్రకటించిన గోల్డ్ కార్డ్ పట్ల భారతీయులు ఆసక్తి చూపుతున్నారు. ప్రజాదరణ పొందిన నాన్ ఇమిగ్రెంట్ హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును 1 లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోసం భారతీయ ప్రతిభావంతులు చూస్తున్నారు. అమెరికా రెసిడెన్సీ పొందడానికి సత్వర మార్గమనే హామీని గోల్డ్ కార్డ్ ఇస్తుండటంతో భారతీయుల నుంచి విచారణలు 30-40 శాతం మేరకు పెరిగాయి. వీరిలో సంపన్నులు ఎక్కువగా ఉన్నారు. గోల్డ్ కార్డ్ జారీ కోసం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ ఈ నెల 19న సంతకం చేశారు. 1 మిలియన్ డాలర్లు చెల్లించి ఈ కార్డును కొనుక్కోవచ్చు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ నేపథ్యం గల మిడ్ కెరీర్ టెక్ ప్రొఫెషనల్స్ గోల్డ్ కార్డ్ పట్ల ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వ్యక్తిగతంగా 1 మిలియన్ డాలర్లు లేదా కార్పొరేట్ స్పాన్సర్‌షిప్ ద్వారా 2 మిలియన్ డాలర్లు అమెరికా ఖజానాకు 'బహుమతి' గా ఇచ్చేవారికి గోల్డ్ కార్డు వస్తుంది. ఈ సొమ్మును తిరిగి చెల్లించరు. ఇది ఈబీ5 మాదిరిగా పెట్టుబడి ఆధారిత వీసా కాదు. ఈ సొమ్మును అమెరికన్ వాణిజ్య, పరిశ్రమలకు ఇచ్చే కంట్రిబ్యూషన్‌గా పరిగణిస్తారు. ఇప్పటికే 2.5 లక్షల మంది ఆసక్తి చూపుతున్నారని అమెరికా కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ చెప్పారని సింఘానియా అండ్ కో మేనేజింగ్ పార్టనర్ రోహిత్ జైన్ తెలిపారు. ఇదిలావుండగా, ఎపోనిమస్ లా ఫర్మ్‌ను నడుపుతున్న ప్రాచీ షా మాట్లాడుతూ, గోల్డ్ కార్డ్ పట్ల దక్షిణాసియా



క్లయింట్లలో ఆసక్తి తక్కువగా ఉందన్నారు. దీనికి కారణం నాన్ రిఫండబుల్ 1 మిలియన్ డాలర్లు చెల్లించాలనే నిబంధనేనని చెప్పారు. ఇమిగ్రేషన్ లాయర్లు స్పందిస్తూ, కొందరు భారతీయులు ఇతర దేశాలవైపు చూస్తున్నారన్నారు. ట్రంప్ మరోవైపు ప్లాటినం కార్డును తేవడానికి చూస్తున్నారు. ఈ కార్డు, రెసిడెన్సీ పర్మిట్ కోసం 5 మిలియన్ డాలర్లు కంట్రిబ్యూట్ చేయవలసి ఉంటుందని చెప్తున్నారు.

భారత్‌ను సరి చేయాల్సి ఉంది: అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

వాషింగ్టన్: అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్న వేళ భారత్‌ను సరి చేయాల్సి ఉందని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి హెచ్చరించారు. తమ దేశ వినియోగదారులకు భారత్ ఏమైనా అమ్మాలనుకుంటే తమ అధ్యక్షుడితో చర్చలు జరపాలన్నారు. భారత్, బ్రెజిల్‌ను విమర్శిస్తూ అవి తమ మార్కెట్లను తెరవడానికి చాలా చేయాల్సి ఉందని.. అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే చర్యలను అవి మానుకోవాలని..అన్నారు. పలు వాణిజ్య సంప్రదింపులు పరిష్కారం కావాల్సి ఉందని, వాటిలో భారత్, బ్రెజిల్ ఒప్పందాలు పెద్దవన్నారు.

హెచ్ 1బీతో దోపిడీ

- వెట్టి చాకిరీ చేయించుకోవడానికే భారతీయులకు ఉద్యోగాలు
- ఏంజెల్ ఇన్వెస్టర్ జేసన్ కలకనిస్

న్యూఢిల్లీ: 'అమెరికన్ వ్యవస్థ అనేక దశాబ్దాలుగా విదేశీ వర్కర్లను దోచుకుంటున్నది. ఐటీ కంపెనీలు భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తాయి. వారి చేత మితిమీరిన పని చేయించుకుంటాయి. చెప్పిన పని చేయకపోతే, తమను అమెరికా నుంచి పంపించేస్తారనే భయంతో భారతీయులు పని చేస్తారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ చీకటి కోణం ఇది' అని ఏంజెల్ ఇన్వెస్టర్ జేసన్ కలకనిస్ ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ''1990వ దశకం ప్రారంభంలో నేను ప్రత్యక్షంగా చూశాను. ఐటీ కంపెనీలు భారతీయులను నియమించుకుంటాయి. వీళ్లు సగం జీతానికే పని చేస్తారని కంపెనీల మేనేజ్‌మెంట్లు చెప్పుకుంటాయి. పని చేయబోమని ఇండియన్లు చెప్పలేరని, అది చాలా మంచి విషయమని చెబుతారు. వీకెండ్ కవరేజ్‌లో వాళ్లని పెట్టినా పని చెయ్యలేమని ఎందుకు చెప్పరంటే, మనం వాళ్లని దేశం నుంచి తగిలేస్తాం, కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి వాళ్లకి 30 రోజులే ఉంటుంది'' అని అమెరికన్ ఐటీ కంపెనీలు చెబుతాయని జేసన్ తెలిపారు.

ముగ్గురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఎదురుకాల్పులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, సెప్టెంబర్ 28: ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఆదివారం జరిగిన భీకరపోరులో ఓ మహిళ సహా ముగ్గురు మావోయిస్టులు నేలకొరిగారు. కాంకేర్ జిల్లా ఎస్పీ ఇంద్ర కల్యాణ్ కథనం ప్రకారం.. కాంకేర్ - గరియాబంద్ జిల్లాల సరిహద్దుల్లోని చింద్‌ఖడక్ గ్రామ సమీప అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం మేరకు జిల్లా రిజర్వు గార్డ్ (డీఆర్‌జీ), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, రాష్ట్ర పోలీసు బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు.. ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక 303 రైఫిల్, ఒక 12 బోర్ గన్, ఇతర వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నారు. మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు సైతం ఉంది. మృతులను గుర్తించినట్లు ఎస్పీ ఇంద్ర కల్యాణ్ తెలిపారు. వారిలో సీతనాడి, రవాస్ ఏరియా కమిటీ కార్యదర్శి సర్వణ్ మడకం అలియాస్ విశ్వనాథ్, నగారి ఏరియా కమిటీ సభ్యుడు రాజేశ్ అలియాస్ రాఖేశ్ హేమ్లా, మేయిన్‌పూర్-నూవాపాడా ప్రొటెక్షన్ టీమ్ సభ్యురాలు బసంతి కుంజమ్ అలియాస్ హిద్మేగా గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.

ఆయుధాలు వదిలేస్తే పోలీసులు కాల్పులు జరపరు

మావోయిస్టులకు అమిత్ షా సందేశం

న్యూఢిల్లీ: శాంతిని కోరుకునేవారు తక్షణమే లొంగిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం చెప్పారు. మావోయిస్టులు కాల్పుల విరమణను కోరుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. ''ఇప్పటి వరకు జరిగినది తప్పు అంటూ ఓ లేఖ చక్కర్లు కొడుతున్నది. లొంగిపోవడానికి అంగీకరిస్తూ, కాల్పుల విరమణ జరగాలని కోరుతున్నట్లు దానిలో ఉంది. కాల్పుల విరమణ ఉండదు. లొంగిపోవాలని అనుకుంటే, కాల్పుల విరమణ అవసరం ఉండదు. మీ ఆయుధాలను వదిలిపెట్టండి, పోలీసులు ఒక తూటానైనా పేల్చరు'' అని అన్నారు.

337 కోట్ల అవినీతి.. చైనా మాజీ మంత్రికి మరణ శిక్ష

బీజింగ్: చైనా మాజీ వ్యవసాయ, గ్రామీణ వ్యవహారాల శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు కోర్టు ఆదివారం మరణ శిక్ష విధించింది. ఆయన సుమారు రూ.337 కోట్లు అవినీతికి పాల్పడినట్టు రుజువు కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఆయన కోర్టుకు సహకరించడంతోపాటు పశ్చాత్తాపం వ్యక్తం చేయడంతో ఈ శిక్ష అమలును రెండేళ్లపాటు నిలిపేసింది. చైనాలోని జిలిన్ ప్రావిన్స్, చాంగ్‌చున్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు ఆదివారం ఈ తీర్పు చెప్పింది.

వాట్సాప్‌కు పోటీగా అరట్టై

స్వదేశీ యాప్‌ని తీసుకొచ్చిన జోహో

చెన్నై: వాట్సాప్ గుత్తాధిపత్యాన్ని సవాల్ చేస్తూ దేశీయంగా అభివృద్ధి చేసిన ఒక నూతన మెసేజింగ్ యాప్ వచ్చేసింది. దీని పేరు 'అరట్టై'. తమిళంలో అరట్టై అంటే కబుర్లు అని అర్థం. చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఐటీ సంస్థ జోహో దీనిని అభివృద్ధి చేసింది. ఇందులో టెక్స్ట్ మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్, మీడియా షేరింగ్, స్టోరీలు, చానల్స్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ముఖ్యంగా, వాయిస్, వీడియో కాల్స్ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ భద్రతను అందిస్తున్నది. వాట్సాప్ వంటి గ్లోబల్ యాప్‌ల మాదిరిగా కాకుండా అరట్టై వినియోగదారుల వ్యక్తిగత డాటాను వాణిజ్య ప్రకటనలకు వినియోగించబోమని జోహో హామీ ఇస్తున్నది. డిజిటల్ భద్రత, గోప్యత పట్ల ఆందోళనలో ఉన్న వినియోగదారులను ఇది బలంగా ఆకర్షిస్తున్నది. ఈ యాప్ మొబైల్స్‌తో పాటు డెస్క్‌టాప్, ఆండ్రాయిడ్ టీవీల్లోనూ ఉపయోగించుకోవచ్చు. గతంలో హైక్, టెలిగ్రామ్ వంటి యాప్‌లు వాట్సాప్‌ను సవాల్ చేయాలని చూసినా ఫలితం లేకుండా పోయింది. అయితే, అరట్టైకి ప్రభుత్వ మద్దతు ఉండటం, మేడిన్ ఇండియా గుర్తింపుతోపాటు డాటా గోప్యత కారణంగా ఇది వాట్సాప్‌కు పోటీ ఇచ్చే అవకాశం ఉందని టెక్ నిపుణులు భావిస్తున్నారు.

మద్యం అమ్మకాల్లో కర్ణాటక టాప్

న్యూఢిల్లీ: ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) అమ్మకాల్లో దక్షిణాది రాష్ర్టాలు టాప్ పొజిషన్‌లో నిలిచాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలలో 23.18 కోట్ల కేసుల ఐఎంఎఫ్ఎల్ అమ్ముడుపోయింది. అంటే దేశంలో జరిగిన అమ్మకాల్లో 58 శాతం ఇక్కడే జరిగాయి. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజ్ కంపెనీస్ ఈ సమాచారాన్ని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లో దక్షిణాది ఆధిపత్యం దాదాపు పరిపూర్ణంగా ఉంది. 58 శాతం



అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. మిగిలిన 42 శాతం దేశంలోని ఇతర రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్నది. అయితే, కర్ణాటకలో 6.88 కోట్ల కేసులు అమ్ముడుపోవడంతో ఆ రాష్ట్రం ఈ చార్టులో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఆ తర్వాతి స్థానంలో ఉన్న తమిళనాడులో 6.47 కోట్ల కేసులు అమ్ముడుపోయాయి.



'రాక్ షో'తో పాక్ బుట్టలో ట్రంప్!

- వైట్ హౌస్‌లో ట్రంప్‌తో పాక్ పీఎం, ఆర్మీ చీఫ్ భేటీ
- పెట్టెలోని రేర్ ఎర్త్ మినరల్స్ చూపించిన షరీఫ్, మునీర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను బుట్టలో వేసుకోవడానికి పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసీం మునీర్ తీవ్రంగా ప్రయత్నించారు. ఇటీవల వీరు ముగ్గురూ వైట్ హౌస్‌లో సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన ఓ ఫొటోను వైట్ హౌస్ విడుదల చేసింది. అసీం మునీర్ ఓ పెట్టెలోని రాళ్లను ట్రంప్‌నకు చూపిస్తున్నట్లు, షరీఫ్ చిరునవ్వులు చిందిస్తున్నట్లు, ట్రంప్ ఆసక్తిగా గమనిస్తున్నట్లు ఈ ఫొటోలో కనిపించింది. వీరు ముగ్గురూ ఓవల్ ఆఫీస్‌లో రహస్యంగా సమావేశమైన తర్వాత ఈ ఫొటో విడుదలైంది. షరీఫ్, మునీర్ మిరుమిట్లు గొలిపే రాళ్లను చూపించి ట్రంప్‌ను ముగ్ధుడిని చేయగలిగినట్లు కనిపిస్తున్నది. కొన్ని వారాల క్రితం అమెరికన్ మెటల్స్ కంపెనీ పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 500 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది.

తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు చేయాలి

- విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హైకోర్టులో పిటిషన్
- మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షల చొప్పన సాయం
- పోలీసుల నిబంధనలను టీవీకే ఉల్లంఘించింది: ఏడీజీపీ



చెన్నై:ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఆదివారం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. కరూర్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో తొక్కిసలాట దుర్ఘటనపై దర్యాప్తు చేయాలని సీబీఐ లేదా సిట్‌ను ఆదేశించాలని కోరింది. జస్టిస్ దండపాణి సమక్షంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ దుర్ఘటనలో 40 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. సోమవారం తమ పిటిషన్‌పై విచారణ జరుగుతుందని టీవీకే నేతలు చెప్పారు.

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు

తొక్కిసలాటలో మరణించినవారి కుటుంబాలకు రూ.20 లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు విజయ్ ఆదివారం ప్రకటించారు. ''మీరు అనుభవిస్తున్న నష్టానికి ఇది పెద్ద మొత్తం కాదు. మీకు జరిగిన నష్టాన్ని మరొకదానితో పూడ్చలేమని నాకు తెలుసు. ఈ సమయంలో మీ పక్కన ఉంటూ, మీ విచారాన్ని పంచుకోవడం నా కర్తవ్యం'' అని ఎక్స్ పోస్ట్‌లో విజయ్ తెలిపారు. గాయపడినవారు సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిబంధనలను టీవీకే ఉల్లంఘించింది: ఏడీజీపీ

కరూర్ బహిరంగ సభ నిర్వహణ కోసం విధించిన కొన్ని నిబంధనలను ఆ పార్టీ ఉల్లంఘించిందని ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం చెప్పారు. తొక్కిసలాట ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాళ్లు విసరడం వల్ల తొక్కిసలాట జరిగినట్లు టీవీకే చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. సభాస్థలిని వేరొక చోటుకు మార్చుకోవాలని తాము చెప్పామని, అందుకు టీవీకే పార్టీ నేతలు అంగీకరించలేదని తెలిపారు. విజయ్ 5 గంటలకుపైగా ఆలస్యంగా సభకు వచ్చారని తెలిపారు.

మృతుల కుటుంబాలకు స్టాలిన్ పరామర్శ

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం కరూర్‌లో పర్యటించారు. టీవీకే బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులను, గాయపడినవారిని పరామర్శించారు. తమిళనాడు చరిత్రలో ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఇంత ఎక్కువ మంది ఎన్నడూ మరణించలేదన్నారు. ఇటువంటి విషాదం ఎన్నడూ జరగకూడదన్నారు. ప్రస్తుతం ఐసీయూలో 51 మంది చికిత్స పొందుతున్నారు.

విడాకుల కోసం లోన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: వివాహబంధాన్ని తెగదెంపులు చేసుకునేందుకు కొంతమంది పురుషులు అప్పులు కూడా చేస్తున్నారట. విడాకుల సెటిల్‌మెంట్స్ కోసం 42శాతం మంది పురుషులు లోన్లు తీసుకున్నట్టు 'వన్ ఫైనాన్స్ అడ్వైజరీ కంపెనీ' సర్వే నివేదిక తెలిపింది. టైర్-1, టైర్-2 నగరాల్లోని విడాకులు పొందిన 1,258 మంది నుంచి సమాచారాన్ని సేకరించగా, విడాకులు పొందేందుకు తాము రూ.5 లక్షల వరకు ఖర్చు చేశామని 49 శాతం పురుషులు, 19 శాతం మంది మహిళలు చెప్పారు. విడాకుల సెటిల్‌మెంట్ తర్వాత అప్పుల్లో కూరుకుపోయామని 29 శాతం మంది పురుషులు తెలిపారు.

గుడ్డిగా కెరీర్ ఎంపిక

- 90 శాతం భారత విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం కరువు
- కెరీర్ కౌన్సెలింగ్‌తోనే పరిష్కారం
- ఐరాస తాజా అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో కెరీర్ కౌన్సెలింగ్ లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని ఐక్యరాజ్య సమితి తాజా అధ్యయనం తేల్చింది. దాని ప్రకారం కేవలం 10 శాతం విద్యార్థులకు మాత్రమే కెరీర్‌కు సంబంధించిన సలహాలు లభిస్తున్నాయి లేదా దాని గురించి వారికి అవగాహన ఉంది. మిగతా 90 శాతం మంది కుటుంబ సభ్యుల సలహాలు, సామాజిక ఒత్తిడులు, 'సురక్షితమైన' ఉద్యోగాల ఆకర్షణలో పడిపోయి సరైన కెరీర్ ఎంపిక చేసుకోవడం లేదు. ఏడు రాష్ర్టాల్లో 9-12 తరగతులు చదువుతున్న 21,239 మంది విద్యార్థులను సర్వే



చేసి ఐరాస ఈ అధ్యయనాన్ని వెలువరించింది.

10 శాతం విద్యార్థులకు మాత్రమే

గాలప్ 2024 గ్లోబల్ వర్క్ ప్లేస్ రిపోర్ట్ ప్రకారం కేవలం 14 శాతం భారతీయ ఉద్యోగులు మాత్రమే తాము కెరీర్‌లో అభివృద్ధి చెందుతున్నట్టు భావిస్తున్నారు. వ్యక్తిగత ఆసక్తులు, నైపుణ్యాలతో సంబంధం లేకుండా కెరీర్‌ను ఎంపిక చేసుకోవడం వల్ల ఈ అంతరం ఏర్పడిందని.. దీని వల్ల ఉద్యోగ అసంతృప్తి విస్తృతంగా వ్యాపించిందని నిపుణులు తెలిపారు. 10 శాతం మంది విద్యార్థులకు మాత్రమే తమ కోర్సుల ఫీజు, ఎంపికలు, విద్యా సంస్థలు, అవకాశాల గురించి తెలుసు. ప్రభుత్వ స్కూళ్లలో కెరీర్ కౌన్సెలింగ్ లభించడం లేదు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో అదొక ఖరీదైన వ్యవహారంగా ఉంది. భారత్‌లో చాలాచోట్ల వేలాది మంది విద్యార్థులకు ఒక కెరీర్ కౌన్సిలర్ కూడా ఉండటం లేదు. తల్లిదండ్రులు ఇంకా ఇంజినీరింగ్, వైద్య విద్య, సివిల్ సర్వీసెస్‌లను ఎంపిక చేసుకోవాలని పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. కెరీర్ కౌన్సెలింగ్ అంతరాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే కెరీర్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా, స్థానిక భాషల్లోని మొబైల్ అప్లికేషన్ల ద్వారా, ఆన్‌లైన్ మెంటార్‌షిప్ నెట్‌వర్క్‌ల ద్వారా కొంత మేరకు భర్తీ చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

విదేశీ వృత్తి నిపుణులకు కెనడా ఆహ్వానం

ప్రధాని మార్క్ కార్నే

టొరొంటో, సెప్టెంబర్ 28: హెచ్-1బీ వీసా ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని కెనడా తనకు అనుకూలంగా మలుచుకునే ఆలోచన చేస్తున్నది. విదేశీ వృత్తి నిపుణులను తమ దేశంలోకి ఆహ్వానం పలికేందుకు కెనడా ప్రభుత్వం సుముఖంగా ఉందని ఆ దేశ ప్రధాని మార్క్ కార్నే తాజాగా ప్రకటించారు. లండన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 'హెచ్-1బీ వీసాలు పొందినవారిని ఆకర్షించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. నేను దీనిని మరింత సులభతరం చేయబోతున్నా' అని అన్నారు. విదేశీ వృత్తి నిపుణులకు కెనడాలో ప్రవేశం కల్పించే ప్రతిపాదనలపై తమ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు కార్నే చెప్పారు.

సరస్వతీదేవి



ఆశ్వయుజ, కార్తిక మాసాలుగా విస్తరించిన శరత్ రుతువు ఆహ్లాదకరమైన పండువెన్నెల కురిసే కాలం. ఈ శరత్ కాలం ప్రారంభంలో వచ్చే పర్వదినాలే శరన్నవరాత్రులు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ సంప్రదాయాల్లో, వివిధ రూపాలలో, వివిధ క్రమాల్లో కొలుస్తారు. నవరాత్రుల్లో మూలా నక్షత్రం పరివ్యాప్తమై ఉన్న రోజు అమ్మవారిని శ్రీ సరస్వతిగా అలంకరించి ఆరాధిస్తారు. సరస్వతీదేవి శ్వేత వస్త్రధారిణి, వీణాపాణి, హంసవాహిని. శారదగా చంద్రరేఖను ధరించినది. సత్వగుణమూర్తి అయిన ఆమె శుద్ధమైన చేతస్సుకు (మనసుకు), బుద్ధికి, శాంతానికి, ప్రేమకు ప్రతీక. వాక్కుకు, సంగీతానికి భారతి అధిదేవత. ఆమెను ఆరాధించడం వల్ల మన మనసు, వాక్కు, కర్మ పవిత్రమై, రసమయమై లోకహితంగా పరిణతి చెందుతాయి.

సరస్వతీ స్వరూపంలో ఉన్న శక్తి విలాసానికి నమస్కరిస్తూ యాజ్ఞవల్క్య మహర్షి.. 'స్మృతిశక్తి జ్ఞానశక్తి బుద్ధిశక్తి స్వరూపిణీ, ప్రతిభాకల్పనా శక్తిర్యాచ తస్యై నమోనమః' అని స్తుతించాడు. స్మృతి, జ్ఞానం, బుద్ధి, ప్రతిభ, కల్పనాశక్తుల కోసం ప్రార్థిస్తూ, ఆమెనే వ్యాఖ్యానంగా, వ్యాఖ్యాన అధిష్ఠానంగా, భౌతిక ప్రపంచంలోని ద్వంద్వాల వలయాలుగా భావిస్తూ అమ్మవారిని.. 'వ్యాఖ్యానరూపా యాదేవీ వ్యాఖ్యాధిష్ఠాతృదేవతా, భ్రమసిద్ధాంతరూపాయా తస్యై దేవ్యై నమోనమః' అని ప్రార్థించాడు.

మరి ఆ సరస్వతీదేవిని ఆరాధించేదెలా? ప్రార్థనతో అమ్మను పూజించాలి. తెల్లటి పూలు, వస్తువులతో అర్చన చేయాలి. సత్యాన్ని పలుకుతూ, నిత్యం సత్ గ్రంథాలను పఠిస్తూ, లోకంలోని అందరి హితాన్ని కోరుకోవడమే అమ్మవారికి చేసే నిజమైన ఆరాధన. అమ్మవారిని సేవించడం ద్వారా మనలో వివేకం పెరుగుతుంది. ఆమె అనుగ్రహం పాపరాశిని దగ్ధం చేస్తుంది. పాపాలను నిర్మూలిస్తూ బ్రహ్మానుభూతిని కలిగిస్తుంది. కాశ్మీర శారదాదేవి ప్రార్థనలో అమ్మను సంసారతాపాన్ని హరించే అమృతనదిగా వర్ణిస్తూ.. 'భవానీం భవసంతాపనిర్వాపణ సుధానదీమ్..' అని స్తుతిస్తారు. ఇదే భావనతో ఈ శరన్నవరాత్రులలో పరాశక్తి అయిన సరస్వతీమాత అవతారాన్ని ప్రత్యేక నిష్ఠతో కొలిచి వివేకవంతులుగా, విశుద్ధ ధర్మశీలురుగా, కళారసాత్ములుగా వికసిద్దాం!

• యముగంటి ప్రభాకర్

ఇవాళ్టి బతుకమ్మ



సద్దుల బతుకమ్మ

బతుకమ్మ ఉత్సవానికి ఘనమైన ముగింపు పలుకుతుంది సద్దుల పండుగ. దుర్మార్గుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ని సంహరించి, సకల లోకాలను కాపాడిన ఆదిశక్తి.. దుర్గామాతగా కొలువుదీరిన మహోన్నతమైన రోజు ఇది. అందుకే ఈ రోజును దుర్గాష్టమిగా జరుపుకొంటారు. అలసిన అమ్మవారికి ఘనమైన పాకాలు నివేదన చేస్తారు భక్తులు. 'పాయసాన్నప్రియా, దధ్యాన్నాసక్త హృదయా, ముద్గౌదనాసక్త చిత్తా, హరిద్రాన్నైక రసికా, గుడాన్న ప్రీతి మానసా' అంటూ అమ్మకు రకరకాలైన నైవేద్యాలు సమర్పిస్తారు. గ్రామీణులు సద్దుల పేరుతో పులగం, పులిహోర, చిత్రాన్నం, నువ్వుల సద్ది, కొబ్బరిసద్ది, పెరుగన్నం ఇలా వివిధ రకాలైన సద్దులు చేస్తారు. అందుకే చివరి రోజు వేడుకకు సద్దుల బతుకమ్మ అనే పేరు వచ్చింది. దీనినే పెద్ద బతుకమ్మ అని కూడా అంటారు. మిగతా రోజులకన్నా భిన్నంగా, పెద్ద పెద్ద బతుకమ్మలు పేరుస్తారు. సాయంత్రం కాగానే పిల్లాజెల్లా అందరూ బతుకమ్మ ఆడటానికి అందంగా ముస్తాబై కదలివస్తారు. మగవాళ్లు సైతం ఈ ముచ్చటను చూసేందుకు ఉత్సాహం కనబరుస్తారు. ఊరంతా చెరువు కట్టకు ఊరేగింపుగా తరలివెళ్తారు.

'తంగేడు పూవుల్ల చందమామ.. బతుకమ్మ పోతుంది చందమామ
పోతె పోతివిగాని చందమామ.. మళ్లెప్పుడొస్తావు చందమామ
ఏడాదికోసారి చందమామ.. నువ్వొచ్చి పోవమ్మ చందమామ' అంటూ తమకు బతుకునిచ్చిన పరమేశ్వరికి ఘనంగా వీడ్కోలు పలుకుతారు.

• డా॥ ఆర్.కమల



తెలుసుకుందాం

ఆయుధ పూజ ఎందుకు?

అసుర సంహారానికి పూనుకున్న అమ్మవారికి.. ముక్కోటి దేవతలు ఒక్కటిగా లోకోపకారం కోసం ఆయుధాలన్నీ అందించారు. రక్షణకు, శిక్షణకు ప్రతీకలైన ఆయుధాలవి. విశ్వ చైతన్య విజ్ఞాన రహస్యాలకు ఈ ఆయుధ సమ్మేళనం సూచిక. వీటిని ధరించిన అమ్మవారు మహిషాసురమర్దనం చేసింది. సజ్జనులను రక్షించింది. అస్త్రశస్త్రాలను ధరించిన జగన్మాత విజయం సాధించింది. ఈ విజయ ముహూర్తంలోనే శ్రీరాముడు రావణసంహారం చేశాడు. అర్జునుడు విజయుడైనాడు. అందుకే పూర్వకాలంలో చక్రవర్తులు, రాజులు తమ ఆయుధాల్ని, వాహనాల్ని, రథాల్ని, శకటాల్ని మహర్నవమి నాడు ప్రత్యేకంగా అలంకరించేవారు. వివిధ వృత్తుల వారు తమకు జీవనోపాధిని అందించే పరికరాలను విజయదశమినాడు ఘనంగా పూజించేవారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతున్నది. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వృత్తి నిపుణులు తాము వాడే ఉపకరణాలను విశేషంగా ఆరాధిస్తారు. వృత్తిగతంగా, వ్యక్తిగతంగా, నిత్యజీవితంలో ఉపకరించే ఆయుధాల్ని పూజించి జీవన సమరంలో విజయాల్ని ప్రసాదించమని అమ్మను కోరుకుంటారు. ముందుగా శుభ్రం చేసిన యంత్ర వాహనాలకు పసుపు కుంకుమలు పెట్టిన తరువాత పూలతో వివిధ ద్రవ్యాలతో అలంకరిస్తారు. తర్వాత హారతిచ్చి, ఎర్రనీళ్లు, బూడిద గుమ్మడికాయ, కొబ్బరికాయ, నిమ్మకాయ వంటివాటితో దిష్టి తీస్తారు. ఈ కార్యక్రమాన్ని దుర్గాష్టమి నుంచి దసరా వరకు మూడు రోజుల్లో ఎప్పుడైనా పగటి పూట నిర్వహించుకోవచ్చు.

• శ్రీ

అంబరాన్నంటిన సంబురం

- హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుక
- పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు
- బతుకమ్మ కానుకగా చీరెల పంపిణీ
- హాజరైన సత్యవతిరాథోడ్, పద్మాదేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీత



హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ విప్ గొంగిడి సునీత, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి, మహిళా నాయకులు

హనుమకొండ, సెప్టెంబర్ 28: హనుమకొండ జిల్లా కేంద్రంలోని బాలసముద్రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్కపూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పార్టీ కార్యాలయం పూలవనాన్ని తలపించింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెలంగాణ ఉద్యమం, కేసీఆర్, బీఆర్ఎస్ పాటలతో పాటు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను వివరిస్తూ పాటలు పాడారు. బతుకమ్మ ఆడిన ఆడబిడ్డలకు భోజనాలు పెట్టి బతుకమ్మ కానుకగా చీరెలు పంచిపెట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ పండుగలు తెలియని దుస్థితి కాంగ్రెస్‌దని ఎద్దేవా చేశారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మహిళా నేతలు సుశీలారెడ్డి, సుమిత్రాఆనంద్, రేణుక, పావనీగౌడ్, రజితారెడ్డి, మహిళా నేతలు పెద్ది స్వప్న, ఎల్లావుల లలితాయాదవ్, డాక్టర్ హరి రమాదేవి, మాజీ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి రేవతీ భాస్కర్, దాస్యం విజయ్‌భాస్కర్ సతీమణి శిరీష, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ మేయర్ రిజ్వానామసూద్, కార్పొరేటర్ నల్ల స్వరూపారాణి, ఇమ్మడి లోహితారాజు, నాయకుడు దాస్యం విజయ్‌భాస్కర్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కమురున్నీసాబేగం, నయీమొద్దీన్, బొద్దు వెంకన్న, పోలపల్లి రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే సంతోషంగా ప్రజలు

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణ సంస్కృతిని పరిరక్షించిన కేసీఆర్ అందించిన కానుకలతో పండుగలు నిర్వహించుకునేవారు. తెలంగాణ అస్తిత్వాన్ని మరువని నేత కేసీఆర్. సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. కేసీఆర్ పదేండ్ల పాలనలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు, వారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిన ఘనత కేసీఆర్‌ది.

-మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

ఓట్లెయ్యరనే కాంగ్రెస్ నాటకం

- బీసీ రిజర్వేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి... మరోవైపు అడ్డుకునే కుట్ర
- కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం తప్పదు : శుభప్రద్‌పటేల్



తాండూరు, సెప్టెంబర్ 28: 'రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో సర్కార్‌పై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు ఓట్లెయ్యరనే కాంగ్రెస్ సర్కార్ నాటకం ఆడుతున్నది' అని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టే ఇచ్చి.. మరోవైపు అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతున్నట్టు నటిస్తూ, తన అనుచరులతో అదే రిజర్వేషన్లు అమలుకాకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం 42 బీసీ రిజర్వేషన్ల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడైన రెడ్డి జాగృతి ప్రతినిధి మాధవరెడ్డి పిటిషన్ వేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కతో మాధవరెడ్డి దిగిన ఫొటోలను మీడియా ఎదుట ఆయన ప్రదర్శించారు. బీసీలను మోసం చేయాలనే కుట్ర పన్నుతున్న రేవంత్‌రెడ్డికి, సహకరిస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. భాను, నరేశ్, శ్రీధర్, మనోహర్, సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు రచించిన 'హిస్సా ఇజ్జత్ హుకుమత్' పుస్తకావిష్కరణ



'హిస్సా ఇజ్జత్ హుకుమత్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్. చిత్రంలో మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, నర్సయ్యగౌడ్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, చిరంజీవులు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీసీలు రాజ్యాధికార సాధన పోరాటానికి నడుం బిగించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ పిలుపునిచ్చారు. విశ్రాంత ఐఏఎస్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు రచించిన 'హిస్సా ఇజ్జత్ హుకుమత్' పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బండ ప్రకాశ్ పాల్గొని మాట్లాడుతూ రాజకీయ, ఆర్థికరంగాల్లో బీసీలు అణిచివేతకు గురైన తీరును పుస్తకంలో గణాంకాలతో పొందుపరిచారని తెలిపారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి మాట్లాడుతూ బీసీలు చైతన్యం తెచ్చుకొని అధికారం, హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో కులంతో పాటు డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తున్నదని, బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. సుదీర్ఘం అధ్యయనంతో పుస్తకాన్ని రచించానని చిరంజీవులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీలు హనుమంతరావు, బూర నర్సయ్యగౌడ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన ఎండీకి సమస్యల స్వాగతం!

- రెండేండ్లుగా పెండింగ్‌లో అపాయింటెడ్ డే బిల్లు
- ప్రతినెలా మహాలక్ష్మి పథకం బిల్లుల పెండింగ్
- నేటికీ పెండింగ్‌లోనే 3,038 నియామకాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీకి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్న ఐపీఎస్ అధికారి వై నాగిరెడ్డికి సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ఆర్టీసీకి ఎండీగా నాలుగేండ్లపాటు సేవలందించిన సజ్జనర్.. హైదరాబాద్ సీపీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న నాగిరెడ్డిని ఆర్టీసీ ఎండీగా ప్రభుత్వం తాజాగా నియమించింది. కొన్నేండ్లుగా సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీని నాగిరెడ్డి ఏ మాత్రం బయట పడేయగలరోనని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎదురుచూస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో 'అపాయింటెడ్ డే' ఒకటి. రాష్ట్రాభివృద్ధిలో కీలకంగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను.. ప్రభుత్వ ఉద్యోగులుగా చేయాలనే లక్ష్యంతో నాడు కేసీఆర్ ప్రభుత్వం 2023 ఆగస్టులో అసెంబ్లీలో బిల్లుకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత 2023 అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ రావడంతో.. నాటి నుంచి నేటివరకూ వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి. ఎన్నికల ప్రచారంలో ఆర్టీసీ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. దీంతో ఇదే సమస్యను ప్రధానం చేసుకొని గత మే నెల 7న ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సైతం పిలుపునిచ్చారు. కానీ, ప్రభుత్వం కార్మిక సంఘాలను విభజించి చర్చించడంతో ఆ సమ్మెను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఎన్నికల నాటి నుంచీ టీజీఎస్ ఆర్టీసీలో ఉన్న ఖాళీలను పూర్తి చేస్తామని కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. 3,038 పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తించారు. వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పి.. ఇప్పటికి 21 నెలలుగా తాత్సారం చేస్తూనే ఉన్నారు. వేతనాల కోసం ప్రతినెలా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని వేడుకునే దీనస్థితికి చేరింది. వేతనాలతోపాటు రుణాల వడ్డీలు, పీఎఫ్‌లకు నానా తంటాలు పడుతున్నారు. అప్పులపై వడ్డీలు, ఇతర బకాయిలకు వందల కోట్లను ఆర్టీసీ చెల్లిస్తున్నది. ఇక ఆర్టీసీకి ప్రతినెలా ఇవ్వాల్సిన మహాలక్ష్మి బాకీ సైతం వందల కోట్లలోనే ఉంటుందని కార్మికులు చెప్తున్నారు. తాము అధికారంలోకి వస్తే అన్ని ట్రేడ్ యూనియన్లపై నిషేధం ఎత్తివేస్తామని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలుపుకోలేదు. కొత్త నియామకాలు లేక, రిటైర్మెంట్స్ ఎక్కువగా ఉండటంతో ఉన్న సిబ్బందిపై పనిభారం దారుణంగా పెరిగిందని కార్మికులు వాపోతున్నారు. రోజుకు 16 గంటల డ్యూటీ చేస్తున్నామని, విశ్రాంతి లేక ప్రమాదాల గురవుతున్నామంటున్నారు. ఆర్టీసీలో దారుణమైన శ్రమ దోపిడీకి గురవుతున్నామని చెబుతున్నారు.

పార్టీలో దూరినోళ్లను తరిమికొట్టండి

మొదటిపేజీ తరువాయి...

విధానాలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు నవ్వుల పాల్జేస్తున్నదని అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పొలాస దేవస్థానం కార్యవర్గం నియామకంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వారిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీరు, ఎమ్మెల్యే వ్యవహార శైలితో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చులకన చూస్తున్నారని తెలిపారు. పదేండ్లపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికార పక్షంపై పోరాటం చేస్తేనే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో ప్రతి కార్యకర్త శ్రమ ఉన్నదని, అలాంటి వారి శ్రమను వ్యర్థం చేస్తూ, పదేండ్లపాటు అధికారంతో విర్రవీగి, ఇప్పుడు అభివృద్ధి పేరిట కాంగ్రెస్‌లోకి ప్రవేశించడం సరికాదని అన్నారు. 2008లో తెలంగాణను అభివృద్ధిని చేయాలని తాను పేర్కొన్నానని, ఆ సమయంలో ఉద్యమ నేతగా, ఎంపీగా ఉన్న కేసీఆర్, అభివృద్ధి పౌర హక్కు, తెలంగాణ తన జన్మహక్కు అని ప్రకటించారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రకటన అక్షర సత్యమని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన అభివృద్ధి జరగదు, చేయరాదు అనేది తప్పు మాట అని తెలిపారు. 2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం హోదాలో కేసీఆర్ కరీంనగర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తే, ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న తన ప్రసంగంతోనే సమావేశాన్ని కేసీఆర్ ప్రారంభించారని గుర్తుచేశారు. జగిత్యాల అభివృద్ధి నేపథ్యంలో బోర్నపెల్లి-చిన్నబెల్లాల వంతెన మంజూరు చేయాలని కోరానని, వెంటనే స్పందించిన కేసీఆర్ కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో రూ.70 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే, ప్రతిపక్షంలో ఉన్నా అభివృద్ధి చేయవచ్చని సూచించారు. జగిత్యాలలో అభివృద్ధి పేరిట అధికార పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే, ఆయన అనుచరుల వ్యవహారశైలి సరిగా లేదని మండిపడ్డారు.

'స్థానిక' ఎన్నికలకు 350 కోట్లు!

- నిధులు విడుదల చేసిన ఫైనాన్స్‌శాఖ
- రిజర్వేషన్ల గెజిట్ కాపీలను ఎన్నికల కమిషనర్‌కు అందజేసిన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్నది. ఆదివారం కూడా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ(పీఆర్ఆర్డీ)యంత్రాంగం ఎన్నికల పనుల్లో నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణకు రూ.350కోట్లు ఖర్చు అవుతాయని, ఆ మొత్తాన్ని ఇవ్వాలని పీఆర్ఆర్డీశాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు రూ.350కోట్లను ఫైనాన్స్‌శాఖ విడుదల చేసినట్టు తెలిసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇటీవల రెండ్రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం ఆ నిధులనే ఖర్చు చేసినట్టు సమాచారం. మరోవైపు జిల్లా పరిషత్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్ కాపీలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు అందజేసినట్టు తెలిసింది. రిజర్వేషన్లను పరిశీలించి సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. అందులో భాగంగానే సోమవారం ఉదయం 11 గంటలకు కమిషనర్ మీడియా సమావేశం నిర్వహిస్తారని, కీలక అప్‌డేట్ ఉంటుందనే వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

1,31,883 బ్యాలెట్ బాక్సులు సిద్ధం

స్థానిక ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. తొలుత ఎంపీటీసీ, ఆ తర్వాత జడ్పీటీసీ, చివరకు సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఎస్ఈసీ ఇప్పటికే పూర్తిచేసింది. రాష్ట్రంలో 74,903 బ్యాలెట్ బాక్సులు ఉండగా, గుజరాత్ నుంచి 37,530, మహారాష్ట్ర నుంచి 19,450 తెప్పించారు. అయితే బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో కేసు ఉండగా, నోటిఫికేషన్ తర్వాతా మరికొందరు కోర్టుకు వెళ్లే పరిస్థితి ఉన్నందున ఎన్నికలు జరుగుతాయా అనే ఉత్కంఠ నెలకొన్నది.

కొత్తగా మూడు బస్‌డిపోలు

27 బస్‌స్టేషన్ల ఆధునీకరణ

రూ.108 కోట్ల మంజూరుకు పరిపాలన అనుమతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో కొత్తగా 3 ఆర్టీసీ డిపోల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటితో పాటు 27 బస్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్, ఆధునీకరణకు రూ.108.02 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చింది. కొత్తగా నిర్మించే డిపోల్లో నాగర్‌కర్నూల్, హుస్నాబాద్, అశ్వారావుపేట ఉన్నాయి. నిర్మాణ పనులకు సంబంధించిన కార్యాచరణను చేపట్టాలని సివిల్ ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించింది.

ఆధునీకరించనున్న బస్‌స్టేషన్లు ఇవే..

మద్దూర్, మహబూబ్‌నగర్, రేగొండ, వేములవాడ, గంగాధర, నిజామాబాద్, ఘన్‌పూర్, పాల్వంచ, మునుగోడు, చండూర్, చౌటుప్పల్, ఐజా, వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూర్, పెంట్లవెల్లి, దమ్మపేట, మండలపల్లి, కథలాపూర్, గోదావరిఖని, గూడూరు, మర్రిగూడ, నెక్కొండ, నర్సంపేట, వలిగొండ బస్‌స్టేషన్లతోపాటు నెక్కొండ బస్‌స్టేషన్‌షాపింగ్ కాంప్లెక్స్, నర్సంపేట స్టేషన్(గ్రౌండ్‌ఫ్లోర్, షాపింగ్ కాంప్లెక్స్) ఉన్నాయి.



సుప్రసన్నాచార్యకు జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కోవెల సుప్రసన్నాచార్యకు విశ్వనాథ జాతీయ పురస్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య అందుకున్నారు. ఈ మేరకు నారపల్లిలోని స్వాధ్యాయ సంస్థ కార్యాలయంలో గుంటూరు సంస్కృతి సంస్థ ప్రతినిధులు పురస్కారాన్ని అందజేశారు. ఈ నెల 7న గుంటూరులో పురస్కార ప్రదానం జరగాల్సి ఉండగా, కొన్ని కారణాలతో ఆ కార్యక్రమం వాయిదా పడిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. శరన్నవరాత్రి రోజుల్లో అవార్డు అందజేయడం ఆనందంగా ఉన్నదని వారు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మోదుగుల రవికృష్ణ, ఏల్చూరి మురళీధర్‌రావు, లక్ష్మణ చక్రవర్తి, కస్తూరి మురళీకృష్ణ, ఆచార్య యాదగిరి, ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బీఎస్ శర్మ, ఆంధ్రభారతి నిర్వాహకులు వాడపల్లి శేషతల్పశాయి, వీరభద్రుడు, అరుణ్ మద్ది తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పసుపునకు భౌగోళిక గుర్తింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తేతెలంగాణ):ఆర్మూర్ పసుపు భౌగోళిక గుర్తింపునకు సాంకేతికంగా జీఐ రిజిస్ట్రీ ఆమోదించింది. ఆర్మూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, మంథని, ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఆర్మూరు పేరిట గుర్తింపు కోసం దాఖలు చేశారు. తెలంగాణ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పిడిగం సైదయ్య నాబార్డ్ మద్దతుతో ఈ భౌగోళిక గుర్తింపు ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారు. హార్టికల్చరల్ వర్సిటీ వీసీ రాజిరెడ్డి మాట్లాడుతూ..'భౌగోళిక సూచిక(జీఐ) రిజిస్ట్రేషన్ పసుపు రైతులకు గేమ్-ఛేంజర్ కానుంది. ప్రీమియం ధర, మార్కెట్ , ఎగుమతి సామర్థ్యం వంటి ఆర్థిక-మార్కెట్ ప్రయోజనాలు జీఐ ట్యాగ్‌తో ముడిపడి ఉన్నట్టు తెలిపారు.

ఆసియాకప్‌లో భారత్ విజయదుందుభి మోగించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను పాత రేస్తూ ఫైనల్లో అదరగొట్టింది. టోర్నీలో ముచ్చటగా మూడోసారి దాయాదిని మట్టికరిపించిన టీమ్ ఇండియా దుబాయ్ నడిగడ్డపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. పహల్గాం ఉగ్రదాడితో ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితిలో భారత్ తమ సత్తాపంటో చేతల్లో చూపెట్టింది. సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కుతూ పాక్‌ను ఓడించిన టీమ్ఇండియా...రికార్డు స్థాయిలో తొమ్మిదో సారి ఆసియాకప్‌ను సగర్వంగా ముద్దాడింది. తన స్పిన్ మాయాజాలంతో కుల్దీప్..పాక్ నడ్డివిరిస్తే లక్ష్య ఛేదనలో హైదరాబాదీ తిలక్‌వర్మ సూపర్ ఇన్నింగ్స్‌తో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. సహచరులు విఫలమైన చోట తన విలువ చాటిన తిలక్..దేశ ప్రజలకు విలువైన దసరా కానుక అందించాడు. అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కి ఆపరేషన్ తిలక్‌తో భారత్‌కు విజయ తిలకాన్ని దిద్దాడు.



బుమ్రా (2/25)



తిలక్ వర్మ (69*)

ఆపరేషన్ తిలక్

అజేయ అర్ధసెంచరీతో విజృంభణ • ఫైనల్లో పాక్‌పై భారత్ ఉత్కంఠ విజయం • తొమ్మిదో సారి టైటిల్ కైవసం

దుబాయ్: పదిహేను రోజుల వ్యవధిలో దాయాది పాకిస్థాన్‌తో ముచ్చటగా మూడోసారి జరిగిన పోరులో భారత్‌దే పైచేయి. టోర్నీలో అపజయమన్నదే లేకుండా సాగిన టీమ్ఇండియా.. ఆదివారం చిరకాల ప్రత్యరితో ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో ఆ జట్టును 5 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. ఈ టోర్నీలో టైటిల్ గెలవడం భారత్‌కు ఇది తొమ్మిదోసారి. పాక్ నిర్దేశించిన 147 పరుగుల ఛేదనను భారత్ 19.3 ఓవర్లలో పూర్తి చేసింది. తిలక్ వర్మ (53 బంతుల్లో 69 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడగా, శివమ్ దూబె (22 బంతుల్లో 33, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సంజూ శాంసన్ (24) రాణించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. భారత స్పిన్నర్ల మాయకు విలవిల్లాడింది. కుల్‌దీప్ యాదవ్ (4/30), అక్షర్ పటేల్ (2/26), వరుణ్ చక్ర వర్తి (2/30)తో పాటు పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (2/25) ధాటికి ఆ జట్టు 19.1 ఓవర్లలో 146కు చేతులెత్తేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 57, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), ఫకర్ జమాన్ (35 బంతుల్లో 46, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మినహా ఏకంగా 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

తిలక్ తడాఖా

స్వల్ప ఛేదనలో టీమ్ఇండియా తడబడింది. టోర్నీలో సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్ (5) బౌండరీతో ఇన్నింగ్స్‌ను ఆరంభించినా ఫహీమ్ రెండో ఓవర్లో స్లో బంతిని తప్పుగా అంచనా వేసి మిడాన్‌లో రౌఫ్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే అఫ్రిది బౌలింగ్‌లో కెప్టెన్ సూర్య (1).. అనవసరపు షాట్ ఆడి పాక్ సారథి సల్మాన్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ఫహీమ్ తన తర్వాతి ఓవర్లో గిల్ (12)నూ ఔట్ చేయడంతో భారత్ ఒత్తిడికి గురైంది. కానీ మిడిలార్డర్‌లో తిలక్, సంజూ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ లక్ష్యాన్ని కరిగించారు. ఫహీమ్ 6వ ఓవర్లో తిలక్ 4,6 బాదాడు. 12 పరుగుల వద్ద తలాత్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన సంజూ.. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించినా అబ్రార్ 13వ ఓవర్లో షాట్ ఆడబోయి ఫర్హాన్‌కు క్యాచ్ ఇవ్వడంతో 57 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అబ్రార్ 16వ ఓవర్లో ఆఖరి బంతికి సింగిల్ తీసిన తిలక్.. 41 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాడు. దూబె అండతో తిలక్ భారత్‌ను గెలుపు దిశగా నడిపించాడు. పాక్ బౌలర్లు కాస్త కట్టుదిట్టంగా బంతులేసినా ఈ జోడీ తడబడకుండా ఆడింది. విజయానికి పది పరుగుల దూరంలో దూబె నిష్క్రమించినా రింకూ సింగ్ (4*)తో కలిసి తిలక్ గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.



కుల్‌దీప్ (4/30)

వాళ్లిద్దరిదే ఆట..

పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను మొదటి 9 ఓవర్లకు ముందు.. తర్వాతగా అభివర్ణించవచ్చు. ఆ జట్టులో ఓపెనర్లదే ఆట. హార్దిక్ గాయంతో మ్యాచ్‌కు దూరమవగా బుమ్రాకు జతగా శివమ్ దూబె పేస్ బాధ్యతలను మోశాడు. కానీ పాక్ ఓపెనర్లు ఈ ఇద్దరినీ దీటుగా ఎదుర్కొన్నారు. గత మ్యాచ్‌లో మాదిరిగానే ఓపెనర్ ఫర్హాన్ ఆరంభం నుంచే బుమ్రా బౌలింగ్‌లో ఎదురుదాడికి దిగాడు. నాలుగో ఓవర్లో అతడు 4, 6 బాదాడు. కుల్‌దీప్ 9వ ఓవర్లో రెండో బంతికి ఫకర్ స్లాగ్ స్వీప్‌తో సిక్సర్ కొట్టగా నాలుగో బంతికి రెండు రన్స్ తీసిన ఫర్హాన్ భారత్‌పై వరుసగా రెండో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. ఈ ఇద్దరి జోరు చూస్తే పాక్ భారీ స్కోరు చేసేట్టే కనిపించింది.

33 పరుగులు.. 9 వికెట్లు..

84/0.. 9.3 ఓవర్లకు పాక్ స్కోరిది. కానీ అనిశ్చితికి మారుపేరైన పాక్ 12.4 ఓవర్లలో 113–1తో మెరుగ్గానే కనిపించినా 33 పరుగుల వ్యవధిలో ఆఖరి 9 వికెట్లను కోల్పోయింది. వరుణ్ తన రెండో స్పెల్‌లో ఫర్హాన్‌ను ఔట్ చేసి భారత్‌కు తొలి బ్రేక్‌ను అందించాడు. పాక్ ఇన్నింగ్స్‌లో ఇదే టర్నింగ్ పాయింట్. కుల్‌దీప్ 13వ ఓవర్లో సైమ్ అయూబ్ (14) బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. అక్షర్ 14వ ఓవర్లో మహ్మద్ హారీస్.. రింకూ సింగ్ చేతికి చిక్కాడు. వరుణ్ 15వ ఓవర్లో మూడో బంతికి సిక్స్ కొట్టిన ఫకర్.. నాలుగో బంతికి కుల్‌దీప్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. ఫకర్ నిష్క్రమించాక పాక్ ఇన్నింగ్స్‌లో ఒక్క బ్యాటర్ కూడా డబుల్ డిజిట్ స్కోరు చేయలేదు. అక్షర్ 16వ ఓవర్లో తలాత్ (1) ఔటయ్యాడు. ఇక కుల్‌దీప్ 17వ ఓవర్లో సల్మాన్ అలీ అఘా (8), షహీన్ అఫ్రిది, ఫహీమ్ పనిపట్టాడు. బుమ్రా.. హరీస్ రౌఫ్ (6), నవాజ్‌ను ఔట్ చేసి పాక్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 19.1 ఓవర్లలో 146 ఆలౌట్ (ఫర్హాన్ 57, ఫకర్ 46, కుల్‌దీప్ 4/30, బుమ్రా 2/25); **భారత్:** 19.3 ఓవర్లలో 150/5 (తిలక్ 69*, దూబె 33, ఫహీమ్ 3/29, అఫ్రిది 1/20)



కెప్టెన్లు వేర్వేరు వ్యాఖ్యాతలతో..

దుబాయ్: ఆసియాకప్ ఫైనల్లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. సాధారణంగా ఇరు జట్ల కెప్టెన్లు టాస్ వేసే సమయంలో ఒకరు వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఆనవాయితీ. కానీ దాయాదుల మధ్య ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతూ అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నడూ లేని విధంగా తొలిసారి ఇద్దరు వ్యాఖ్యాతలు ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. టాస్ గెలిచిన వెంటనే కెప్టెన్ సూర్యకుమార్‌తో భారత్‌కు చెందిన రవిశాస్త్రి మాట్లాడగా, పాక్ సారథి సల్మాన్‌ఆగాతో వకార్ యూనిస్ సంభాషించడం కనిపించింది. అయితే దీని వెనుక పెద్ద తతంగమే జరిగినట్లు తెలిసింది. గత రెండు మ్యాచ్‌లకు అధికారిక వ్యాఖ్యాతగా వ్యవహరించిన రవిశాస్త్రి వద్దంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)..ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ)కు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఏసీసీ.. బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లగా రవిశాస్త్రిని తప్పించేందుకు బోర్డు ససేమిరా అంది. దీంతో మధ్యేమార్గంగా నిర్వాహకులు ఇద్దరు వ్యాఖ్యాతలతో టాస్ కానిచ్చేశారు. ఇదిలా ఉంటే ఫైనల్‌కు ముందు కెప్టెన్ల ట్రోఫీ ఫొటో షూటౌట్ గురించి తమకు చెప్పలేదని బీసీసీఐ స్పష్టం చేసింది.

ట్రోఫీ తీసుకోకుండానే..

ఆసియా కప్ ఫైనల్లో నాటకీయ పరిణామాలు

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇరు దేశాల ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే ప్లేయర్ల కరచాలనంతో రచ్చ చెలరేగగా, తాజాగా ట్రోఫీ ప్రదాన కార్యక్రమం మరింత నిప్పు రాజేసింది. తుది పోరు దాదాపు 12 గంటలకు(భారత కాలమానం ప్రకారం) పూర్తి కాగా, గంటకు పైగా వేచిచూడాల్సి వచ్చింది. అసలు ఏం జరుగుతుందో అర్థం కాక అభిమానులు ట్రోఫీ ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూశారు. మరోవైపు స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు తమ అభిమాన జట్టు ట్రోఫీ అందుకునే సందర్భంగా అలాగే ఉండిపోయారు. అయితే ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) అధ్యక్షుడుగా ఉన్న మోహసిన్ నక్వి చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు టీమ్ఇండియా ససేమిరా అన్నట్లు తెలిసింది. దీనికి తోడు ఓడిన నైరాశ్యంలో ఉన్న పాక్ టీమ్..డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చేందుకు నాటకాలు ఆడింది. దీంతో కామెంటరీ ప్యానెల్‌లో ఉన్న రవిశాస్త్రి, వసీం అక్రమ్, మంజ్రేకర్ ముగింపు కార్యక్రమ నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మొదలైన కార్యక్రమం అసలు ట్రోఫీ ఇవ్వకుండానే ముగియడం కొత్త వివాదానికి దారి తీసింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిలక్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా అభిషేక్ శర్మ నిలువగా, పాక్ ప్లేయర్లు రన్నరప్ చెక్ అందుకున్నారు. అయితే చెక్‌ను పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా స్టేజ్‌పై విసిరివేయడం లైవ్‌లో కనిపించింది. మొత్తంగా నక్వీ చేతుల మీదుగా భారత్ ట్రోఫీ తీసుకోకుండానే కార్యక్రమం ముగిసింది.

బీసీసీఐ బాస్ మన్హాస్

మిథున్‌కే అధ్యక్ష పగ్గాలు • మెన్స్ సెలక్షన్ కమిటీలో ఆర్‌పీ సింగ్, ఓఝా



ముంబై: ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా విరాజిల్లుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడిగా ఢిల్లీ మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ ఏక్రగీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం ముంబైలో జరిగిన బీసీసీఐ 94వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో సభ్యులు బీసీసీఐ 37వ అధ్యక్షుడిగా 45 ఏండ్ల మిథున్‌ను ఎన్నుకున్నారు. వయసు నిబంధనల (70 ఏండ్లు)తో రోజర్ బిన్నీ తన బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఆయన స్థానాన్ని మన్హాస్ భర్తీ చేశాడు. గత ఇద్దరు బీసీసీఐ అధ్యక్షులు (గంగూలీ, బిన్నీ) అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లు కాగా మిథున్ మాత్రం తన సుదీర్ఘ కెరీర్ (157 ఫస్ట్‌క్లాస్, 130 లిస్ట్ ఏ, 55 ఐపీఎల్ మ్యాచ్‌లు)లో దేశవాళీలు మినహా భారత జాతీయ జట్టు తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం. అధ్యక్ష రేసులో గంగూలీ, హర్భజన్, కిరణ్ మోరే వంటి మాజీల పేర్లు వినిపించినా కేంద్ర ప్రభుత్వ పెద్దల అండదండలు సంపూర్ణంగా మిథున్‌కే ఉండటంతో అతడి ఎన్నిక ఏకగ్రీవమైంది. మిథున్ అధ్యక్షుడిగా ఎన్నికవగా ఉపాధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవ్‌జిత్ సైకియా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తమ స్థానాలను నిలుపుకున్నారు. కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ చీఫ్ రఘురామ్ భట్ కోశాధికారిగా ఎన్నియ్యాడు. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన ప్రభ్‌తేజ్ భాటియా.. సంయుక్త కార్యదర్శిగా ఎన్నికవగా సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయదేవ్ షా అపెక్స్ కౌన్సిల్ మెంబర్‌గా (దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో) వచ్చినట్టు బీసీసీఐ తెలిపింది. ధుమాల్‌తో పాటు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఖైరుల్ జమల్ మజుందార్‌కు స్థానం కల్పించారు.

సెలక్షన్ కమిటీలో ఆర్‌పీ సింగ్, ఓఝా

అజిత్ అగార్కర్ సారథ్యంలోని భారత పురుషుల సీనియర్ సెలక్షన్ కమిటీలో మాజీ క్రికెటర్లు ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓఝా చేరారు. శరత్, సుబ్రతో బెనర్జీ పదవీకాలం ముగియడంతో వారి స్థానాలను ఆర్‌పీ, ఓఝా భర్తీ చేయనున్నారు. శరత్.. జూనియర్ సెలక్షన్ కమిటీకి చైర్మన్‌గా నియమితుడయ్యాడు. మహిళల సెలక్షన్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ క్రికెటర్ అమితా శర్మ నియమితురాలైనట్టు బీసీసీఐ తెలిపింది. భారత్ తరపున 116 వన్డేలు ఆడిన ఆమె.. నీతూ డేవిడ్ స్థానాన్ని భర్తీ చేయనుంది. అమితా, శ్యామ డే, జయ శర్మ, స్రవంతి నాయుడుతో కూడిన ఈ కమిటీ పదవీకాలం మహిళల వన్డే ప్రపంచ కప్ తర్వాత మొదలుకానుంది.

గ్రూప్ -2 ఫలితాలు విడుదల

- 782 ఉద్యోగాలతో తుది జాబితా
- 18 రకాల ఉద్యోగాల భర్తీ
- దసరాలోపే నియామక పత్రాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రూప్–2 తుది ఫలితాలు విడుదలయ్యాయి. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం ఈ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 783 పోస్టులకు 782 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు. మెడికల్ రిపోర్ట్ అందని కారణంగా ఒక పోస్టు భర్తీని విత్‌హెల్డ్‌లో ఉంచారు. గ్రూప్–2లో భాగంగా మొత్తం 18 రకాల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశారు. పూర్తి వివరాల కోసం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, పరీక్షలు నిర్వహించిన 10 నెలల్లోనే ఫలితాలు వెల్లడించామని కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. విజేతలకు దసరాలోపే నియామకపత్రాలను అందజేయాలని సర్కారు వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే గ్రూప్–1 విజేతలకు నియామక పత్రాలను అందజేయగా, గ్రూప్ –2 విజేతలకు సైతం అక్టోబర్ 2న దసరాలోపే శాఖల వారీగా నియామక పత్రాలిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



వెంకటహర్షవర్ధన్


కేసీఆర్ హయాంలో

గ్రూప్–2 పోస్టుల భర్తీకి గత కేసీఆర్ సర్కారు హయాంలోనే నోటిఫికేషన్ విడుదలైంది. 2022లో 783 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు పరీక్షలు వాయిదా పడ్డాయి. 2024 డిసెంబర్‌లో రాత పరీక్షలను నిర్వహించారు. 2025 మార్చిలో జనరల్ ర్యాకింగ్ లిస్టును విడుదల చేశారు. మొత్తం 5,51,855 మంది గ్రూప్–2కు దరఖాస్తు చేయగా, 2,49,964 మంది అభ్యర్థులు పరీక్షలను రాశారు. వారిలో 13,316 మందిని అనర్హులుగా ప్రకటించారు. 2,36,649 మంది అభ్యర్థులతో జనరల్ ర్యాంకింగ్ లిస్టును విడుదల చేశారు. ఆ తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించి, తాజాగా తుది ఫలితాలను విడుదల చేశారు.

	అభ్యర్థి పేరు	ఉద్యోగం
పురుష టాపర్లు	నారు వెంకటహర్షవర్ధన్	ఏఎస్‌వో (జనరల్ అడినిస్ట్రేషన్)
	నావల్లకొండ సచిన్	సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2
	బీ మనోహర్‌రావు	సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2
	శ్రీరామ్ మధు	సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2
	చింతలపల్లి ప్రీతమ్‌రెడ్డి	సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2
మహిళా టాపర్లు	లక్కిరెడ్డి వినీషారెడ్డి	డిప్యూటీ తహసీల్దార్
	బాయికాడి సుస్మిత	డిప్యూటీ తహసీల్దార్
	కొప్పు శ్రీవేణి	డిప్యూటీ తహసీల్దార్
	వీరంరెడ్డి శ్రీలత	మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ -3
	గొట్టిముక్కుల స్నేహ	డిప్యూటీ తహసీల్దార్



ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య!



హరీశ్ (ఫైల్)

శాయంపేట, సెప్టెంబర్ 28 : బీటెక్ పూర్తి చేసి రెండేళ్లయినా ఉద్యోగం రావడంలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా నర్సింహులపల్లిలో జరిగింది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపల్లికి చెందిన రైతు ముసుకు మల్లయ్య కుమారుడు హరీశ్(26) రెండు సంవత్సరాల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో మనస్తాపానికి గురైన హరీశ్ ఈ నెల 24న సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకుని వరంగల్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తండ్రికి ఫోన్ చేసి ఉద్యోగం రాకపోవడంతో గడ్డి మందు తాగానని చెప్పాడు. వెంటనే తల్లిదండ్రులు వరంగల్‌కు వెళ్లి హరీశ్‌ను పరకాల దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పరమేశ్ తెలిపారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న గ్రూప్–1 అభ్యర్థులు, మోతీలాల్‌నాయక్

గ్రూప్-1పై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- రీ ఎగ్జామ్ పెట్టాలి
- తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం చేశారు
- ఓయూ జేఏసీ నేత మోతీలాల్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : గ్రూప్–1లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టుకు వెళ్తామని, మెయిన్స్ పేపర్లను రీవాల్యుయేషన్ చేయడం కాదని, రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఓయూ జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గ్రూప్–1అభ్యర్థులు గంగా భాస్కర్, రమావత్ మోహన్, రమ్య, ఝాన్సీతో కలిసి ఆయన మాట్లాడారు. యూపీఎస్సీని అనుసరిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలుచేయలేదని మండిపడ్డారు. రెండు హాల్‌టికెట్లు ఇవ్వడంతోనే టీజీపీఎస్సీ బండారం బయటపడిందని పేర్కొన్నారు. సింగిల్‌బెంచ్ తీర్పు వచ్చిన కొద్ది గంటల్లోనే నియామకాలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఆ తీర్పులో ఏమున్నది? తెలుగు మీడియం విద్యార్థుల గురించి ఏమైనా ప్రస్తావించారా? అనేది తేలాల్సి ఉన్నా, అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. 563 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసిన టీజీపీఎస్సీ వారి పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అడ్డదారిలో స్థానికేతరులు, అగ్రవర్ణాలకు కేటాయించిన విషయం వెలుగులోకి వస్తుందనే భయంతోనే ఆగమేఘాలపై నియామకపత్రాలు అందజేశారని పేర్కొన్నారు. తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో లక్ష్మి, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

బడులకు ల్యాబ్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సర్కారు బడుల్లో సైన్స్, గణితం ప్రయోగాలకు వీలుగా పాఠశాల విద్యాశాఖ ల్యాబ్స్ మ్యాన్యువల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 6 –10 తరగతుల జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, జీవశాస్త్రం సబ్జెక్టుల కోసం ల్యాబ్ మాన్యువల్స్‌ను ముద్రించి అందజేస్తున్నారు. ఒక్కో స్కూల్‌కు నాలుగు చొప్పున గణితం, సైన్స్ మ్యాన్యువల్స్‌ను అందజేస్తారు. మాన్యువల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఒక ప్రకటనలో సూచించారు.

సీపీగెట్‌లో 71% సీట్లు మహిళలకే

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పీజీ కోర్సుల్లోని సీట్ల భర్తీకి నిర్వహించిన సీపీగెట్ మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్‌లో 20,467 సీట్లు భర్తీ అయ్యాయి. 20వేలపైగా సీట్లు భర్తీ అయితే అందులో 14,688 సీట్లను మహిళలే కైవసం చేసుకోగా, పురుషులు 5,779 సీట్లను మాత్రమే దక్కించుకున్నారు. ఈసారి 28,145 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, 20,467 మంది సీట్లు సొంతం చేసుకున్నారు. సీట్లు పొందిన వారు అక్టోబర్ 8లోగా రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి సూచించారు.

రికార్డు అసిస్టెంట్ల వేతనం పెంచాలి

ఎస్సీ గురుకుల సొసైటీ సిబ్బంది డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్లకు చెల్లిస్తున్నట్టే తమకూ వేతనాలు చెల్లించాలని ఎస్సీ గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 15ఏండ్లకుపైగా రికార్డు అసిస్టెంట్లుగా కొనసాగుతున్నప్పటికీ తమకు సబ్‌స్టాఫ్ కేడర్‌లో వేతనాలు చెల్లిస్తున్నారని వాపోయారు. ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాలు, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోని రికార్డు అసిస్టెంట్లకు రూ.19,600 వేతనం చెల్లిస్తుండగా, తమకు కేవలం రూ.15,600 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని సొసైటీల్లో చెల్లిస్తున్నట్టే తమకూ రూ.19,600 చెల్లించాలని కోరారు.

ఉద్యోగాలు ఇయ్యలే ఉయ్యాలో!

- నిరుద్యోగుల వినూత్న బతుకమ్మ
- అశోక్‌నగర్ సమీపంలో నిరసన
- నిమజ్జనాన్ని అడ్డుకున్న పోలీసులు



బతుకమ్మ ఆడుతున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 28: 'బతుకమ్మ నువ్వే మమ్మల్ని బతికించు' అంటూ నిరుద్యోగులు వేడుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌తో ఆదివారం అశోక్‌నగర్ సమీపంలో నిరుద్యోగులు బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ.. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడుస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగల వల్ల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.4వేలు ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బతుమ్మను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయడానికి బయలుదేరిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిరుద్యోగులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాష్ట్రంలో నియంత పాలన నడుస్తున్నదని నిరుద్యోగులు మండిపడ్డారు. బతమ్మను నిమజ్జనం చేయకుండా అడ్డుకోవడమేంటని ప్రశ్నించారు. అశోక్‌నగర్‌లోని హుస్సేన్‌సాగర్ నాలాలో బతుకమ్మను నిమజ్జనం చేశారు.



అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా ఏడుపాయల్లోని మంజీరా నది వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ , చిత్రంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, గవర్నమెంట్ సిటీ కాలేజీ ప్రతినిధులు

నదులను కాపాడుకుంటేనే మనుగడ

- 'ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్' అధ్యక్షుడు వేదకుమార్
- ఏడుపాయల మంజీరా నది వద్ద 'నదితో నడక' ప్రారంభం

పాపన్నపేట, సెప్టెంబర్ 28: నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, గవర్నమెంట్ సిటీ కాలేజీ వారితో ఏడుపాయల వద్ద మంజీరా నదిని సందర్శించి 'నదితో నడక' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన నదులను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సుమారు 100 దేశాల్లో ఈ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రూప్–1 ఆఫీసర్ కరిపె రాజు ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రొఫెసర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఫోరం సభ్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ నదులను కాపాడితే మనల్ని కాపాడుకున్నట్టే నని చెప్పారు. కార్యక్రమంలో నీటి నిల్వ పద్ధతుల నిపుణులు సుభాష్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, వెంకన్న, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు సంతోష్, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ ఎం హెచ్ రావు, డా. రమ, డా. పద్మ, సుతారావు, వెంకటనారాయణ, నరేందర్, కేటీసీబీ సభ్యులు తెలిపారు.

45 మంది డిప్యూటీ కలెక్టర్ల నియామకం

- గ్రూప్-1 సాధించిన వారికి పోస్టింగులు
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం 45 మందిని డిప్యూటీ కలెక్టర్లుగా నియమించింది. గ్రూప్–1 నోటిఫికేషన్ కింద డిప్యూటీ కలెక్టర్ (క్యాటగిరీ–3) పోస్టులకు ఎంపికైన 45 మంది అభ్యర్థులను నియమిస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) రూల్స్–2024 ప్రకారం టీజీపీఎస్సీ ఎంపిక చేసిన అభ్యర్థులను మల్టీజోన్–1లో 20 మంది, మల్టీజోన్–2లో 25 మందిని వివిధ జిల్లాలకు ట్రైనింగ్ కోసం కేటాయించారు. ఈ నియామకాలు షరతులకు లోబడి ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు 60 రోజుల్లోపు డ్యూటీలో చేరాలని, లేకుంటే నియామకం రద్దు అవుతుందని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక మూడేండ్లు ప్రభుత్వ సర్వీసులో కొనసాగాలని సూచించారు. అభ్యర్థులు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుని, మెడికల్ రిపోర్ట్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించిన గురుకుల కాంట్రాక్టర్లు

గురుకుల కాంట్రాక్టర్లకు బిల్లులెప్పుడిస్తరు?

6 నెలలుగా ఇవ్వక పోవడం సిగ్గుచేటు

బిల్లులు చెల్లించకుంటే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎట్ల పెడుతరు?

సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్

హరీశ్‌రావును కలిసిన కాంట్రాక్టర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : గురుకులాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే, గురుకులాకు సరుకులను ఎలా సరఫరా చేస్తారని? పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారని? ప్రశ్నించారు. గురుకులాల కాంట్రాక్టర్లు హరీశ్‌రావును ఆదివారం కలిశారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నదని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ కల్తీ ఆహారంతో గురుకుల విద్యార్థులు దవాఖానల పాలై ప్రాణాలు వదులుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం శోచనీయమని, గురుకుల విద్యార్థులు పస్తులుండవద్దన్న బాధ్యతతో కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి మరీ భోజనాలు పెడుతున్నారని తెలిపారు. అప్పులు పెరిగి కాంట్రాక్టర్లు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని వాపోయారు.

పండుగ సంబురం లేకుండా..

సుమారు 5000 మంది గురుకులాల కాంట్రాక్టర్లకు బతుకమ్మ, దీపావళి పండుగ సంబురం లేకుండా చేయడం దుర్మార్గమని హరీశ్ నిప్పులు చెరిగారు. అధికారులను కలిసి బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఈ ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, గురుకుల పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

నేడే సద్దుల బతుకమ్మ.. సర్కారు చీరలేవమ్మా?

- రెండేండ్లలో ఒక్క చీరైనా ఇవ్వని రేవంత్ సర్కార్
- కేసీఆర్ ఇచ్చిన చీరలకు మంగళం
- చీరలు ఇంకెప్పడిస్తారంటూ నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నేడు సద్దుల బతుకమ్మ.. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం ఒక్క మహిళకు, ఒక్క చీర కూడా ఇవ్వలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆడపడుచులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మహిళలు సంఘాల సభ్యులు మండిపడుతున్నారు. ఈ ఏడాది బొడ్డెమ్మ పండుగకు చీర ఇస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. కానీ చీర ఇవ్వలేదు. ఆ తర్వాత ఎంగిలి పూల బతుకమ్మకు అన్నారు.. సద్దుల బతుకమ్మకు వాయిదా వేశారు. ఇప్పుడు సద్దుల పండుగ రానే వచ్చింది. చీర మాత్రం ఇవ్వకుండా కాంగ్రెస్ పాలకులు మోసానికి పాల్పడ్డారని మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారంలోకి రాక ముందు ఒక్కో మహిళకు రెండు చీరలు ఇస్తామంటూ ఆర్భాటపు ప్రచారం చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు ఉచిత చీరల పంపిణీ పథకాన్నే పక్కకు పెట్టిందని కాంగ్రెస్ సర్కార్‌పై మహిళలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదే విధంగా నిరుడు ఏవేవో సాకులు చెప్పి తప్పించుకున్న రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు కూడా సాకులు చెప్తూనే చీరలు ఇవ్వడంలేదని దుయ్యబడుతున్నారు.



బతుకమ్మ పండుగకు రెండు చీరలు పంపిణీ చేస్తామంటూ ప్రకటనలు చేసి.. పండుగ దగ్గరకు వచ్చినా అందజేయకపోవడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు, మహిళలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఎన్నికల్లో మహిళలకు అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి రాగానే ఎగనామం పెట్టారని ఆరోపించారు. –కరీంనగర్ కార్పొరేషన్

మాటలు చెప్పి.. చేతలు మరిచి!

రాష్ట్రంలోని స్వయం సహాయ సంఘాల(ఎస్‌హెచ్‌జీ)లోని 60 లక్షల మంది మహిళలకు ఒక్కొక్కరికి రెండు చొప్పున మొత్తం 1.20 కోట్ల చీరలు ఇస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, సీఎం దగ్గరుండి డిజైన్లు ఖరారు చేశారని, నాణ్యమైన చీరలు ఇస్తామంటూ ప్రభుత్వ పెద్దలు, మంత్రులు జోరుగా ప్రచారం చేశారు. తీరా సద్దుల బతుకమ్మ వచ్చినా.. ఒక్క చీర ఇవ్వకపోవడంతో ప్రభుత్వం మాటలు చెప్పిందని, చేతలు మరిచిందని మహిళలు మండిపడుతున్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలతోపాటు నేత కార్మికులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విపక్షాల నేతలు మండిపడుతున్నారు. చీరల తయారీ బాధ్యతలను తెలంగాణ కార్మికులకు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమేంటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కేసీఆర్ కానుక.. రేవంత్ ధోకా!

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో బతుకమ్మ చీరల పథకం బ్రహ్మాండంగా కొనసాగిందని మహిళా సంఘాల నేతలు గుర్తుచేస్తున్నారు. మహిళలందరికీ కాకుండా స్వయం సహాయక బృందాల సభ్యులకు మాత్రమే రెండు చీరల చొప్పున ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్.. అసలుకే ఎసరు పెట్టిందని చెప్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాదిలో (2024లో) ఒక్క చీర కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడుతున్నారు. ఈ సారి కూడా చీరలు ఇవ్వకుండా.. మోసానికి పాల్పడిందని గుర్రుగా ఉన్నారు. చీరల పథకం నిధులలో దాదాపు రూ.300 కోట్ల వరకు కమీషన్ల కోసం అధికార పార్టీ నేతలు పోటీ పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే చీరలు సమయానికి తయారు కాలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దసరాకు చీరలు ఇవ్వలేకపోతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. కార్మికులు సకాలంలో చీరలు తయారు చేయలేదంటూ చెప్పుకొచ్చారు. ప్రభుత్వం చీరలు ఇస్తుందన్న నమ్మకం లేదంటూ మహిళా సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

వారంపాటు వర్షాలు

శుక్ర, శనివారాల్లో భారీ వానలు

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు రాష్ట్రాన్ని ఇప్పట్లో వీడే అవకాశాలు కనిపించడంలేదు. నైరుతి రుతుపవనాలు తెలంగాణపై చురుకుగానే కొనసాగుతున్నాయి. వాతావరణంలో పెరిగిన తేమ, అధిక ఉష్ణోగ్రతలలో సాయంత్రం సమయంలో క్యుములోనింబస్ మేఘాలు దట్టంగా ఏర్పడుతుండటంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర అండమాన్ ప్రాంతంలో 30న ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతంలో అక్టోబర్ 1న అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ ప్రభావంతో వారంపాటు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అక్టోబర్ 3, 4 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వారంపాటు ఎల్లో అలెర్ట్ జారీచేశారు. ఆదివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు తెలిపారు.

‘కాంతార చాప్టర్ 1’ ఓ మహాయజ్ఞం



‘నా మూడేళ్ల వయసులో మా అమ్మమ్మ నన్ను కూర్చోబెట్టి తన ఊరు కుందాపురాకు చెందిన కథలు చెప్పేది. ఆ కథలు వింటూ ఇవి నిజంగా జరిగిన కథలేనా అనిపించేది. చాలా నచ్చేవి కూడా. ఈ గుళిగా అంటే ఏంటి? ఈ పింజర్లేంటి? ఒక్కసారి వెళ్లి చూడాలి అనుకునేవాడ్ని. నేను విన్న ఆ కథల గురించి ఒక దర్శకుడు సినిమా తీస్తాడని అనుకోలేదు. ఆ వ్యక్తే నా సోదరుడు రిషబ్ శెట్టి. తెరపై ఆ కథను తొలిసారి చూసినప్పుడు మాట్లాడలేకపోయా. ఈ కథ తెలిసిన నేనే అలా అయిపోతే.. తెలియని జనం ఎంత సంభ్రమకు లోనై ఉంటారు! అదే ‘కాంతార’. సినిమాకు చెందిన 24శాఖలపై పట్టున్న అద్భుత కళాకారుడు రిషబ్‌శెట్టి. ‘కాంతార చాప్టర్ 1’ సామాన్యమైన సినిమా కాదు. దీనికోసం ఆయన ఓ యజ్ఞమే చేశారు. ఇదొక అద్భుతమైన కల. తన భార్య ప్రగతిగారి సహకారం వల్లే ఆయనకు ఇది సాకారమైంది. ఈ సినిమా మనందర్నీ రంజింపజేస్తుందని, బ్లాక్‌బస్టర్‌గా చరిత్ర సృష్టిస్తుందని దేవుడ్ని కోరుకుంటున్నా.’అని ఎన్టీఆర్ అన్నారు. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో నటించిన డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ ‘కాంతార చాప్టర్ 1’. బ్లాక్‌బస్టర్ ‘కాంతార’కు ఈ సినిమా ప్రీక్వెల్. హోంబలే ఫిల్మ్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ పై విధంగా స్పందించారు. రిషబ్‌శెట్టి మాట్లాడుతూ ‘మీ ప్రేమకీ, మీ సహకారానికీ థ్యాంక్స్. పక్క రాష్ట్రం వాడినైనా సొంత మనిషిగా ప్రేమను పంచుతున్న మీ రుణం తీర్చుకోలేను.’ అన్నారు. ఇంకా ప్రగతి శెట్టి, కథానాయిక రుక్మిణి వసంత్, నిర్మాత రవి శంకర్, రాంబాబు గోసాల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్రం



సర్‌ప్రైజ్‌లు ముందున్నాయ్..

‘ఒకే పని సెసేనాకి.. ఒకే నాగ బతికేనాకి.. ఇంత పెద్ద బతుకెందుకు? ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసెయ్యాల.. పుడతామాయేటి మళ్లీ?!’ ఈ సంభాషణతో కూడిన ‘పెద్ది’ ప్రచారచిత్రం కొన్ని రోజుల కిందట విడుదలై సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ‘పెద్ది’ సినిమా కోసం దర్శకుడు బుచ్చిబాబు సాన ప్రాణం పెట్టేస్తున్నాడని ప్రచార చిత్రాలే చెప్పేస్తున్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ కథతో ఈ సినిమా రానుంది. ఈ సినిమా కోసం రామ్‌చరణ్ అభిమానులే కాదు, సగటు సినీ ప్రేమికులంతా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ‘పెద్ది’ విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి రామ్‌చరణ్ 18ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శుభాకాంక్షలు చెబుతూ ‘పెద్ది’ టీమ్ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేసింది. ‘మా ‘పెద్ది’ 18ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషం. తెరపై ఘనమైన వారసత్వాన్ని కొనసాగిస్తూ, బయట ఎంతో వినయ విధేయతలు కలిగి ఉండటమే కాకుండా, తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పాటు చేసుకున్నాడు. మాకెన్నో అద్భుతమైన ఉత్సాహాన్ని కలిగించే సందర్భాలను ఇచ్చాడు. ‘పెద్ది’ నుంచి చాలా పెద్ద సర్‌ప్రైజ్‌లు మొదలుకాబోతున్నాయి.. వెయిట్ అండ్ సీ..’ అని పోస్టర్‌తోపాటు మేకర్స్ పేర్కొన్నారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

రాజాసాబ్ మాయాజాలం



అగ్ర కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ రొమాంటిక్ కామెడీ హారర్ మూవీ ‘ది రాజాసాబ్’. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ కలిసి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇందులో భాగంగా నేటి సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. ప్రభాస్ అభిమానులతోపాటు మూవీ లవర్స్ అందరూ అనందించేలా ఈ ట్రైలర్ ఉండబోతున్నదని వారు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రభాస్, సంజయ్‌దత్ కాంబో స్టిల్ ఆసక్తికరంగా ఉంది. ‘కామెడీ హారర్ జానర్‌లో ప్రభాస్ నటించడం ఇదే ప్రథమం. దర్శకుడు మారుతి తనదైన శైలిలో జనరంజకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఎవర్‌గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది.’ అని మేకర్స్ తెలిపారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సంగీతం: తమన్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

విజయ్ సేతుపతితో పూరీ స్లమ్‌డాగ్



తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రధారిగా పూరీ జగన్నాథ్ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో విజయ్ సేతుపతి యాచకునిగా నటిస్తున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాకు బెగ్గర్, భవతీ బిక్షాందేహి టైటిల్స్ మొదట్లో అనుకున్నారు. అయితే.. తాజాగా ఈ సినిమాకు. ‘స్లమ్‌డాగ్’ అనే పేరును పూరీ ఖరారు చేశారు. ఇదో భిన్నమైన కథాంశమని, తన డైరెక్షన్‌తో హీరోయిజానికి కొత్త నిర్వచనం చెప్పిన పూరీ, నటనలో కొత్త ఒరవడి సృష్టించిన విజయ్ సేతుపతి కలయికలో వస్తున్న ఈ చిత్రం నిజంగా విలక్షణమేనని చిత్రబృందం చెబుతున్నది. పూరీ బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను చెన్నైలో విడుదల చేయాలనుకున్నారు. విజయ్ ఎలక్షన్ ప్రచారంలో జరిగిన దుర్ఘటన దృష్ట్యా ఈ వేడుకను వాయిదా వేశారు. త్వరలోనే టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు.

ముద్దులకు వెయ్యిరూపాయలు



‘**నేపథ్యం** ఉన్నంత మాత్రాన ఇండస్ట్రీలో రాణిస్తారని అనుకోవడం తప్పు. నాకు బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా అవకాశాలు మాత్రం తేలిగ్గా రాలేదు. చాలా కష్టపడ్డాను.’ అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు నటుడు సైఫ్ అలీ ఖాన్. ఇటీవల ఓ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించి, ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు సైఫ్. ‘నేను హీరో అవుదామని ఇండస్ట్రీకి వచ్చాను. కానీ నాకు అవకాశాలు రాలేదు. దాంతో సెకండ్, థార్డ్ లీడ్ క్యారెక్టర్లు కూడా చేశాను. ఒకానొక దశలో పాత్రలకోసం యాచించాల్సి వచ్చింది.’ అన్నారు సైఫ్. ఈ సందర్భంగా తన కెరీర్‌లో ఎదురైన ఓ వింత అనుభవం గురించి ఆయన చెబుతూ ‘అవకాశాల్లేక స్టూడియోల చుట్టూ తిరుగుతున్న రోజుల్లో ఓ మహిళా నిర్మాత నాకు ఖర్చుల కోసం డబ్బులు ఇచ్చేది. అయితే ఆ డబ్బు ఇవ్వడానికి ఆమె ఓ కండీషన్ పెట్టింది. తన బుగ్గపై ముద్దు పెడితేనే డబ్బులు ఇస్తాననేది. నేను పది ముద్దులు పెట్టి, వారానికి వెయ్యి రూపాయలు తీసుకునేవాడ్ని.’ అంటూ నవ్వేశారు సైఫ్ అలీఖాన్.

నాని సినిమాలో విలన్‌గా?

‘**ఓజీ**’తో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు సుజిత్ తన తర్వాత సినిమా విషయంలోనూ భారీగానే ముందుకెళ్తున్నారు. నెక్ట్స్ ఆయన నానీతో సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను కూడా పాన్ ఇండియా స్థాయిలోనే తెరకెక్కించనున్నారు సుజిత్. అందులో భాగంగా మలయాళ అగ్ర హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌ని ఇందులో విలన్‌గా తీసుకున్నారని వినికిడి. ఇప్పటికే పృథ్వీరాజ్‌కు కథ కూడా వినిపించారట. ప్రస్తుతం మహేశ్, రాజమౌళిల ‘SSMB 29’లో విలన్‌గా నటిస్తున్నారు పృథ్వీరాజ్. ఇప్పుడు క్యారెక్టర్ నచ్చడంతో నానీ సినిమాలోనూ విలన్‌గా నటించేందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట.



వ్యాయామంతోనే వినోదం



పాడిల్ బాల్ గేమ్ అంటే అలియాభట్‌కు చాలా ఇష్టం. ఆమె క్రమం తప్పకుండా రోజూ ఈ గేమ్ ఆడతారు. ఇటీవల ఆ గేమ్ ఆడి ఇంటికి వస్తున్న సమయంలో కొందరు ఫొటోగ్రాఫర్లు ఆమెను ఫొటోలు తీయబోగా అలియా అసహనానికి లోనైన విషయం తెలిసిందే. అయితే.. రీసెంట్‌గా తాను పాడిల్ బాల్ గేమ్ ఆడుతూ ఉన్న వీడియోను అలియా తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. క్రీడాకారిణిగా కూడా సూపర్ అనిపించేలా అలియా ఈ గేమ్ ఆడటం ఈ వీడియోలో చూ డొచ్చు. ‘జీవితంలో అనుకున్నవన్నీ సాధించాలంటే కావాల్సింది ఆరోగ్యం. ఆరోగ్యానికి కావాల్సింది వ్యాయామం. ఆ వ్యాయామంలోనే వినోదాన్ని వెతుక్కుంటాన్నేను. అదే పాడిల్ బాల్ గేమ్. ఈ ఆట నాకెంతో ఇష్టం. ఒక తల్లిగా, ఒక నటిగా, ఒక వ్యాపారవేత్తగా విజయవంతంగా ముందుకెళ్తున్నానంటే కారణం ఈ గేమ్..’ అంటూ ఈ వీడియోతోపాటు పేర్కొన్నారు అలియా. ఈ వీడియో చూసిన వారంతా అలియాను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

సంకల్పానికీ, విధికీ మధ్య పోరాటం



సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సూపర్ నాచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ ‘జటాధర’. ఈ పాన్ ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తురు. పౌరాణిక ఇతివృత్తాలతో గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఈ సినిమా అందివ్వబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. రీసెంట్‌గా విడుదల చేసిన ‘సోల్ ఆఫ్ జటాధర’కి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. విజయదశమి కానుకగా అక్టోబర్ 1న ఈ సినిమా నుంచి ‘ధన పిశాచి..’ సాంగ్‌ని విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. మంచికీ చెడుకీ, వెలుగుకీ చీకటికీ, మానవ సంకల్పానికీ, విధికీ మధ్య జరిగే పోరాటాన్ని ఈ చిత్రం చూ పించబోతున్నదని మేకర్స్ తెలిపారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇంద్ర కృష్ణ, రవిప్రకాశ్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఉమేష్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్హాల్, నిఖిల్ నందా నిర్మాతలు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 29 సెప్టెంబర్ 2025 | HYDERABAD

బలహీనపడిన ఆవర్తనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఆదివారం నాటికి బలహీనపడిందని, దీంతో ప్రస్తుతానికి నగరంలో భారీ వర్షాల ముప్పు తప్పినట్లేనని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అయితే బలహీనపడిన ఆవర్తన ప్రభావం వల్ల నగరంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి రాత్రి 10గంటల వరకు ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, మౌలాలి, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.5 డిగ్రీలు, గాలిలో తేమ 81శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. వెల్లడించారు.


మూసారంబాగ్ వద్ద మూసీ ఉధృతి


ఎర్రగడ్డ డివిజన్ జనప్రియ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. – ఎర్రగడ్డ, సెప్టెంబర్ 28


మలక్‌పేట వినాయకవీధిలో దుస్థితి ఇది..

సర్వస్వం కోల్పోయి

గవర్నమెంటోళ్లు చేసిన మేలు సున్నా..



రాత్రి పది గంటలకు మా ఇళ్లల్లోకి నీళ్లొచ్చినయ్. కట్టు బట్టలతోని బయటికి పోయినం. ఆకలైనా ఏ అధికారీ రాలే. పిల్లలకు పాల కోసం ఏడుస్తున్నరు. మేమే బయట తిరిగి షాపులకు పోయి పాలు కొనుక్కొచ్చుకున్నం. నీళ్లు కొనుక్కున్నం. మా ఏరియాలో మయినుద్దీన్ షేట్ ఉన్నడు. వందల మందికి తిండి పెట్టిండు. కానీ, గవర్నమెంట్ వాళ్లు ఏమీ పట్టించుకోలే.
– మహ్మద్ మఖ్దూం, శంకర్ నగర్, మలక్‌పేట

ఎన్ని వానలొచ్చినా..



నీళ్లొచ్చినయ్. అప్పటికప్పుడు ఏం చేయాల్నో తోచలే. బిడ్డ ఇంటికి పోయి తలదాచుకున్న. ఇంట్లో సామాన్లే కారాబ్ అయితే, చిన్న చిన్న షాపులు నడుపుకునే మాలాంటోళ్లకు మాల్ మొత్తం పాడైపోయింది. నాకు ఈ షాపే బతుకుదెరువు. ఫోన్ కూడా నీళ్లల్లోనే పోయింది. మాకు ఆ దేవుడే దిక్కు.ఎన్నడూ ఇంత వరద రాలే. వరద రాబట్టే ఇండ్లల్లోకి వచ్చినయ్.
– షాహెదా బేగం, వినాయక వీధి, మూసానగర్

నీళ్లూ ఇయ్యలే



బతకనీకి అని నల్లగొండ జిల్లా మాల్ దగ్గర వెంకటంపేట గేట్ నుంచి సిటీకి వచ్చినం. కిరాయికి ఉంటున్నం. సుతారి పని చేసుకుంటున్నం. రెండు రోజులు ఇంట్ల నుంచి బయటికి రాలేకపోయినం. నల్లా నీళ్లు రాలే. తాగనీకి నీళ్లు లేవు. గవర్నమెంటోళ్లు పచ్చి మంచినీళ్లు ఇయ్యలే.
– రమావత్ భాగ్యలక్ష్మి



బురదలో కూరుకుపోయి

సిటీబ్యూరో: మూసీ వరద నీరు బస్తీలకు పేదలకు కన్నీరే మిగిల్చింది. సర్వస్వం కోల్పోయి వరద బురదలో కూరుకుపోయిన సామగ్రిని చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆ బడుగు జీవులకు మూసీ కృత్రిమ వరద కట్టు బట్టలు, కన్నీటి సుడులనే మిగిల్చింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోగానే ఇండ్లన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. కట్టుబట్టలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో తమ బంధువుల ఇండ్లలోకి వెళ్లి తలదాచుకున్నారు. రెండు రోజులు తర్వాత బతుకు జీవుడా.. అంటూ బస్తీలోకి వచ్చి చూస్తే.. ఇండ్లలోని ఏ చిన్న వస్తువు కూడా పనికి రాకుండా మారిపోయాయి. దుస్తులు, బియ్యం, సరుకులు, నిత్యావసరాలు బురదలో కూరుకుపోయాయి. ఫ్యాన్‌లు, కూలర్లు, గ్యాస్ పొయ్యిలు, వంట సామగ్రి ఏదీ పనికి రాకుండా మారింది. ఇంటి పైకప్పును తాకిన వరద నీరు సామగ్రినంతా మట్టిలో కూరుకుపోయేలా చేయడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

- కాంగ్రెస్ సర్కారు కుట్రతో నీట మునిగిన బతుకులు
- బురద మేటలతో నిండిన మూసీ పరీవాహక పేదల ఇండ్లు
- సర్వం కోల్పోయి కన్నీటి పర్యంతమవుతున్న బస్తీవాసులు
- ముందస్తు సమాచారం లేక తడిసి ముద్దయిన నిత్యావసరాలు
- తమ ఇండ్లను ముంచేందుకే వరదను వదిలారని ఆగ్రహం
- తమ ఇండ్లను కూలిస్తే ఎంజీబీఎస్, మెట్రోను కూడా కూలుస్తారా?
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న మూసానగర్ బస్తీ జనం

మీది బీహార్... భోజనం ఇవ్వం...

మూసానగర్ బస్తీలో ఇండ్లన్నీ నీటి మునిగి ప్రజలంతా రోడ్డున పడ్డారు. అదే బస్తీలో దాదాపు 50 మంది బీహార్‌కు చెందిన వలస కార్మికులు పదేండ్ల నుంచి నివసిస్తున్నారు. వరదలో వారు అద్దెకుంటున్న ఇండ్లకు కూడా మునిగిపోయాయి. వారంతా నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వ అధికారులు ఆదివారం ఉదయం కొంతమందికి భోజనం, పాలు, తాగునీరు సరఫరా చేశారు. మూసానగర్‌లో ఉండే బీహార్ వలస కార్మికులకు మాత్రం ఇవ్వలేదు. మీరు ఇక్కడి వారు కాదు.. కాబట్టి మీకు ఆహారం ఇవ్వమని తేల్చిచెప్పినట్లు వారు వాపోతున్నారు.

వరద పాలైన పుస్తకాలు.. బడికి పోయేదెట్లా..?

వరద ముంచెత్తి ఇండ్లనీ మునిగిపోవడంతో చిన్నారుల పుస్తకాలన్నీ తడిచి ముద్దయ్యాయి. నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రేపటి నుంచి తాము బడికెట్లా పోవాలని బస్తీలకు చెందిన చిన్నారులు ప్రశ్నిస్తున్నారు. తమ తల్లిదండ్రులు మళ్లీ పుస్తకాలు కొనియ్యలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద వస్తుందని ముందుగా చెప్తే పుస్తకాలను తీసుకుపోయేవాళ్లమని నిట్టూరుస్తున్నారు. రూ. వేలు వెచ్చించి తమ పిల్లలకు కొనిచ్చిన పుస్తకాలు నీటి పాలయ్యాయని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.



సమాచారం ఇచ్చి ఉంటే..

జంట జలాశయాల గేట్లు ఎత్తి భారీ వరదను మూసీలోకి వదులుతున్నట్లు అధికారులెవరూ ప్రకటించలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న వరదలొచ్చిప్పుడు ఇండ్లలోకి వచ్చి సమాచారం చెప్పేవారని.. మునుపెన్నడూ రానంత వరద వచ్చినా ముందుగా చెప్పకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తమ ఇండ్లను ముంచేందుకే సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే తమ బతుకులను రోడ్డుపాలు చేశారని మండిపడుతున్నారు. .. మిగతా II లో



కాంగ్రెస్‌ది మోసపు పాలన

- హైదరాబాద్ జిల్లా వారు కాదు.. ఎన్నికల తెల్లారి ఎవ్వరూ ఇక్కడ ఉండరు
- ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకునేది బీఆర్ఎస్ మాత్రమే
- అబద్ధాలతో గద్దెక్కి హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- షేక్ పేట సమత కాలనీలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంచిన కేటీఆర్


స్థానికులకు 'కాంగ్రెస్ బకాయి కార్డు'లను అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో/వెంగళ్‌రావునగర్, సెప్టెంబరు 28 (నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ మంత్రులంతా టూరిస్టులే అని, ఎన్నికలు అయిపోగానే వాళ్లంతా గాయబ్ అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టూరిస్టు మంత్రులు ఎవరూ హైదరాబాద్ జిల్లా వారు కాదని..ఎన్నికల తెల్లారి ఎవరూ ఇక్కడ ఉండరని..ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునేది బీఆర్ఎస్ నేతలే అని స్పష్టం చేశారు. అందుకే గతంలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించారని..జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు విజయాన్ని చేకూర్చాలని ఆయన ప్రజల్ని కోరారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ విజయాన్ని కాంక్షిస్తూ షేక్‌పేట్ డివిజన్ సమతాకాలనీలో కేటీఆర్ పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ 'కాంగ్రెస్ బకాయి కార్డు'లను ప్రజలకు అందించి, కాంగ్రెస్ మోసపూరిత పాలనను వివరించారు. దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో చెంప పెట్టు లాంటి సమాధానం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. కేటీఆర్‌ను కలవడానికి యువత భారీగా తరలివచ్చింది. ఇంటింటికీ బాకీ కార్డులు పంచిన కేటీఆర్ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు దృష్టికి తీసుకొచ్చారు.


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మళ్లీ కరెంట్ కోతలు

ఇంటింటి పర్యటన సందర్భంగా కేటీఆర్ దృష్టికి పలువురు స్థానికులు సమస్యలపై ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 'కేసీఆర్ ప్రభుత్వంలో పారిశుధ్య పనులు రోజూ జరిగేవి అయితే ఇప్పుడు నాలుగు రోజులు గడిచినా.. చెత్త తీసేవారే కరువయ్యారు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'మురుగునీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ కోతలు మళ్లీ మొదలయ్యాయి, ఇన్వర్టర్లు కొనుక్కుంటున్నాం' అని పలువురు మహిళలు, పెద్దలు కేటీఆర్‌తో తమ బాధను వ్యక్తపరిచారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న కేటీఆర్.. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కాగా, కేటీఆర్ ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను స్థానికులకు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు ఉన్నారు.

మమ్మల్ని యేటి పాలు చేసిండ్రు.!



- పైనుంచి నీళ్లు వదిలేముందు చెప్పొద్దా..
- 24 గంటల పాటు నీళ్లలోనే ఉన్నం..
- తినడానికి తిండి లేదు.. తాగడానికి నీళ్లు లేవు..
- మూసీ వరద బాధితుల ఆవేదన › II
- ప్రభావిత కాలనీల్లో పరిస్థితులు దుర్భరం..

దేవాలయాలను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ సర్కారే

మన గుడి... మన బలంలో మాజీ మంత్రి హరీశ్‌రావు › II



ప్రభుత్వ విధానంతో వేలాది మందికి శాపం

- 'ఎలివేటెడ్', 'రేడియల్ రోడ్డు' భూ బాధితుల నిరసన
- హెచ్ఎండీఏ రేడియల్ రోడ్డుకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- అదే సమయంలో బాధితుల ఆందోళన
- ప్రజాభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలంటూ విజ్ఞాప్తి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులు ఓవైపు శంకుస్థాపనలు, మరోవైపు రాస్తారోకోలతో సాగాయి. ఆదివారం అవుటర్ రింగు రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకి గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రింగు రోడ్డుకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయగా... అదే సమయంలో నార్త్ సిటీ వైపు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ భూ బాధితులు రోడ్డెక్కారు. నగరంలో కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి... ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుతో సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నామని ఆవేదనతో రోడ్డెక్కారు. అదేవిధంగా రేడియల్ రోడ్డు భూ బాధితులు కూడా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు.



భూ బాధితుల నిరసన

ఇప్పటి వరకు భూసేకరణ పూర్తి కాలేదు

18 కిలోమీటర్ల పొడవున నార్త్ సిటీ మీదుగా హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి ఏడాదిన్నర కిందట శంకుస్థాపన చేశారు. నగరానికి తొలి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుగా ఆవిష్కరించారు. కానీ ఇప్పటి వరకు భూసేకరణ పూర్తి కాలేదు. అయితే గడిచిన ఏడాది నుంచి నగరంలో ఎలివేటెడ్ కారిడార్‌కు నిరసనగా వందలాది మంది భూ బాధితులు ఆందోళనలు చేస్తున్నారు. 200 ఫీట్ల వెడల్పు ఉన్న రోడ్డు ప్రతిపాదనను 100–150 ఫీట్లకు తగ్గించాలని, అదేవిధంగా భూ పరిహారం అంశాన్ని తేల్చాలనే ప్రధాన డిమాండ్లతో రాజీవ్ రహదారి భూ పరిరక్షణ ..మిగతా II లో

కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామ రక్ష

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


› II

మమ్మల్ని యేటి పాలు చేసిండ్రు.!

- పైనుంచి నీళ్లు వదిలేముందు చెప్పొద్దా..
- 24 గంటల పాటు నీళ్లలోనే ఉన్నం..
- తినడానికి తిండి లేదు.. తాగడానికి నీళ్లు లేవు..
- మూసీ వరద బాధితుల ఆవేదన
- ప్రభావిత కాలనీల్లో పరిస్థితులు దుర్భరం..



వరద నీటిలో అవస్థలు పడుతున్న మూసీ పరివాహక ప్రాంత ప్రజలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): 'కట్టుకున్న బట్టలు తప్ప ఏమీ మిగలలేదు. కేవలం వాళ్లు వీళ్లు ఇచ్చిన అరటిపండ్లు తిని బతుకుతున్నం. మమ్మల్ని పట్టించుకున్నదెవరు. ఈ వైపు వచ్చిందెవరం'టూ ఓ మహిళ ఆవేదన. 'ఉన్న ఒక్క దుకాణం పోయింది. ఇద్దరు పిల్లలతో ఎలా బతకాలి. వరద వచ్చేది ముందే అధికారులకు తెల్వదా.. ఇదంతా హైడ్రాతో కలిసి ప్రభుత్వం చేస్తున్న డ్రామా అనిపిస్తున్నది. వరద వచ్చేది చెప్పి మమ్మల్ని హెచ్చరించలేదు ఎందుకు.. ఇప్పుడు మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు. ఇదేం సర్కార్' అంటూ ఆగ్రహించిన ఓ మెకానిక్. 'తినడానికి తిండి లేక.. తాగడానికి నీళ్లు లేక విలవిలలాడుతున్నం. మా ఇళ్లన్నీ బురదతో నిండినయ్. ఒక్కరంటే ఒక్క అధికారి కూడా రాలేదు. ఓట్ల కోసమైతే వస్తరు కానీ ఈ పరిస్థితిలో మా జీవితాలు బాగు చేయడానికి ఎవరూ రారా' అంటూ ప్రశ్నించిన మధ్యతరగతి మహిళ. ఇది మూసీ వరద బాధితుల ఆవేదన. రేవంత్ సర్కార్ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను యేటి పాలు చేశారంటూ రోదిస్తున్నారు.

వారి ఆవేదన అరణ్యరోదన. వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ రోజంతా గడిపి ప్రవాహ ఉధృతినుంచి తప్పించుకుని తమను తాము కాపాడుకోవడానికి మిద్దెలెక్కి, మేడలెక్కి, మసీదులో తలదాల్చుకుని తమ బతుకులు ఎలా దేవుడా అంటూ జీవనమరణపోరాటం చేశారు బడుగుజీవులు మూసీ వరద బాధితులు. మూసారంబాగ్, మూసానగర్, శంకర్‌నగర్, అంబేద్కర్‌నగర్, వినాయకవీధి, కృష్ణానగర్ తదితర బస్తీల్లో ఎక్కడ చూసినా బురదమయమే. రెండురోజుల నుంచి తమను ముంచెత్తిన వరద భయం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతూ తమ ఇళ్లు, వాకిళ్లు కడుక్కుంటూ కనిపించారు. ఎవరిని కదిలించినా కన్నీళ్లే. వరద వచ్చి అన్నీ తీసుకుపోయింది అంటూ అందరి నోటి నుంచి ఒకటే మాట. కట్టుబట్టలతో మిగిలాం. ఉన్నబట్టలు పనికిరాకుండా పోయాయి. ఇంట్లో వస్తువులేదీ మిగలేదు. తామెలా బతకాలి. తమకు దిక్కెవరంటూ రోదిస్తున్నారు. పైనుంచి నీళ్లు ముందే వదులుతున్నామంటూ ముందే తెలిసినా అధికారులు మాకు ఎందుకు చెప్పలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా బతుకులను ఏటి పాల్జేసినోడు బాగుపడతడా అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. చిన్నచిన్న పిల్లలతో ఎలా నెట్టుకురావాలంటూ తమ బతుకులను చూడండంటూ ఇళ్లల్లోకి తీసుకెళ్లి బురద మయమై, ముక్కులు అదిరిపోయే దుర్గంధంతో వరద తగ్గిన తర్వాత వారి నిత్యజీవనం అత్యంత దయనీయంగా ఉంది.

ముందే చెబితే సర్దుకునేవారేమో..!

గతంలో ఎప్పుడూ ఇంత వరద రాలేదని స్థానికులు చెబుతున్నారు. వరద వచ్చినా రోడ్ల పైకి పారేది తప్ప ఇళ్లల్లోకి వచ్చిన దాఖలేలేవని అంటున్నప్పటికీ వారిలో మాత్రం ఇంకా వరద భయం కనిపిస్తోంది. నమస్తే తెలంగాణ బృందం ఆయా కాలనీల్లో పర్యటించినప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు చాలా భయానకంగా కనిపించాయి. ముఖ్యంగా ప్రతీ ఇల్లు బురదమయంగా కనిపిస్తూ ఒక్కొక్కరూ ఇళ్లు సరిదిద్దుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. వారి ఇళ్లల్లో వస్తువులన్నీ పూర్తిగా నీటిలో మునిగి పనికిరాకుండా పోయాయి. నిత్యావసరాలు కూడా వరదలో కొట్టుకుపోవడంతో రెండురోజుల నుంచి స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న అరటిపండ్లు, బ్రెడ్‌లతో కాలం గడుపుతున్నారు. మరి సర్కార్ ఏం చేస్తున్నదంటూ ఎవరైనా ఇక్కడకు వస్తే కదా అంటూ అడుగుతున్నారు. రోడ్డుమీద నుంచే వెళ్లిపోయారు తప్ప తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదని, ఇంత చెత్త సర్కార్ చూడనే లేదంటూ గతంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ సర్కార్ పదివేలు ఇచ్చిన సందర్భాలు గుర్తు చేసుకున్నారు.

ఇదంతా పక్కా ప్లానేమో..!

వరదగుప్పిట నుంచి బయటపడుతున్న బస్తీప్రజలు ప్రస్తుతం మరో అనుమానం కూడా వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడిన మాటలు వినిపిస్తూ మూసీ వరదలతో ఎక్కడెక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలో అర్థమవుతున్నదని అన్నదానికి ఇదంతా ప్రభుత్వమే చేయిస్తున్నదా అని అడుగుతున్నారు. గండిపేట దగ్గర రోజుల తరబడి నీళ్లు ఆపి ఒక్కసారిగా వదిలితే మా కాలనీలన్నీ మునిగిపోతే ఇవి సర్కారోళ్లు తీసుకోవచ్చనే ఆలోచిస్తున్నారేమో అని వాళ్లలో వాళ్లే చర్చించుకుంటున్నారు. తాము ఎప్పటినుంచో ఇక్కడ ఉంటున్నామని తాము కొనుక్కున్న ఇళ్లు ఎందుకిస్తాం.. మేమెక్కడికి పోతాం అంటూ ప్రశ్నిస్తున్నారు.

కట్టుకోవడానికి బట్టలు లేవు, నీళ్లు కూడా లేవు..

రాత్రి ఒక్కసారిగా నీళ్లు వచ్చేసరికి ఇంట్లో సరుకులన్నీ అందులో కొట్టుకుపోయినయ్. అసలు బయటకు రాలేని పరిస్థితి. చుట్టూ నీళ్లు.. ఎటుపోవాల్నో అర్థం కాదు. కట్టుకున్న బట్టలతోనే బయటకు వచ్చేశాం. ఎదురుగా ఉన్న వాళ్ల ఇంట్లో మేడ పైకి ఎక్కి రాత్రంతా ఉన్నాం. తెల్లవారిన తర్వాత కూడా ఎవరూ వచ్చి సాయం చేయలేదు. ఒకరిద్దరు సర్కారోళ్లు రోడ్డుపైకి వచ్చిపోయింఁడ్రు తప్ప మావైపు చూసిందే లేదు. తిండి లేదు. నీళ్లు లేవు. ఇప్పటికి కూడా నల్లా వదులుతలేరు. చాలా ఇబ్బంది అయితుంది. కట్టుకునే బట్టలు కూడా నీళ్లలో కొట్టుకుపోవడంతో ఏం చేయాలో తోస్త లేదు. కట్టుబట్టలతోనే మూడురోజుల నుంచి ఉంటున్నం.

–అఫ్సర్‌బీబీ, వినాయకవీధి

ఏమైతదోనని భయమైంది..

మొన్నటినుంచి తిండి లేదు. ఇంట్లో వస్తువులన్నీ తడిసిపోయాయి. నీళ్లు ఒక్కసారిగా వచ్చేసరికి నన్ను కుర్చీమీద కూర్చోబెట్టి బంగ్లా పైకి తీసుకుపోయింరు. చిన్నచిన్నపిల్లలకు ఏమైతదోనని భయమైంది. మేము ఇక్కడకు వచ్చి నలభై ఏళ్లయింది. ఎప్పుడూ ఇట్ల జరగలేదు.రోడ్డు మీద నుంచి నీళ్లు పోయేది కానీ ఇళ్లల్లోకి నీళ్లే రాలేదు. నీళ్లు వచ్చేటప్పుడు సర్కారోళ్లు వచ్చి ముందుగా చెప్పి బయటకు పంపేది. కానీ ఇప్పుడసలు ఎవరూ రాలే. కనీసం తిండి కూడా పెట్టలే. పొద్దుగాల ఎవరో వచ్చి అరటిపండ్లు ఇచ్చిపోయింరు. అంతే తప్ప మా దిక్కు చూసినోళ్లే లేరు. మాకెందుకు చెప్పలేదని అధికారులను అడిగితే మాకు కూడా తెల్వదంటే వాళ్లపై కోపం చేసిన. ఇదేం సర్కార్. గతంలో నీళ్లు వస్తే మా పక్కవాడోళ్లను వేరే దగ్గరకు తీసకపోయి వాళ్లకు తిండి పెట్టేది. కానీ ఈసారి ఎక్కడకు పోవాల్నో తెలవక నీళ్లలోనే బతికినం.

–లక్ష్మీబాయి,శంకర్‌నగర్

మమ్మల్ని ఏట్ల పడేసిండ్రు

నలభై ఏళ్ల కిందట ఇక్కడకు వచ్చి కొనుక్కున్నం. ఎప్పుడునీళ్లు వచ్చినా రోడ్లపైకి వచ్చేది. నీళ్లు వస్తే అధికారులు వచ్చేది. మైకుల్లో చెప్పేది. పోలీసులతో మమ్మల్ని బయటకు పంపించేది. కానీ మా ఇంట్లోకి మాత్రం నీళ్లే రాలే. ఇప్పుడు ఇంతగనం నీళ్లు ఇదే మొదటిసారి వచ్చినయ్. వరద వదిలేసరికి నీళ్లు వచ్చినయంటున్నరు. మమ్మల్ని ఏట్ల పడేసింఁడ్రు. నీళ్లు వచ్చేసరికి అన్నం తిందామనుకుంటూ ప్లేట్‌లో పెట్టుకుని నీళ్లు ఒక్కసారిగా ఇంట్లోకి రావడంతో ఏం చేయాలో తెలియక తినే పళ్లెం వదిలేసి పరిగెత్తాను. ఇంట్లో వాళ్లను తీసుకుని బయటకు పోదామంటే అసలు దారి లేదు. మెట్లెక్కి పైనే ఉండిపోయాం. 24 గంటలు నీళ్లల్లోనే ఉన్నాం. కట్టుబట్టలతో మిగిలిపోయాం. ఎట్లనో అట్ల బయటపడి దగ్గర ఉన్న మసీదులో పడుకున్నం. మాకు అసలు ఎవరూ సాయం చేయలేదు. పునరావాస కేంద్రాలు కూడా తెలవదు. అసలు మాకు చెప్పేందుకు అధికారులు ఇక్కడకు రావాలి కదా... ఎవరూ రాలేదు.

– నజ్మాబేగం,శంకర్‌నగర్

ఇల్లంతా వాసన.. దోమలతో చచ్చిపోతున్నం..

ఇంట్లోకి నీళ్లు వచ్చాయి. 24 గంటల పాటు అట్లనే ఉన్నం. దుర్వాసన, దోమలతో కరెంట్ లేక, నీళ్లు లేక నానా అవస్థలు పడ్డాం. ఇప్పుడు కూడా ఇల్లు వాసన అట్లనే ఉన్నది. అసలు గతంలో ఎప్పుడూ ఇంతగనం నీళ్లే రాలేదు. మూసీ బాగా పొంగితే మా దగ్గరకు నీళ్లు రోడ్లపైకి వచ్చేవి కానీ ఇళ్లలోకి రాలేదు. కానీ ఇప్పుడు మాత్రం మా దగ్గరకు నీళ్లు రావడానికి పైనుంచి వరద రావడంతో మ్యాన్‌హోల్స్ పొంగి , ఇంట్లో ఉన్న బాత్‌రూమ్‌లు, మోరీల్లో కూడా నీళ్లు పొంగి వచ్చాయి. మూసీ పక్కకు రిటైనింగ్ వాల్ కడితే ఈ సమస్య రాదు. ఓట్ల కోసం వస్తరు. మళ్లీ ఈ గల్లీలోకే రారు. ఇదేం లీడర్లు. ఇప్పటి వరకు మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు.

– నూర్‌ఖియా,శంకర్‌నగర్

లక్షల రూపాయలు నష్టపోయాం..

గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద వరద రాలేదు. మా ట్రావెల్స్‌కు సంబంధించిన మూడు బస్సులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటిని బాగుచేయడానికి లక్షలరూపాయల ఖర్చవుతుంది. వరద వచ్చే ముందు అధికారులు వచ్చి చెప్పేవారు. ఇక్కడ ఉన్న గ్యారేజీల్లోకి వచ్చిన నీళ్లతో కార్లన్నీ ఖరాబైనయ్. ఆల్టో, ఐ20 రెండుకార్లు వరదలో కొట్టుకుపోయినయి. బస్సుల ఇంజన్లన్నీ దెబ్బతిన్నయ్. వరదగురించి ముందే చెబితే మేం వేరే దగ్గర పెట్టుకునేటోళ్లం. మాసామాన్లు కాపాడుకునేటోల్లం.

–హాజీ, మూసారంబాగ్

అర్ధరాత్రి దాటినా పబ్ నిర్వహణ



జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఊల్ పబ్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 28: అర్ధరాత్రి దాటినా పబ్ మూయని నిర్వాహకులతోపాటు సిబ్బందిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో పీఎస్‌కు సమీపంలో ఉన్న ఊల్ పబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మద్యం సరఫరా చేయడంతో పాటు మ్యూజిక్ ప్లే చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తెల్లవారుజామున పబ్‌కు వెళ్లిన పోలీసులు యజమాని చిలంకుర్తి వంశీ, మేనేజర్ వీరగోని వంశీతోపాటు బౌన్సర్లపై కేసు నమోదు చేశారు.

జీవితంలో చాలా తప్పులు చేశానంటూ..

యువకుడి సెల్ఫీ సూసైడ్



బంజారాహిల్స్, సెప్టెంబర్ 28: 'జీవితంలో చాలా తప్పులు చేశాను.. ఇలాంటి తప్పులు మళ్లీ చేయకుండా ఉండాలంటే ఆత్మహత్య ఒక్కటే మార్గం..' అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్‌కు చెందిన ఓ యువతి సీరియళ్లలో నటిస్తూ జూబ్లీహిల్స్‌లోని ప్రశాంత్‌నగర్‌లో బంధువుల ఫ్లాట్‌లో ఉంటోంది. ఆమెకు ఫిబ్రవరిలో సవాయ్ సింగ్(30) అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారడంతో జూలైలో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఈనెల 26న ఫ్లాట్‌లో ఉండే భార్యాభర్తలు ఫంక్షన్ కోసం పంజాబ్‌కు వెళ్లగా మరుసటిరోజు ఉదయాన్నే సవాయ్ సింగ్ యువతి ఫ్లాట్‌కు వచ్చాడు. ఇద్దరూ కలిసి కాఫీ తాగారు. ఉదయం 11గంటల సమయంలో యువతి ఆఫీస్‌కు వెళ్లగా తాను కూడా ఆఫీసుకు వెళ్తున్నానంటూ సవాయ్ సింగ్ బయటకు వెళ్లిపోయాడు. కాగా సాయంత్రం ఫ్లాట్‌కు వచ్చిన యువతి లోనికి వెళ్లిచూడగా డైనింగ్ హాల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సవాయ్‌సింగ్ కనిపించాడు. దీంతోషాక్‌కు గురైన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించగా ఉదయం బయటకు వెళ్లిన సవాయ్‌సింగ్ కాసేపటికి తిరిగి వచ్చి వెనకడోర్ నుంచి ఫ్లాట్‌లోకి ప్రవేశించి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తేలింది. కాగా చనిపోయేందుకు ముందు ఇన్‌స్టాగ్రామ్‌లో సవాయ్‌సింగ్ వీడియో పోస్ట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాను జీవితంలో అనేక తప్పులు చేశానని, మళ్లీమళ్లీ అలాంటి తప్పులు చేస్తూ జీవితం గడపలేనని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28 ః శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చినట్లు ఎయిర్‌పోర్టు ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం 6.06 గంటలకు ఎయిర్‌పోర్టు భద్రత విభాగానికి బాంబు బెదిరింపు ఈ మెయిల్ రావడంతో, వెంటనే అప్రమత్తమైన అధికారులు, పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేసి, ఎలాంటి బాంబులేదని తేల్చారు. దీంతో అధికారులు, భద్రత సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గతకొంత కాలంగా ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఇలా తప్పుడు మెసేజీలు పంపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

ఔటర్‌రింగ్ రోడ్డుపై ప్రమాదంలో ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28 ః ఔటర్‌రింగ్ రోడ్డుపై తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన దేవరంపల్లి అశోక్‌కుమార్(38)తోపాటు అతడి కుమార్తె నితిషా, సోదరుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి (ఉద్యోగి) ముగ్గురు కలిసి కారులో హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి వద్దకు రాగానే కారు ఔటర్‌రింగ్ రోడ్డు రేలింగ్‌ను ఢీకొట్టడంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతిన్నది. ముందు సీట్లో కూర్చున్న అశోక్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నితిషాకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఐటీ ఉద్యోగి అశోక్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. అశోక్‌కుమార్ భార్య జనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

హయత్‌నగర్, సెప్టెంబర్ 28 ః ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కోహెడ గ్రామానికి చెందిన రసూరి ఐలయ్య, కుమారుడు రసూరి నవీన్‌కుమార్ (19), మంగళ్‌పల్లిలోని శ్రీఇందూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంట్లోని గదిలో ఎవరూ లేని సమయంలో నవీన్‌కుమార్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ సర్కారే

మన గుడి... మన బలంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

ఉప్పల్, సెప్టెంబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేవుడిపై ఉన్న నమ్మకం, విశ్వాసమే సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. దేవాలయాల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ శిల్పారామంలో 'మన గుడి-మన బలం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ దేవాలయాలకు నిధులు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆలయాల్లో సిబ్బందికి, అర్చకులకు వేతనాలు ఇచ్చి ఆదుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తచాటి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల పాలన తెలంగాణకు శ్రీరామ రక్షగా నిలిచిందన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని హుడాకాలనీలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షత ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గ్యారెంటీ కార్డుల పేరుతో అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్,రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వస్వం కోల్పోయి..

(మొదటిపేజీ తరువాయి)

బంధువుల ఇండ్లలో తలదాచుకున్నం

ఒక్కసారిగా ఇండ్లలోకి వరద నీరు వచ్చింది. క్షణాల్లోనే వరద తీవ్రత పెరగడంతో దిక్కుతోచని స్థితిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశాం.ఎక్కడికి వెళ్లాలో తెలియక చుట్టాలు, తెలిసిన వాళ్ల ఇండ్లలో తలదాచుకున్నాం. జంట జలాశయాల గేట్లను ఎత్తడం వల్ల వరద ఇండ్లలోకి వస్తుందని మాకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. ముందుగా చెప్పి ఉంటే ఇంట్లో సామగ్రిని కొంతైనా తీసుకెళ్లేవాళ్లం. నిత్యావసరాల్లో కొంతైనా మిగిలేది. నిత్యావసరాలతో పాటు ఇంట్లో సామగ్రి మొత్తం బురదమయం అయింది. కట్టుకున్న బట్టలు తప్పా ఏదీ మిగలలేదు. మూసానగర్‌లోని 300 పైగా ఇండ్లు నీట మునిగాయి. నాకు రూ.2 లక్షల దాకా నష్టం జరిగింది. మరో రెండేండ్లు కష్టపడితేనే సామగ్రిని కొనగలుగుతాం.

–షాహీన్, మూసానగర్ బస్తీ

తింటున్న కంచాలు వదిలేసి పరుగులు తీశాం...

శుక్రవారం సాయంత్రం 5 గంటలప్పుడు కుటుంబమంతా కలిసి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా వరద నీరు ఇంట్లోకి వచ్చింది. ఒకేసారి మోకాలి లోతు నీరు రావడంతో తింటున్న కంచాలతో సహా ఇక్కడే వదిలేసి బయటకు పరుగులు తీశాం. ఎక్కడ చూసినా వరద నీరు ఉండటంతో కట్టుబట్టలతోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని మా అక్క వాళ్ల ఇంటికి వెళ్లాం. 25 ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఇంత మొత్తంలో వరద ఎన్నడూ రాలేదు. ఆటో నడుపుకొంటూ పిల్లలను చదివిస్తున్నా. వారం కిందటే కూతురు చదువుకు రూ.12వేలు అప్పు చేసి పుస్తకాలు కొన్నా. అవన్నీ తడిసి ముద్దయ్యాయి. బియ్యం, సామగ్రి సహా మొత్తం బురదలో మునిగిపోయాయి. నిన్నటి నుంచి ప్రభుత్వ అధికారులెవరూ ఇక్కడికి రాలేదు. కనీసం భోజనం, తాగునీరు కూడా ఇవ్వలేదు. నిన్నటి నుంచి పిల్లలు ఖాళీ కడుపుతో అలమటిస్తున్నారు. బిస్కెట్లు కొనిచ్చి వారిని వారిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాపై ఎందుకు కక్ష కట్టిందో అర్థం కాట్లేదు.

– పోలె వెంకటేశ్, మూసానగర్ బస్తీ

కప్పకోనీకి ఏమీ ఇయ్యలే

బ్రిడ్జి కట్టనీకి వచ్చినం. గోల్నాక స్కూల్లో ఉన్నం. కప్పుకోనీకి దుప్పటి లేదు. పక్కకు ఏమీ లేదు. గచ్చు మీద పడుకున్నం.మూడు రోజులు తిండి పెట్టారు. పని చేయనీకి వచ్చినం. గవర్నమెంటోళ్లే ఇక్కడ గచ్చే వేశ్రను.

– శంకరమ్మ, అంబేద్కర్ కాలనీ

ఏడాదిలో 31,533 కేసులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్‌రేట్‌లో స్పష్టమైన తగ్గుదల కనిపించిందని, ఇది పోలీసుల నిబద్ధతకు నిదర్శనమని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ. ఆనంద్ అన్నారు. ఆదివారం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ సైబర్ క్రైమ్ నియంత్రణలో హైదరాబాద్ పోలీసులు ప్రతిభ కనబరిచారని, కేసుల సంఖ్య తగ్గడమే కాకుండా డిటెన్షన్ రేటు కూడా బాగా పెరిగిందని ఆనంద్ చెప్పారు. మొత్తం అన్ని కేసుల్లో గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 31,533 కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే 17శాతం తగ్గుదల నమోదైనట్లుగా ఆనంద్ చెప్పారు. ఇదేస్ఫూర్తితో హైదరాబాద్‌ను నేరరహిత నగరంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీలు జోయల్‌డేవిస్, పరిమళహనా నూతన్, డీసీపీలు శ్వేత, శిల్పవల్లి, ఎస్‌ఎం.విజయ్‌కుమార్, రశ్మిపెరుమాళ్, బాలస్వామి, స్నేహా మెహ్రా, అపూర్వరావు, రాహుల్‌హెగ్డే, వెంకటేశ్వర్లు, దారాకవిత, లావణ్యానాయక్‌జాదవ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ కోసం అంబులెన్స్ నిలిపివేత

సిటీబ్యూరో: తన కన్వాయ్‌ని ఆపి సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పుడప్పుడు సుద్దులు చెబుతుంటాడు.. సుద్దులు చెప్పే రేవంత్‌రెడ్డి కన్వాయ్ వెళ్తుంటే సామాన్య పౌరుల వాహనాలను ఎక్కడికక్కడే పోలీసులు ఆపేస్తున్నారు. అందులో భాగంగా అంబులెన్స్‌లను కూడా వదిలేయడం లేదు.. ఆదివారం సీఎం ఫ్యూచర్‌సిటీలో రేడియల్ రోడ్ల శంకుస్థాపనకు వెళ్తుండగా.. ఆయన పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే పోలీసులు ఆపేశారు. అందులో అంబులెన్స్ కూడా ఉంది. అంబులెన్స్‌ను కూడా ఆపేయడంపై సోషల్‌మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు.

అన్నీ కోల్పోతున్నాం..

(మొదటిపేజీ తరువాయి)

జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం వీరి గోడును వినిపించుకోలేదు. కనీసం భూ బాధితులు వ్యతిరేకించడానికి గల ప్రధాన కారణాలపై ప్రభుత్వం చర్చించనూ లేదు. భూసేకరణ చట్టం ద్వారా దక్కాల్సిన పరిహారం కంటే... ప్రాజెక్టు వెడల్పును తగ్గించడం ద్వారా భూ యజమానులకు ఊరట కలుగుతుందని చెబుతున్నా, అటు ప్రభుత్వ పెద్దలు గానీ, ఇటు హెచ్ఎండీఏ యంత్రాంగం గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. కాగా, జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు ఏడాది నుంచే ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ఫ్యూచర్ సిటీకి మెరుగైన రోడ్లను నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ స్థాయి రవాణా సదుపాయాలు కల్పిస్తున్నామని గ్రీన్ ఫీల్డ్ హైవేను ఆవిష్కరించారు. కానీ నార్త్ సిటీ పేరిట గడిచిన సాగుతున్న ఆందోళనలను ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కారు పట్టించుకోలేదు. కనీసం భూ బాధితులు అడుగుతున్నట్లు పరిహారం, ప్రాజెక్టు వెడల్పుపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతోనే రాజీవ్ రహదారి జేఏసీ నాయకులు తేలుకుంట సతీశ్, ఈశ్వర్‌గౌడ్ సారథ్యంలో భూబాధితులు ఆందోళనకు దిగారు. తూంకుంట అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించిన బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అస్పష్టమైన విధానాలతో ఈ ప్రాంతంలో వందలాది మంది భూ యజమానులు జీవనోపాధిని కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వెంగళరావునగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్, సెప్టెంబర్ 28 :బీఆర్ఎస్ పార్టీ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీరామంగా కృషి చేసిందన్నారు.డివిజన్‌లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కులను కాపాడాలి

బంజారాహిల్స్,సెప్టెంబర్ 28: గీత కార్మికుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆబ్కారీ అధికారుల తీరుతో వందలాది గౌడ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో మునిగిపోతున్నాయని బంజారాహిల్స్ కల్లుగీత సహకారసంఘం ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సహకార సంఘం సమావేశంలో భాగంగా 186మంది టాపర్లు, నాన్ టాపర్లు, సొసైటీ సభ్యులకు రావాల్సిన వాటాలను పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా గౌడ కులస్థులకు అన్యాయం చేస్తూ వారికి రావాల్సిన వాటాలు అందించలేదని, ఇకనుంచి క్రమపద్ధతిలో వాటాలను పంపిణీ చేస్తామని, సహకర సంఘం ఆధ్వర్యంలో కల్లు దుకాణాలను నిబంధనలకు లోబడి నడిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఎక్సైజ్ సూపరెండెంట్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ టీసీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలరాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోతులు, బురదమయం



కాటేదాన్‌లో గోతులమయంగా మారిన రోడ్లపై నిలిచిపోయిన వర్షం నీరు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు పట్టించుకోని అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: ఆ ప్రాంతాల్లో ప్రయాణం అంటేనే నరకయాతనగా మారుతుంది... మోకాళ్లల్లోతూ గుంతలు, బురదమయంగా ఉన్న రోడ్లపై ప్రయాణించేందుకు ప్రజలు, వాహనదారులు జంకుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామికవాడ, సాయిబాబానగర్, శ్రీరామ్‌నగర్, ఆదర్శ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పాడ్డాయి. కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయి నీరంతా రోడ్లపై నిలిచిపోవడంతో కాలనీలు, బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఈ ప్రాంతంలో కంపెనీలు ఉండడంతో భారీ వాహనాలు సైతం అధికంగా ప్రయాణిస్తుంటాయి. కొన్ని వాహనాలు ఈ గోతుల్లో చిక్కుకుపోయి ముందుకు కదలలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

గుంతలతో పరేషాన్...

రోడ్లు కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడడంతో ఈ దారుల్లో నడిచేందుకు సైతం వీలు లేకుండాపోయింది. మోకాళ్లలోతు గుంతల్లో ప్రజలు వాహనాలను నడిపిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గోతులమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయడం, మట్టిని పోయడం తాత్కాలిక పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బురదమయంగా మారిన శ్రీరామ్‌నగర్ వెళ్లే రహదారి

భారీ వర్షాలతో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 15 వద్ద

నిలిచిన వరదనీరు

శంషాబాద్ రూరల్: భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాలలోని చెరువుల నుంచి భారీ ఎత్తున నీరువచ్చి శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ ఎగ్జిట్ రోడ్డుపై నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు భారీగా నీరు నిలవడంతో రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలను ఒక వైపు నుంచి పంపిస్తూ మరో వైపు రోడ్డును అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెద్దగోల్కొండ ఓఆర్ఆర్ వద్ద నీరు నిలవడంతో ఒకవైపు రోడ్డును మూసివేసిన అధికారులు

'లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దు'

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చుపెడుతూ గిరిజనాన్ని ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ అన్నారు. లంబాడీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీలు, ఆదివాసీలు వేరుకాదని, రెండు వర్గాలను షెడ్యూల్ తెగల్లోనే చేర్చబడ్డారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చరిత్ర లంబాడీలకు ఉందని, రాజ్యాంగ బద్ధంగా ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు దక్కాయని గుర్తు చేశారు. అలాంటి వర్గాలపై మాజీ ఎంపీ సోయం బాపురావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు కుట్రలు పన్నుతున్నారని, లంబాడీల జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. లంబాడీ పొలిటికల్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమావత్ లాలు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ బాలాజీ నాయక్, గిరిజన సంఘం అధ్యక్షుడు ముడావత్ ధర్మా నాయక్, ఓయూ జేఏసీ నాయకులు సురేశ్ నాయక్, హన్మంతు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్కందమాత అలంకరణలో..



స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, శ్రీనగర్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబదేవి తల్లి



జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



దుర్గామాత పూజల్లో ..బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని ఆలిపోచమ్మ దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆదివారం పూజల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పూజల్లో కౌలన్ సుభాష్‌రెడ్డి, చిట్టిగారి రమేష్, మ్యాడం రామేశ్వర్‌రావు, కొండమీది హరినాథ్, వెంకటేష్, సదా పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28:

యువతకు భగత్‌సింగ్ ఆదర్శం



హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద భగత్‌సింగ్ కటౌట్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్,సెప్టెంబర్28: భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ అన్నారు. భగత్‌సింగ్ సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో భగత్‌సింగ్ కటౌట్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నుంచి దేశ విముక్తి చిరు ప్రాయంలోనే ఉరికొయ్యలను ముద్దాడిన పోరాట యోధుడు భగత్ సింగ్ అని కొనియాడారు.భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, వైద్యం,ఉపాధి కోసం యువత ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు సల్మాన్ బేగ్,షేక్ మహమూద్,హేమంత్ శంషుద్దీన్,మహేష్, అనిల్‌కుమార్,విజయ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ అడుగు జాడలో నడవాలి



మైలార్‌దేవ్‌పల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోని వారి అడుగు జాడల్లో నడవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్–2 అధ్యక్షులు సూరెడ్డి వినయ్‌రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయ న మాట్లాడుతూ.. యువతరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడికే రాజు, బొమ్మరాజు నర్సింహ, నెరుట్ల జగన్, చేడం వెంకటరమణ గుప్తా, రామారావు, కిరణ్, శేఖర్, చంద్రశేఖర్, సోపాన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ గోడ- తప్పిన ప్రమాదం

బైకు ధ్వంసం,స్థానికుల ఆగ్రహం

బండ్లగూడ,సెప్టెంబర్ 28: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓ నిర్మాణ సంస్థ స్థానిక ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తుంది.ఓం నగర్‌లో అబ్బాం నిర్మాణ సంస్థ నిర్మించే బహుళ అంతుస్తుల భవనం చూటు 13ఫీట్ల ఎత్తున్న ప్రహరీ గోడ నిర్మిస్తుంది.వారు అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్మాణం చేపడుతుండటంతో ఆదివారం మధ్యాహ్నం ప్రహరీ గోడ కూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో అంతా ఊపిరి పిల్చుకున్నారు.కాగా ప్రహరీగోడ కూలడంతో ఒక బైకు ధ్వంసం అయింది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు అనేకం జరిగినట్లు స్థానికులు తెలిపారు.వెంటనే అధికారులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకుని నిర్మాణం చేపట్టలని వారు విజ్ఞప్తి చేశారు.



కూలిన అబ్బాం భవన నిర్మాణ ప్రహరీగోడ



రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గోల్డెన్ టెంపుల్ వద్ద హిల్వీ అపార్ట్‌మెంట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబురాలు



యూసుఫ్‌గూడలో బతుకమ్మ వేడుకలలో మహిళలతో కలిసి పాల్గొన్న మాగంటి సునీత (జూబ్లీహిల్)

రొమ్ము క్యాన్సర్‌ను ఎదుర్కొందాం

నెక్లెస్‌రోడ్‌లో పింక్ పవర్ రన్ • హాజరైన మిస్ వరల్డ్ సుచేత చౌంగ్‌శ్రీ



రన్‌లో పాల్గొన్న మిస్ వరల్డ్ తదితరులు



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద వాకథాన్‌లో మాట్లాడుతున్న ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : రొమ్ము క్యాన్సర్ ఎదుర్కొనేందుకు ముందుకు సాగాలంటూ మహిళా లోకం నినదించింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వేదికగా స్ట్రైడ్ అండ్ షైన్ నినాదంతో పింక్ పవర్ రన్ 2.0 నిర్వహించారు. ఈ రన్‌ను మాజీ భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్, మిస్ వరల్డ్ ఒపల్ సుచేత చౌంగ్‌శ్రీ, తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసులు, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, మీల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణా రెడ్డి, మీల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడేజ్, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ జూలియా మోర్లేతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌లో దేశ, విదేశాలకు చెందిన యువతీ యువకులు, మహిళలు వేలాదిగా హాజరయ్యారు. సుధా రెడ్డి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్‌ను నిర్వహించామని, వచ్చే ఏడాది కూడా చేపడుతామన్నారు. అనంతరం రన్‌లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

కేబీఆర్ పార్కువద్ద వాకథాన్

బంజారాహిల్స్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ వాకథాన్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనశైలికోసం ప్రతిరోజూ కొంత సమయాన్ని వాకింగ్‌తో పాటు వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డా. గోకుల్‌రెడ్డి,డా. రామకృష్ణ, డా.సందీప్‌తో సహా పెద్ద సంఖ్యలో 5కే రన్‌లో పాల్గొన్నారు.





బీఆర్ఎస్‌కు మరింత బలం

సులేమాన్ డివిజన్ అంటే బీఆర్ఎస్ కంచుకోటని సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎండీ జహీరోద్దీన్ అన్నారు. కాంగ్రెస్ మాయ మాటలకు మోసపోయి సీనియర్ నాయకులు కొందరు పార్టీని వీడిపోయిన వారు ఎనిమిది నెలల పాటు ఆ పార్టీలో గోస తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు కాలనీలలోని డ్రైనేజీ, తదితర సమస్యలు సైతం పరిష్కరించలేక పోయారన్నారు. ఇక నుంచి డివిజన్‌లో ఐక్యమత్యంతో బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, రవికుమార్, సహజా మేడం, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.– వ్యవసాయ యూనివర్సిటీ

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28: బతుకమ్మ ఉత్సవాలకు మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంగ్రె నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్‌లు వెల్లడించారు. ఈ నెల 30న హైదర్‌గూడ పెద్దతాళ్లకుంట వద్ద జరిగే బతుకమ్మ ఉత్సవాల పనులను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మల నిమజ్జనం సమయంలో భక్తులకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, విద్యుత్ అధికారులచే పనులు చేయిస్తున్నామన్నారు.


కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

నేడు శ్రీనివాసుడి కల్యాణం



శ్రీనగర్‌కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఎదుర్కోలు మహోత్సవం

బంజారాహిల్స్,సెప్టెంబర్ 28: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం సర్వభూపాల వాహనసేవ, సాయంత్రం గజవాహన సేవ శోభాయమానంగా నిర్వహించారు అనంతరం శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం కమనీయంగా నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం, సాయంత్రం గరుడవాహన సేవ నిర్వహించనున్నారని ఆలయ చైర్మన్ అర్జున్ యాదవ్, ఈవో శ్రీనివాస శర్మ తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28 : దేవీ శరన్నవరాత్రోత్సవాలతో పాటు బతుకమ్మ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకురాలు, హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ కె. ప్రసన్నరామ్మూర్తి ఆదివారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు.

విశ్వకర్మ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామ విశ్వకర్మ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా పెద్దోజు మాధవచారి, ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్ చారి,ప్రధాన కార్యదర్శిగా సుదర్శనచారి, సహాయ కార్యదర్శిగా అరవింద్, కోశాధికారిగా కమ్మరి పాండుచారి, గౌతమ్ చారి, నర్సింహ,శ్రీశైలం, ప్రభుచారిలతో పాటు పలువురిలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మాధవచారి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.